


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## నేడు సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సదస్సు

రెండోరోజు పర్యటనలో పాల్గొననున్న చంద్రబాబు

- వివరాలు 2 లో..

# కలిసి పనిచేద్దాం..

## సింగపూర్ ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ

- అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం అందించండి
- ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాలి
- సెమీకండక్టర్లు, క్వాంటమ్, యూనివర్సిటీ పరిశోధనలకు తోడ్పాటు అందించేలా విజ్ఞప్తి
- అమరావతి వివరాలు అడిగిన లారెన్స్‌వాంగ్
- ఏపీ-సింగపూర్ మధ్య ఎయిర్ కనెక్టివిటీపై విదేశీ వ్యవహారాల మంత్రితో సీఎం చర్చ



రెండురోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సోమవారం సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ నగర, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం అందించాలని కోరారు. ఏపీలో ఉద్యాన ఉత్పత్తులు, ఆక్వా ఉత్ప త్తులను దిగుమతి చేసుకునే అంశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా యూనివర్సిటీల్లో పరి శోధనలకు సంబంధించి సహకారం అందించాలని కోరారు. పోర్టులు-ఎయిర్ పోర్టుల అభివృద్ధితో పాటు వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకు నేలా ఏపీ-సింగపూర్‌లు కలిసి పనిచేయాలని కోరారు. అమరా వతి రాజధాని నిర్మాణాల గురించి సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

2



## భారత ఆర్థిక వృద్ధిలో కీలక చోదకశక్తిగా ఆంధ్రప్రదేశ్

- ఏపీ అభివృద్ధిలో భాగస్వామి కావాలి
- సింగపూర్ వెంచర్ క్యాపిటలిస్టులతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భారత హైకమిషనర్‌తోనూ సమావేశం

సంస్కరణలతో దూసుకుపోతున్న ఆర్థిక శక్తి భారత్ అయితే.. అందులో కీలక చోదకశక్తిగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా తొలిరోజు సోమవారం స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 5వ జనరేషన్ ఫైటర్ జెట్‌లు సహా వివిధ రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని వివరించారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఏపీలో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమని.. పెట్టుబడిదారులు ముందు కురావాలని పిలుపునిచ్చారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వెంచర్ క్యాపిటలిస్టులు స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందని వివరించారు. భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతోనూ సీఎం భేటీ అయ్యారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని కోరారు.

3

## డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామ్యం



- వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు టాస్క్‌ఫోర్స్
- ఆసియా-పసిఫిక్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశంలో నిర్ణయం
- ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రతిపాదనలు
- సంజీవని ప్రాజెక్టులో భాగస్వామి కావాలని విజ్ఞప్తి
- ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు, సప్లై చైన్ సిటీకి అవకాశాలు
- యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్స్‌లెన్స్‌కు ఆహ్వానం
- సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు

వివిధ రంగాల్లో సంయుక్తంగా కలిసి పనిచేసేం దుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం, గూగుల్ నిర్ణయించాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్ర బాబు గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. చర్చల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి ఇరువురు వచ్చారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామి కావాలని చంద్రబాబు కోరారు. మరోవైపు ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని కోరారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీస్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపా దించారు. సంజీవని ప్రాజెక్టులో గూగుల్ సంస్థ భాగస్వామి కావాలని కోరారు.

5



## గొడ్డలి పార్టీకి మహిళలంటే గౌరవం లేదు

- మంత్రి అనితపై వ్యక్తిగత దూషణలు దివాళాకోరుతనానికి నిదర్శనం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా


- వివరాలు 8 లో..




## 55 లక్షలకు 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్స్

- అత్యధికంగా కర్నూలు 5,34,217
- కోటి మంది లక్ష్యానికి చేరువగా

- వివరాలు 9 లో..



## మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

విశిష్ట సోమవారం సందర్భంగా మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హైదరాబాద్ నివాసంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కాంక్షిస్తూ మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు.

## రొయ్యల ఫీడ్ ధరల పర్యవేక్షణకు కమిటీ

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆక్వా రైతుల ప్రయోజనాలే ముఖ్యం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

5



ఆక్వా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలను పర్యవేక్షించేందుకు శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆక్వా రంగంలో ఫీడ్ ధరల నియంత్రణ, పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

చైతన్యరథం

# సింగపూర్ ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ

- అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం అందించండి
- ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాలి
- సెమీకండక్టర్లు, క్వాంటమ్, యూనివర్సిటీ
- పరిశోధనలకు తోడ్పాటు అందించేలా విజ్ఞప్తి
- అమరావతి నిర్మాణంపై అడిగిన లారెన్స్‌వాంగ్
- ఏపీ-సింగపూర్ మధ్య ఎయిర్ కనెక్టివిటీపై విదేశీ వ్యవహారాల మంత్రితో సీఎం చర్చ





సింగపూర్: రెండు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సోమవారం సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రధాని అధికారిక నివాసంలో 30 నిముషాల పాటు ఇరువురూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యంతో పండించిన ఉద్యాన ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులను దిగుమతి చేసుకునే అంశాలను పరిశీలించాలని చంద్రబాబు కోరారు. సింగపూర్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా యూనివర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించి సహకారం అందించాలని కోరారు. సెమీ కండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్, కెపాసిటి బిల్డింగ్‌లో తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగర, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ గవర్నెన్స్‌లోనూ సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పంటలు పండిస్తున్నట్టు వివరించారు. ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని ప్రత్యేకంగా కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగైన ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సాధిం చేలా ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. పోర్టులు-ఎయిర్ పోర్టుల అభివృద్ధితో పాటు వివిధ అవకాశాలను అందిపుచ్చుకు నేలా ఏపీ-సింగపూర్‌లు కలిసి పనిచేయాలని కోరారు. ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చల్లో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణాల గురించి సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ముఖ్యమం త్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో విద్యాసంస్థ లు, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడు తున్న నిర్మాణాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణాల గురించి సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి అత్యంత నివాసయోగ్యమైన నగరాల సరసన చేరనుం దని తెలిపారు. ఏపీలో ప్రజారోగ్యానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసే దిశగా ఏపీ ముందుకు వెళుతుందని తెలిపారు. అనంతరం ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల అంశంపై ఇరువురు చర్చించుకున్నారు. అందు బాటులో గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ చర్యల పైనా చర్చ జరిగింది. సేవల రంగం తరహాలోనే తయారీ, సప్లై చైన్ రంగాలు కూడా భారత్‌లో విస్తృతం అవుతాయని ఇరువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### విదేశీ వ్యవహారాల మంత్రితో భేటీ

సింగపూర్ ప్రధానితో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వీవీఎన్ బాలకృష్ణన్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ - సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలపై మధ్య చర్చ జరిగింది. ఏపీ-సింగపూర్ మధ్య విమాన సర్వీసులు, వివిధ విమానాశ్రయాలకు ఎయిర్ కనెక్టివిటీపై చర్చించారు. అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రికి సీఎం వివరించారు. తయారీ రంగంతోపాటు సేవల రంగంలోనూ ఏపీ అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తోందని తెలియచేశారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి లభ్యతతోపాటు సేవల రంగంలో నిపుణులైన మానవ వనరులు ఏపీలో ఉన్నాయని వివరించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ కీలకంగా ఉందని స్పష్టం చేశారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు, సరుకు రవాణాకు పోర్టులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో పాటు ఇంటర్నెట్ సహా డేటా సేవల కోసం సబ్ సీ కేబుల్‌ను ఏపీ నుంచి ప్రపంచానికి కనెక్ట్ చేస్తున్నారని తెలిపారు. అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని..ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రపంచ దిగ్గజ స్టీల్ తయారీ సంస్థ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని వివరించారు. ఈ సమావేశంలో ఏపీ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.






# నేడు సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సదస్సు

- రెండోరోజు పర్యటనలో పాల్గొననున్న చంద్రబాబు
- సీఐఐ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్‌షోకు హాజరు
- రాష్ట్రానికి పెట్టుబడులు-అమరావతి అభివృద్ధిపై
- వివిధ సంస్థల ప్రతినిధులతో వరుసగా భేటీలు

సింగపూర్: సింగపూర్‌లో రెండోరోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రణాళికలు, సెమీకండక్టర్ రంగ విస్తరణే లక్ష్యంగా మంగళవారం పలు అంతర్జాతీయ ప్రతి నిధుల బృందాలు, ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్త లతో చర్చలు జరపనున్నారు.

వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి కీలకోపన్యాసం చేయనున్నారు. ముందు గా కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీబీఎన్‌ఏ 361 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఆసియా-పసిఫిక్ సెమికాన్ ఎకోసిస్టమ్‌పై నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. తర్వాత సుర్బానా జురాంగ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. పట్టణాభివృద్ధి ప్రణాళికలపై సుర్బానా జురాంగ్ సీనియర్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్లు, నిపుణులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చిస్తారు. మధ్యాహ్నం సింగపూర్ ఉపప్రధాని, వాణిజ్య - పరిశ్రమల శాఖ మంత్రి గాన్ కిమ్ యాంగ్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి గాన్ సియో హువాంగ్, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు.

అలాగే వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో లీడర్‌షిప్ ప్లీనరీ-2 విభాగంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ స్టాళ్లు, సింగపూర్ పెవిలియన్, గూగుల్ స్టాళ్లను పరిశీలిస్తారు. సాయంత్రం సీట్రిఎం ప్రతినిధులతో సమావేశమై పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ, మెరైన్ రంగాలపై చర్చిస్తారు.

అనంతరం ఐహెచ్‌సీ, సీఐఐ పీఎస్ 2026 బిజినెస్ రోడ్‌షోలో పాల్గొని ఏపీ వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి పెట్టుబడిదారులతో ముఖాముఖి చర్చిస్తారు. దీంతో రెండురోజుల సింగపూర్ పర్యటన ముగుస్తుంది. ఈ కార్యక్రమాల్లో మంత్రి నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. మంగళ వారం రాత్రికి సింగపూర్ నుంచి తిరుగు ప్రయాణమై సీఎం చంద్రబాబు స్వదేశానికి చేరుకుంటారు.

## దూసుకెళుతున్న ఆర్థికశక్తి భారత్..

# కీలక చోదకశక్తిగా ఆంధ్రప్రదేశ్

- ఆర్టీఐహెచ్ ఆవిష్కరణలు, స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టండి
- ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లకు అనుకూలం
- క్వాంటమ్ టెక్నాలజీ సహా వివిధ రంగాల్లోనూ అవకాశాలు
- సింగపూర్ వెంచర్ క్యాపిటలిస్టులతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రాజెక్టులతో ఏపీ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపు
- రోబోటిక్స్, మెడికల్ డివైజెస్, హార్డ్‌వేర్ రంగాల్లో సహకారం
- విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యం ఏర్పాటుకు కృషిచేయాలి
- భారత హైకమిషనర్ శిల్పక్ అంబులేతోనూ సమావేశం



సింగపూర్: సంస్కరణలతో దూసుకుపోతున్న ఆర్థిక శక్తి భారత్ అయితే.. అందులో ఆంధ్రప్రదేశ్ కీలక చోదకశక్తిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. చైనా వంటి దేశాలు ఆర్థికవృద్ధికి దశాబ్దాల కాలం పడితే భారత్‌కు అంత సమయం అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆధునిక ఆలోచనలు, సంస్కరణలతో భారత్‌ను అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలిరోజు సోమవారం వెంచర్ క్యాపిటలిస్టులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్ ఇప్పుడు అగ్రస్థా నంలో ఉందన్నారు. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని వివరించారు. డెమో గ్రాఫిక్ డివిడెండ్‌తో అతిపెద్ద యువశక్తి ఉన్న మానవవనరుల దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. భారత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోందని వివరించారు. ఆంధ్రప్రదే శ్‌లో 5వ జనరేషన్ ఫైటర్ జెట్‌లు సహా వివిధ రక్షణ రంగ ఉత్పత్తులు తయారు చేసేలా ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయని వివరించారు. మెడికల్ టెక్నాలజీ, ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు.

### ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం

తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఏపీకి అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు, భూములు కేటాయించామని వివరించారు. ఏపీలో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం.. పెట్టుబడిదారులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామికవాడలు పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఏపీలో పౌరసేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామని వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందన్నారు. వెంచర్ క్యాపిటలిస్టులు ఆర్టీఐహెచ్ ప్రోత్సహించిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకురావాలని కోరారు. ఈ సమావేశానికి ఆరిజన్ వెంచర్స్, ఆటోమోనిక్స్, ఏలెవ్ 8 వెంచర్స్, ఆప్టిమమ్ సొల్యూషన్స్, క్వోనా క్యాపిటల్, జంగిల్ వెంచర్స్ తదితర వెంచర్ క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

### షిప్ బిల్డింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలం

**భారత హైకమిషనర్‌తో భేటీలో చంద్రబాబు**

తొలిరోజు పర్యటనలో ముందుగా సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. భారత్‌లో సింగపూర్‌కు ఉన్న ఆర్థిక, వాణిజ్య ఒప్పందా లను ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని స్పష్టం చేశారు. సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఏపీలో కొత్తగా పోర్టులు అందుబాటు లోకి వస్తున్నందున షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్, మెయింటె నెన్స్, రిపేర్స్ ఓవర్ హాలింగ్ కేంద్రాలకు నెలకొల్పేందుకు అవకా శం ఉందని తెలిపారు. ఏపీలో హార్టికల్చర్ ఉత్పత్తుల ట్రేసింగ్, సర్టిఫికేషన్‌కు వెళుతున్నామని వివరించారు. రోబోటిక్స్, మెడికల్ డివైజెస్, హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సింగపూర్ సహకారం కోరుతున్నామని తెలిపారు. సింగపూర్–ఏపీ విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యం ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. ఈ సమావేశా నికి మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈవో షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.



# జిల్లాను సస్యశ్యామలమే ప్రభుత్వ లక్ష్యం

- కోట్ల రూపాయల నిధులతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం
- రెండేళ్లలో 'నేరడి బ్యారేజ' పూర్తికి సీఎం స్పష్టమైన ఆదేశాలు
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి
- సుదీర్ఘంగా సాగిన నీటిపారుదల అభివృద్ధి బోర్డు అత్యవసర భేటీ



శ్రీకాకుళం (చైతన్య రథం): జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా నీటిపారుదల అభివృద్ధి బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ వంటి అపారమైన నీటి వనరులు కలిగిన వ్యవసాయ ఆధారిత జిల్లా అని పేర్కొన్నారు.

గత 2014-19 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో వంశధార, తోటపల్లి, మడ్డువలస, మహేంద్రతనయ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించి పనులను శరవేగంగా పరుగులు పెట్టించామని మంత్రి గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే దీన్ని ఒక సవాల్‌గా తీసుకుని, కేవలం మూడు నెలల కాలంలోనే ప్రత్యేక నిధులు మంజూరు చేసి, కాలువల పూడిక తీయించి శివారు ప్రాంత భూములకు సైతం సాగునీరు అందించగలిగామని తెలిపారు.

ప్రస్తుత సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేందుకు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షించామని మంత్రి వెల్లడించారు. వచ్చిన నీటిని వచ్చినట్లుగా చెరువులకు మళ్లించి, చివరి భూముల వరకు నీరందించేలా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.

జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఉన్న అంతర్రాష్ట్ర (ఒడిశా) అడ్డంకులన్నింటినీ అధిగమించామని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. గరిష్ఠంగా రెండు సంవత్సరాల కాలంలో నేరడి బ్యారేజ్ పనులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, ఇందుకు సంబంధించిన అంచనాలు, డీపీఆర్ సిద్ధమయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను శరవేగంగా పూర్తి చేసి 2027 ఖరీఫ్ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. వంశధార ఫేజ్–2 పనులు 2019 నాటికే 97 శాతం పూర్తయ్యాయని, కేవలం 3 శాతం పనులు మాత్రమే చేయాల్సి ఉందని, దీన్ని త్వరలోనే పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. వంశధార నదిపై గల లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టును ప్రజల సొమ్ము వృథా కాకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది ఖరీఫ్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జలధార కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వర్షాలకు ముందు భూగర్భ జల మట్టం 8 మీటర్లు, వర్షాల తర్వాత 3 మీటర్ల మేర ఉండేలా శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో జిల్లాలోని ప్రతి ఎకరానికి నీరిచ్చే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పునరుద్ఘాటించారు.

చైతన్యరథం

# అమరావతిలో సింగపూర్ నేషనల్ వర్సిటీ క్యాంపస్

- గ్లోబల్ ఇన్వెస్టర్లకు పాలసీల్లో సహకారం ఇవ్వండి
- ఎన్‌యూఎస్ ప్రతినిధులకు చంద్రబాబు ఆహ్వానం
- సీఐఐ ఏపీ బిజెనెస్ డెలిగేషన్‌తోనూ సమావేశం
- పరిశ్రమల స్థాపనకు భాగస్వాములను చేయాలి
- ఏపీ బ్రాండ్‌ను విదేశాల్లో ప్రమోట్ చేయాలని పిలుపు




సింగపూర్: అమరావతిలో యూనివర్శిటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని ప్రపంచంలో మేటి యూనివర్సిటీల్లో ఒకటైన నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ (ఎన్‌యూఎస్)ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ టాన్‌ఎంగ్ చేయ్‌తో సోమవారం చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీలో ఎన్‌యూఎస్ ఇంటర్నేషనల్ బ్రాంచ్, లేదంటే శాటిలైట్‌క్యాంపస్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ముఖ్యమంత్రి అమరావతిలో ప్రపంచస్థాయి విద్యా సంస్థల ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు రాజధాని ప్రాంతంలో కార్యకలాపాలు మొదలుపెట్టాయని వివరించారు. గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించేలా సరికొత్త పాలసీల రూపకల్ప నపై ఎన్‌యూఎస్ పాలసీ ఇనిస్టిట్యూట్ సహకారానికి విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు అమరావతి నిర్మాణ పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు. అమరావతి మాస్టర్‌ప్లాన్ రూపొందించడంలో తమభాగస్వామ్యాన్ని ప్రొఫెసర్లు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్యాంపస్ పెట్టాల న్న ముఖ్యమంత్రి సూచనపై సానుకూలంగా స్పందించిన టాన్ ఎంగ్ చేయ్ ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.



### ఏపీలో అవకాశాలను ప్రమోట్ చేయండి

తొలిరోజు పర్యటనలో సీఐఐ ఏపీ బిజెనెస్ డెలిగేషన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ప్రపంచంలో అనేక చోట్ల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని సీఎం వివరించారు. అన్ని రంగాల్లో తెలుగు పారిశ్రామికవేత్తలు ఉన్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. టెక్నాలజీ యుగంలో కొత్త ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం తరపున, దేశం తరపున విదేశీ పర్యటనల్లో పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తాం. ఏపీలో ఉన్న అవకాశాలు విదేశాల్లో వివరించే బాధ్యతను కూడా పారిశ్రామికవేత్తలు తీసుకోవాలి. రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడం అంటే సొంత రాష్ట్రంలో అవకాశాలను సృష్టించడమే అవుతుంది. మన బలాలు వివరించి విదేశీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావాలి. అవసరం అయితే విదేశీ కంపెనీ భాగస్వామ్యంతో పరిశ్రమలు స్థాపించాలి. అదే విధంగా ఇతర దేశాల్లో ఉన్న టెక్నాలజీని, వ్యాపారాన్ని రాష్ట్రానికి పరిచయం చేయాలి. ఏపీలో మంచి పాలసీలు ఉన్నాయి... సహకరించే ప్రభుత్వం ఉంది. మానవ వనరులు, భూములు, నీళ్లు ఉన్నాయి. ఏ రంగంలో అయినా ఏపీలో పెట్టబడులు పెట్టవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి సెమీ కండక్టర్ వరకు మనం బెస్ట్ పాలసీలతో సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని విదేశాల్లో బ్రాండ్ చేసే బాధ్యతను తెలుగు పారిశ్రామికవేత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సలహాదారు లిమ్ సియాంగ్ గువాన్‌తో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో పరిపాలనలో సంస్కరణల అమలు అంశాలపై చర్చించారు. గుడ్ గవర్నెన్స్ విషయంలో సీనియర్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆహ్వానించారు. మరోవైపు సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి లోయెన్ లింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. వివిధ రంగాల్లో సింగపూర్-ఏపీ భాగస్వామ్యంపై ఇరువురు చర్చించారు.

# సింగపూర్ వాణిజ్యమంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

**వివిధ రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ - ఐసీ ఎగ్జిక్యూటివ్ అడ్వైజర్‌తోనూ సమావేశం**





సింగపూర్: ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి లోయెన్ లింగ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో సింగపూర్-ఏపీ భాగస్వా మ్యంపై ఇరువురు చర్చించారు. అనంతరం ఆ దేశ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ సలహాదారు లిమ్ సియాంగ్ గువాన్‌తోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ భేటీలో పరిపాలనలో సంస్కరణల అమలు అంశాలపై చర్చించారు. గుడ్ గవర్నెన్స్ విషయంలో సీనియర్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలని గువాన్‌ను ఆహ్వానించారు.

## ఆర్చరీ విజేత ధీరజ్‌కు సీఎం చంద్రబాబు అభినందన



అమరావతి(చైతన్యరథం): ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-3 టోర్నీలో రెండు స్వర్ణాలు గెలుచుకున్న తెలుగు క్రీడాకారుడు, ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌కు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభి నందనలు తెలిపారు. టర్కీలోని ఆంటాల్యా వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో కుంకుమ్ మొహోద్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ తో పాటు పురుషుల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో కూడా బంగారు పతకం సొంతం చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆర్చరీలో తిరుగులేని స్థానంలో ఉన్న దక్షిణ కొరియాకు చెందిన లీ వూ సియోక్‌పై ఫైనల్‌లో విజయం సాధించడం ధీరజ్ ప్రతిభ కు నిదర్శనం. ధీరజ్, కుంకుమ్ మొహోద్, టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు చెప్పారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పొట్టపై 100 కార్లు.. చేతులపై నుంచి 100 బైక్‌లు

### చిన్న వయసులోనే సాహసం

### తాడిపత్రిలో అరుదైన రికార్డులు

అనంతపురం(చైతన్యరథం): అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఇరువురు సోదరులు చిన్న వయసులోనే అరుదైన సాహసం చేసి రికార్డులు సృష్టించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నే షనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించారు. నీల కంఠారెడ్డి, స్వాతి దంపతుల కుమారులు సాయి నరసింహారెడ్డి (13), గౌతమ్‌కుమార్‌రెడ్డి (12) శరీరం పైనుంచి 100 కార్లను, 100 బైకులను పోనిచ్చుకుని ఆశ్చర్యపరిచారు. శిక్షకుడు సాయిబాబా ఆధ్వర్యంలో ఆదివారం ఈ ప్రదర్శన జరిగింది. సాయి తన చేతులపై నుంచి 100 కార్లను, గౌతమ్ తన పొట్టపై 100 బైకులను పోనిచ్చుకున్నారు. ఈ ప్రదర్శనలతో వారు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించినట్లు శిక్షకుడు తెలిపారు.





చైతన్యరథం

# డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామ్యం

- వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు టాస్క్‌ఫోర్స్
- ఆసియా-పసిఫిక్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశంలో నిర్ణయం
- ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రతిపాదనలు
- సంజీవని ప్రాజెక్టులో భాగస్వామి కావాలని విజ్ఞప్తి
- ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు, సప్లై చైన్ సిటీకి అవకాశాలు
- యూఎన్ హాబిటాట్ సెంటరాఫ్ ఎక్స్‌లెన్స్‌కు ఆహ్వానం
- సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు



సింగపూర్: వివిధ రంగాల్లో సంయుక్తంగా కలిసి పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ నిర్ణయించాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ మేరకు జరిగిన చర్చల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేం దుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి ఇరువురు వచ్చారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ భాగస్వామి కావాలని కరణ్ బజ్వాను కోరారు. రెండురోజుల సింగపూర్ పర్య టనకు వెళ్లిన ముఖ్యమంత్రి వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గూగుల్ ఆసియా - పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో వివిధ కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదు పాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. మరోవైపు ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని కోరారు. ఆధునిక క్లౌడ్ సాంకేతికతలను వినియోగించుకుని రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలనేది తమ లక్ష్యమని సీఎం వివరించారు. అలాగే ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీస్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని.. దీనికి గూగుల్ నుంచి సహకారం కావాలని కోరారు. అంతేకాకుండా వైద్యసేవలు అందించే విషయంలో సాంకేతికను పూర్తిస్థాయిలో వినియోగిం చుకుంటూ సంజీవని ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో గూగుల్ సంస్థ భాగస్వామి కావాలని కోరారు. ఇక డేటా సెంటర్లకు, వివిధ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ కోసం తాము గ్రీన్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు సీఎం వివరించారు. ఈ మేరకు గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను గూగుల్ ప్రతినిధి కరణ్ బజ్వాకు వివరించారు.

## లాజిస్టిక్స్ రంగంలో అపార అవకాశాలు

### వైసీహెచ్ ప్రతినిధులతో భేటీలో చంద్రబాబు

సింగపూర్ వేదికగా సీఎం చంద్రబాబు జరిపిన వరుస సమావేశాల్లో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై వైసీహెచ్ గ్రూప్‌తో సీఎం చర్చించారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఏపీలో 1,053 కి.మీ సుదీర్ఘ సముద్రతీరం ఉందని, లాజిస్టిక్స్ పరంగా పెట్టుబడులు పెట్టేందుకు అనేక అనుకూలతలు ఉన్నాయని వివరించారు. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే కనెక్టివిటీ ఉందని తెలిపారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామంటూ ఏపీలోని లాజిస్టిక్స్ వసతులు, వనరులను వైసీహెచ్ గ్రూప్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు రాష్ట్రంలో ఉద్యానరంగంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు వస్తు న్నాయని వెల్లడించారు. ఆక్వాకల్చర్‌లో ఏపీ నెంబర్ 1 స్థానంలో ఉందని పేర్కొంటూ ఆహార ఉత్పత్తులకు మరింత విలువ జోడించడం ద్వారా ఎగుమతులు పెరిగాయని వివరించారు. ఏపీని సందర్శించి రాష్ట్రం అమలు చేస్తున్న పాలసీలు, అనుకూ లతలు చూసి పెట్టుబడులు పెట్టాలని వైసీహెచ్ గ్రూప్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

### యూఎన్ హాబిటాట్ ఈడీతో సమావేశం

యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని, దీనికి భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. యూఎన్ హాబిటాట్‌తో సంపూర్ణ భాగస్వామ్యం కోరుకుంటున్నామని అనాక్లాడియాకు తెలిపారు. దీనిపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యం, ప్రణాళిక దశలో ఎస్డీజీలను చేర్చడం, ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్ సహకారం పైనా యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి యూఎన్ హాబిటాట్ సహకారాన్ని కోరారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం(ప్రాఖ్రా) అమలుపై చర్చించారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్యస్థాయి నగరాల్లో అర్బన్ రాస్తా ఫ్రేమ్ వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయాలని సీఎం ప్రతిపాదించారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం- స్థానిక ఆదాయ వనరులను పెంచేందుకు వాల్యూ కాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టడం - అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ తదితర అంశాల పైనా చర్చించారు. ఈ సమావేశాల్లో మంత్రి నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




YCH లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో సీఎం చంద్రబాబు



యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

# రొయ్యల ఫీడ్ ధరల పర్యవేక్షణకు శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు

- ఆక్వా ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలను శాస్త్రీయంగా అంచనా వేయడం, పర్యవేక్షించడం, పారదర్శకమైన ఫీడ్ ధరల నిర్ణయానికి శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రొయ్యల ఫీడ్ పదార్థాల ధరల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఆక్వా రంగంలో ఫీడ్ ధరల నియంత్రణ, పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ కమిటీలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ, ఉప్పు నీటి ఆక్వా కల్చర్ కేంద్ర సంస్థ, మత్స్య విశ్వవిద్యాలయం, ఆక్వా ఫీడ్ తయారీదారుల ప్రతినిధులు, ఆక్వా రైతుల సంఘాల ప్రతినిధులు, ఏపీఎస్ఏడీఏ సభ్యులు, ఫీడ్ డీలర్ల సంఘాల ప్రతినిధులు, మత్స్య శాఖ సాంకేతిక నిపుణులు, ఆర్టీజీఎస్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. అదే విధంగా ముగ్గురు ఆక్వా రైతుల ప్రతినిధులు, ఇద్దరు ఏపీఎస్ఏడీఏ డైరెక్టర్లను మత్స్య శాఖ కమిషనర్ నామినేట్ చేయనున్నారని చెప్పారు. ప్రభుత్వ విధానపరమైన మార్గదర్శకత్వం, సమన్వయం మరింత సమర్థవంతంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కో-వైస్ చైర్మన్‌ను సభ్యునిగా చేర్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక విద్యా సంస్థ ప్రిన్సిపాల్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు.

రొయ్యల ఫీడ్ ధరలను ప్రభావితం చేసే ముడి పదార్థాల వ్యయం, తయారీ ఖర్చులు, రవాణా వ్యయాలు, మార్కెట్ పరిస్థితులు, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలను కమిటీ నిరంతరం సమీక్షిస్తుందని మంత్రి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేప పిండి, సోయాబీన్ తదితర ఫీడ్ పదార్థాల ధరలు, దిగుమతి, ఎగుమతి పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు.

ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు, డీలర్లు, ఇతర భాగస్వాముల అభిప్రాయాలను సేకరించి సాంకేతిక నిపుణులు, పరిశోధనా సంస్థల సహకారంతో పారదర్శకమైన ధరల నిర్ణయ విధానాలను రూపొందించడం ద్వారా ఆక్వా రైతులకు మేలు చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. డిజిటల్ యాప్ ఆధారంగా ఫీడ్ ధరల సమీక్ష, ఫీడ్ నాణ్యత ప్రమాణాల పరిరక్షణ, అంతర్జాల వస్తువుల సాంకేతికత వినియోగం, ఫీడ్ పొదుపు చర్యలు, ప్రత్యామ్నాయ ఫీడ్ పదార్థాలపై పరిశోధన మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఈ కమిటీ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఆక్వా రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, ఫీడ్ ధరల విషయంలో పారదర్శకత తీసుకురావడం, ఆక్వా రంగాన్ని మరింత లాభదాయకంగా తీర్చిదిద్దడం కోసం ఈ శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

చైతన్యరథం







## లోకేష్, బ్రాహ్మణి దంపతుల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

హైదరాబాద్(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హైదరాబాద్ నివాసంలో సోమవారం వేద పండి తుల ఆధ్వర్యంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షే మం కాంక్షిస్తూ మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు. రుత్వికుల వేదమంత్రాల మధ్య లోకేష్ దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.





# ఏపీ పర్యాటకానికి జాతీయస్థాయిలో మరో గుర్తింపు

- దేశంలోనే 'మోస్ట్ ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్'గా అరకు
- 'ఇండియన్ రూట్స్ - ఎడిటర్స్ ఛాయిస్' విభాగంలో జాతీయ గుర్తింపు
- సోషల్ మీడియా ప్రమోషన్లు, ఇన్‌ఫ్లూయెన్సర్ల ప్రచారానికి దక్కిన ఫలితం
- సదస్సులో 'ది ఆంధ్ర మోడల్ ఫర్ టూరిజం' ప్రజెంటేషన్‌కు విశేష స్పందన
- అరకు కాఫీ రుచులను ఆస్వాదించిన గోవా గవర్నర్ పూసపాటి

అమరావతి/గోవా (చైతన్య రథం): ప్రస్తుత డిజిటల్ యుగంలో పర్యాటకులు తమ పర్యటనల గురించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా వేదికలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి ప్రేమికులను మైమరిపించే దేశంలోనే మోస్ట్ ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్‌గా మన అరకు సరికొత్త రికార్డు సృష్టించి, ప్రతిష్టాత్మక ఇండియన్ రూట్స్ – ఎడిటర్స్ ఛాయిస్ జాతీయ పురస్కారాన్ని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా సొంతం




చేసుకోవడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వినూత్న ఆలోచనలతో సోషల్ మీడియా వేదికల ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అందాలు దేశవ్యాప్తంగా విస్తృతంగా చేరుకోవడంతో రాష్ట్ర ప్రజాదరణ మరింత పెరిగిందని ఈ అవార్డు స్పష్టం చేస్తోంది.

దేశవ్యాప్తంగా పర్యాటక రంగ విధాన రూపకర్తలు, పరిశ్రమల అధిపతులు పాల్గొన్న ఈ జాతీయ సదస్సులో ఏపీ టూరిజం తనదైన ముద్ర వేసింది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ పద్మారాణి శీలా "ది ఆంధ్ర మోడల్ ఫర్ టూరిజం" అనే అంశంపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పర్యాటక రంగ వృద్ధి, అనుభవపూర్వక పర్యాటక వ్యవస్థ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆమె వివరించారు. సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అరకు కాఫీ స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజుతో పాటు పలువురు ప్రముఖులు ఈ స్టాల్‌ను సందర్శించి, ప్రీమియం అరకు కాఫీ రుచిని ఆస్వాదించి అభినందించారు. అవార్డు అందుకున్న అనంతరం పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎండీ (ఎఫ్ఏసీ) పద్మావతి హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక రంగాన్ని సరికొత్త పంథాలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పర్యాటక శాఖ ఇటీవల సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో చేసిన ప్రత్యేక ప్రమోషన్లు, విస్తృతమైన డిజిటల్ ప్రచార కార్యక్రమాలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చి ఈ జాతీయ స్థాయి గుర్తింపునకు కారణమయ్యాయని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునఃప్రతిష్టాపనకు రెండేళ్లు

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం హర్షణీయం
- సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా రెండేళ్ల పాలన
- విజయోత్సవ సభలో మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం (చైతన్య రథం): రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రతి క్షణం పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ...

రాష్ట్రాన్ని అరాచకం నుండి కాపాడుకుని సంక్షేమం, అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నందుకు ఆనందంగా ఉంది. గత ఐదేళ్ల అరాచకం నుండి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాం. గత ప్రభుత్వ గాయాల నుండి బయటపడి ప్రజలకు కొత్త పాలన చూపించాం. ఈ నెల 12న తిరుపతిలో విధ్వంసం నుండి వికాసం కార్యక్రమం నిర్వహించాం. రాష్ట్రంలోని ప్రజలందరినీ చైతన్యపరచడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

2014లో రాష్ట్రం విడగొట్టి, రాజధాని కూడా లేకుండా చేశారు. 16 వేల కోట్ల లోటు బడ్జెట్లోనూ ఐదేళ్లు పాటు సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేశాం. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుండి రావాల్సిన నిధులు రప్పించుకున్నాం. 2019 ఎన్నికల్లో జగన్ రెడ్డి అనేక అలవికాని హామీలిచ్చి, ప్రజల్ని తప్పుదోవ పట్టించి అధికారంలోకి వచ్చాడు. ఫలితంగా రాష్ట్రం నష్టపోయింది. సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. అభివృద్ధిని దెబ్బతీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతిని నాశనం చేశారు. కార్పొరేషన్ నిధులు దారి మళ్లించారు. ప్రభుత్వ ఆస్తుల్ని అమ్మేశారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలుపెట్టి మొత్తం వ్యవస్థను అస్తవ్యస్తం చేశాడు.

ఎన్నికలకు ముందు వరకు అమరావతే రాజధాని అన్నాడు. అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట తో భూములిచ్చిన రైతుల్ని అవమానించాడు. న్యాయం కోరిన రైతుల్ని లాఠీలతో చితక్కొట్టాడు. పోలవరం ఎత్తు తగ్గించేశాడు. గ్రావిటీ ద్వారా రావాల్సిన నీళ్లు రాకుండా చేశాడు. రాష్ట్రానికి జీవనాడిలా నిలిచే పోలవరం ప్రాజెక్టుని తెలంగాణకు తాకట్టు పెట్టాడు. ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మేయాలనుకున్నాడు.

రెవెన్యూ వ్యవస్థలో చేసిన దుర్మార్గాలకు అంతే లేదు. ప్రజల భూముల్ని కబ్జా చేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చాడు. భూమి పత్రాలపై తన బొమ్మ వేయించుకున్నాడు. రూ. 700 కోట్ల వ్యయంతో సర్వే రాళ్లపై తన బొమ్మలు వేయించుకున్నాడు. స్కూల్ భవనాలకు, పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులేసి రూ. 1,600 కోట్లు, తీయడానికి మరో రూ. 1,600 కోట్లు ఖర్చు చేశాడు. ప్రజా ధనాన్ని ఎంత దారుణంగా దుబారా చేశాడో చెప్పడానికి ఇంత కంటే నిదర్శనం ఏముంటుంది.

చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పరిశ్రమలు ఎలా తేవాలి, పెట్టుబడి ఎలా పెట్టించాలి, యువతకు ఎలా ఉద్యోగాలివ్వాలని ఆలోచించి పరిశ్రమలు తీసుకొచ్చారు. వాటన్నింటినీ జగన్ వెనక్కి తరిమేశాడు. అమరరాజా, లులూ మాల్ లాంటి ప్రఖ్యాత పెట్టుబడుల్ని తరిమేశాడు. ఏపీలో పెట్టుబడి పెట్టొద్దని యూసుఫ్ అలీ లాంటివారు బహిరంగంగా చెప్పే పరిస్థితి దాపురించింది. ప్రజలు నోరెత్తాలంటేనే భయపడే పరిస్థితి కల్పించారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా కేసులు పెట్టారు. అవినీతిని ప్రశ్నించిన ప్రతి ఒక్కరిని జైళ్లలో పెట్టించారు.

తల్లి, చెల్లిని సైతం ఇంట్లో నుండి గెంటేసిన జగన్ రెడ్డి సొంత బాబాయిని హత్య చేయించి తొలుత గుండెపోటు అన్నారు, తర్వాత గొడ్డలిపోటు అన్నారు. సొంత చెల్లి పోరాటం చేయడంతో ఆమెపైనే నెపం నెట్టి అవమానించాడు. హత్య జరిగినపుడు సీబీఐ విచారణ కావాలన్నాడు. అధికారంలోకి వచ్చాక సీబీఐ విచారణ వద్దు అన్నాడు. నిందితులను వెనకేసుకొచ్చాడు.

ఉపాధ్యాయ నియామకాల స్పోర్ట్స్ కోటాలో ఒక సామాజిక వర్గానికే ఉద్యోగాలిచ్చారంటూ రాష్ట్రంలో అరాచకాలు చేస్తున్నాడు. గతంలో ఏమరపాటుగా ఉన్నందున రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి పోయింది. ఇప్పుడు అదే తప్పు చేయడానికి వీల్లేదు.

రాష్ట్రానికి వచ్చే ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లకే సరిపోతున్నప్పటికీ కేంద్రం నుండి వచ్చే నిధులతో సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటున్నాం. పరిపాలనా దక్షత కలిగిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండడంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

దాదాపు 63 లక్షల మందికి రూ. 4 వేల చొప్పున రెండేళ్లలో రూ. 65 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అందించాం. మరో 8 లక్షల పెన్షన్లు త్వరలోనే మంజూరు చేయబోతున్నాం. తల్లికి వందనం పథకం ద్వారా 68 లక్షల మందికి అందిస్తున్నాం. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం. రైతులకు రూ. 20 వేలు అందిస్తున్నాం. పంట అమ్ముకున్న 24 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నాం. ఉచిత బస్సు పథకం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం.

గత ఐదేళ్లు జగన్ రెడ్డి సుమారు 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ. 32 వేల కోట్లు ప్రజలపై భారం వేస్తే, నేడు ట్రూ డౌన్ ద్వారా ప్రజలపై భారం తగ్గిస్తున్నాం. సోలార్ వినియోగాన్ని పెంచడం కోసం కేంద్రం ద్వారా సబ్సిడీ అందిస్తున్నాం. బీసీలకు కేంద్రం రూ. 78 వేలు సబ్సిడీ ఇస్తే రాష్ట్రం రూ. 20 వేలు ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్నాం.

గతంలో రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి భయపడిన వారు ఇప్పుడు క్యూ కడుతున్నారు. దాదాపు 28 పాలసీలు తీసుకొచ్చాం. ఫలితంగా దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టాం. 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. 260కి పైగా కేసులు వేస్తే అన్నీ పరిష్కరించి ఉద్యోగాలిచ్చాం. అందరూ ఉద్యోగాల్లో చేరిపోయిన తర్వాత ఇప్పుడు ఏదో జరిగిపోయిందంటూ కుట్రలు చేస్తున్నాడు. కానిస్టేబుల్ నియామకాలు కూడా పకడ్బందీగా చేశాం.

భోగాపురం విమానాశ్రయం పనులు చేస్తే ఎర్రబస్సులు కూడా తిరగని చోట ఎయిర్‌పోర్టులు అవసరమా అన్న జగన్ రెడ్డి ఇప్పుడు నేనే తీసుకొచ్చాననంటున్నాడు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తే మేమే మాట్లాడామంటున్నాడు. అమెరికా తర్వాత రెండో గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేస్తే అదో గోదాం అని అవమానించారు. ఇప్పుడు అది కూడా మా క్రెడిట్ అంటున్నాడు. భవిష్యత్తును ఊహించి పాలన సాగిస్తాడనడానికి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రత్యక్ష నిదర్శనం.

మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలకు వెళ్లి ఏపీకి పెట్టుబడులు తీసుకురావాలి, పరిశ్రమలు పెట్టాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులతో భారీ ప్రకటన ఇచ్చే స్థాయికి రావడం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులకు నిదర్శనం. ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ స్కూళ్ల ముందు నో అడ్మిషన్ బోర్డులు వెలిశాయంటే ఏ స్థాయిలో అభివృద్ధి సాధించామో అర్థం చేసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వంలోని ప్రతి నాయకుడు పని చేస్తున్నారు. మున్సిపాలిటీకి రూ. 300 కోట్ల నిధులు రప్పించుకున్నాం. రుద్రవరంలోని ఇళ్లు మొత్తం పూర్తి చేస్తాం. కరగ్రహారంలో 19 వేల ఇళ్లున్నాయి. వాటన్నింటి సమస్యలు పరిష్కరించి ప్రజలకు అందిస్తాం.

రాష్ట్రంలో నిత్యం జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్నాడు. దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణానికి పాల్పడి దోపిడీ నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు నానా యాగీ చేస్తున్నాడు. ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అని ఆరోపించిన జగన్ రెడ్డి సవాల్ చేస్తే పారిపోయాడు. 2019లో జరిగిన పొరపాటు మళ్లీ చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటి చెప్పాలి. సర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఓటును గుర్తించాలి. ఈ నెల 15 నుండి వచ్చే నెల 14 వరకు ప్రతి ఓటరుని కలిసి సంరక్షించాలి. 2029 ఎన్నికల నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షులు గెడ్డం రాజు, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, పట్టణాధ్యక్షులు స్వామి, సెక్రటరీ బచ్చుల అనిల్, నారాయణప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణికుమార్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ హాసీం బేగ్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, జనసేన రూరల్ అధ్యక్షులు తిమోతి, సీనియర్ నాయకులు పొట్టి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి గంపల భవాని, సమీర్ తదితర నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# సినీ పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ

- మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ వెల్లడి
- ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డు తొలి సమావేశం



విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం తొలి బోర్డు సమావేశం సోమవారం విజయవాడ ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించామని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్ తెలిపారు. సమావేశానికి కార్పొరేషన్ చైర్మన్ పి భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డైరెక్టర్లు వై ధూన్సీ, సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, చదలవాడ శ్రీనివాసరావు, బుర్రా సాయిమాధవ్, కందిమళ్ల సాంబశివరావు, వివేక్ కూచిభొట్ల, వి సముద్ర, కె ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకటకృష్ణా రెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వరయాదవ్, డి సత్యనారాయణ, దుర్గాప్రసాద్ సాహు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. బోర్డు డైరెక్టర్ల సభ్యుల్లో ఒకరైన చిక్కాల మెహర్ రమేష్ కుమార్‌ను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బోర్డు సమావేశానంతరం అసాధారణ సాధారణ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, చిత్రీకరణకు అనుకూల వాతావరణం కల్పించడం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులు, భవిష్యత్తులో నిర్వహించాల్సిన నంది అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలు, విధివిధానాలు, సూచనలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు ప్రోత్సాహం అందించేలా కార్పొరేషన్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్ తెలియజేశారు. సమావేశంలో ఏపీ ఫిలిం, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముదావత్ శ్రీనివాస్ నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# భవిత యువతదే!

- విజయనగరం, శ్రీకాకుళం వెనుకబడిన జిల్లాలు కాదు..
- వెనకుండి నడిపించే జిల్లాలు..
- ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్..
- స్టీల్ ప్లాంట్ ఈ ప్రాంత దశనే మార్చనుంది
- నిరుద్యోగ యువతకు అసంఖ్యాకంగా అవకాశాలు
- విజయోత్సవ సభలో హోంమంత్రి వంగలపూడి అనిత



విజయనగరం (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే పాలనలో భవిత యువతదేనని హోంమంత్రి వంగలపూడి అనిత ఉద్ఘాటించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడిన జిల్లాలు కాదని, రాష్ట్రాభివృద్ధికి వెనకుండి నడిపించే జిల్లాలుగా మారాయని పేర్కొన్నారు. త్వరలోనే భోగాపురం ఎయిర్ పోర్టును ప్రధాన మోదీ ప్రారంభించనున్నారని అంటూ.. ఉత్తరాంధ్రకు వచ్చిన గూగుల్ డేటా సెంటర్, స్టీల్ ప్లాంట్‌లాంటి ఎన్నో పరిశ్రమలు నిరుద్యోగ యువతకు అసంఖ్యాక అవకాశాలు తీసుకురానున్నాయని అన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" జిల్లాస్థాయి విజయోత్సవ సభకు హోంమంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. 'డ్రగ్స్ రహిత రాష్ట్రం' థీమ్‌తో నిర్వహించిన జిల్లా విజయోత్సవ సభలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విజయోత్సవ సభల ద్వారా వివరిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, దేశంలోనే పింఛనులు అత్యధికంగా ఇస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమేనన్నారు ఒంటరి మహిళకు, దివ్యాంగులకు, అవ్వ, తాతలకు ఎన్డీఏ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అంటూ.. అన్నదాత సుఖీభవతో రైతులకు అండగా నిలుస్తున్నామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే, అంతమందికీ తల్లికి వందనం ఇచ్చామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు.. లోకేష్ పాదయాత్ర సమయంలో ఆయన దృష్టికి వచ్చిన గంజాయి, డ్రగ్స్‌పై ఎన్డీయే ప్రభుత్వంలో ఉక్కుపాదం మోపామన్నారు. ఈగల్ అనే వ్యవస్థను తీసుకువచ్చామని, గంజాయి రవాణా చేసిన, సాగు చేసిన, గంజాయి సేవించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాదు, ఆస్తులనూ జప్తు చేస్తున్నామన్నారు. "చదువుకున్న వయసులో చిన్న చిన్న తప్పిదాలు వలన వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. విద్యార్థులు ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఎన్డీయే ప్రభుత్వంలో ఉద్యోగాలు మీ ఇంటికి వస్తున్నాయి. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కోసం మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారు. పిల్లల చదువులు కోసం తల్లిదండ్రులు త్యాగాలు చేసి పిల్లలను చదివిస్తున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అందమైన భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని మంత్రి అనిత పిలుపునిచ్చారు.

## వైసీపీ వ్యాఖ్యలు.. దివాళాకోరు

### రాజకీయాలకు నిదర్శనం: పల్లా



*అమరావతి (చైతన్య రథం): హోంమంత్రి అనితపై గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ సంస్కారహీన, దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఏవిధంగానూ సమర్థించలేమని స్పష్టం చేస్తూ.. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని పల్లా ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నేతల మాటల్లో మహిళలపట్ల గౌరవం, బాధ్యత పూర్తిగా లోపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.*

# దళిత హోంమంత్రిపై గుడివాడ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- అనిత వ్యక్తిత్వాన్ని కించపర్చటం మహిళా సమాజాన్ని అవమానించటమే
- అమర్నాథ్ వెంటనే క్షమాపణ చెప్పాలి.. లేదంటే చర్యలు తప్పవు
- ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత ధ్వజం



మంగళగిరి (చైతన్య రథం): వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని, అవి మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత మండిపడ్డారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ... "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అని మన సంస్కృతి చెబుతుంది. మహిళలను గౌరవించే చోటే శుభం, అభివృద్ధి, శాంతి ఉంటాయి. మహిళలను అవమానించే చోట వినాశనం తప్పదని మన పురాణాలు హెచ్చరిస్తున్నాయి. నిన్న మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అదే వినాశకర రాజకీయ సంస్కృతికి నిదర్శనం.

రాష్ట్ర హోంమంత్రి, దళిత మహిళ అయిన వంగలపూడి అనితపై ఆయన చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ప్రతి మహిళను, ప్రతి బాధ్యతగల పౌరుడిని ఆవేదనకు గురిచేశాయి. రాజకీయాల్లో విమర్శలు సహజం.

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించవచ్చు. కానీ ఒక మహిళ వ్యక్తిత్వాన్ని, ఆమె రూపాన్ని, ఆమె ఆత్మగౌరవాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం రాజకీయ విమర్శ కాదు, అది మహిళలపై దాడి. అమర్నాథ్‌కు ఒక ప్రశ్న. ఒక మహిళ ఆత్మవిశ్వాసంతో, గౌరవంగా, హుందాగా ప్రజల ముందుకు రావడం తప్పా? ఒక మహిళ సమాజ సేవ కోసం ముందుకు రావడం తప్పా? ఆమె తనను తాను సక్రమంగా ప్రదర్శించుకోవడం తప్పా? మీ కుటుంబంలోని మహిళలు కూడా ప్రజల్లోకి వస్తారు. వారు కూడా గౌరవంగా, ఆత్మవిశ్వాసంతోనే బయటకు వెళ్తారు. అలాంటప్పుడు మరో మహిళను కించపరచే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? వంగలపూడి అనిత ఈరోజు రాష్ట్ర హోంమంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమె ఎదుగుదల, కష్టపడి సాధించిన స్థానం మీకు ఆదర్శంగా ఉండాలి. కానీ ఆమెపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలవాలని ప్రయత్నించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

### మహిళలను విమర్శించడం వైసీపీ నైజం

"ఒక మహిళను గొడ్డలి పార్టీ నేత దూషించడం కొత్త విషయం కాదు. మహిళలపై దాడి చేయడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారింది. వైసీపీ నాయకులు గతంలో కూడా మహిళలపై ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు చేశారు. భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారు. అమరావతి మహిళలను వేశ్యలు అంటూ కించపరిచారు. పంచుమర్తి అనురాధ, కావలి గ్రీష్మ, స్వాతి రెడ్డి వంటి ఎందరో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులను సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా దూషించారు. గతంలో నాపై కూడా వైసీపీ మహిళా నాయకురాలు రోజా వ్యక్తిగత దూషణకు పాల్పడింది. గొడ్డలి పార్టీ నేతలు ఒకటి అంటే దానికి ప్రతిస్పందనగా మేము 20, 30 మాటలు అనగలం. కానీ మా అధినాయకుడు ఆ సంస్కృతిని మాకు నేర్పించలేదు.

మా పార్టీ విలువలు, క్రమశిక్షణతో కూడిన పార్టీ. ఫేక్ ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు, గొడ్డలి వేటు, అసభ్య రాజకీయాలకు వైసీపీ పెట్టింది పేరు. నిన్న గాక మొన్న అంబటి రాంబాబు, ప్రసన్న కుమార్ రెడ్డి, నేడు గుడివాడ అమర్నాథ్ ఇలా రోజుకొక నాయకుడితో మహిళలను అవమానపర్చడం గొడ్డలి పార్టీ అజెండా. ఏనాడు జగన్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదని దుయ్యబట్టారు.

### మహిళా సాధికారత కూటమి లక్ష్యం

"కూటమి ప్రభుత్వం మహిళల సాధికారత కోసం పనిచేస్తోంది. స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహాయం, పెట్టుబడుల్లో రాయితీలు వంటి అనేక కార్యక్రమాలతో మహిళలకు అండగా నిలుస్తోంది. మహిళలను గౌరవించే ప్రభుత్వాన్ని చూసి తట్టుకోలేని గొడ్డలి పార్టీ మహిళా నేతలను లక్ష్యంగా చేసుకొని అవమానిస్తుంది. ఒక దళిత మహిళను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు చప్పట్లు కొడతారని భావించడం మీ రాజకీయ అవగాహనలోని దారిద్ర్యం. మహిళలను అవమానించడం ద్వారా కాదు, ప్రజలకు సేవ చేయడం ద్వారా గౌరవం సంపాదించాలి. అనితను దూషించి పాపులర్ అవ్వాలని కొడిగుడ్డు అమర్నాథ్ ప్రయత్నిస్తున్నాడు. మహిళను అవమానిస్తే చరిత్రలో లేకుండా పోతారు. ఇప్పటికైనా హోంమంత్రి వంగలపూడి అనితకు అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకపోతే మహిళల గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటుంది. మహిళలను అవమానించే వారిని రాష్ట్ర మహిళా లోకం ఎప్పటికీ క్షమించదని హెచ్చరించారు.

### ప్రభుత్వ ఆస్తులు అమర్నాథ్ సొత్తు కాదు

"నేను వదిలేసిన కార్లలోనే తిరుగుతున్నావు" అని అమర్నాథ్ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనం. ప్రభుత్వ వాహనాలు ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తులు కావు. అవి ప్రజల సొత్తు. ప్రజల పన్నుల డబ్బుతో కొనుగోలు చేసిన వాహనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదవుల్లో ఉన్నవారికి కేటాయిస్తారు. అవి అమర్నాథ్ వ్యక్తిగత ఆస్తులు కావు, ఆయన కుటుంబానికి చెందినవి కూడా కావు. ప్రజాస్వామ్యంలో పదవులు, అధికారాలు ఎవరికీ శాశ్వతం కావు. ప్రజలు ఆశీర్వదిస్తేనే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు అవుతారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే అదే ప్రజలు తిరస్కరిస్తారు కూడా. ప్రజలకు సేవ చేసి వారి హృదయాల్లో స్థానం సంపాదించినవారే రాజకీయాల్లో కొనసాగగలుగుతారు. పదవులు వ్యక్తిగత హక్కులు కావు, ప్రజలు ఇచ్చే బాధ్యతలు మాత్రమే. అందుకే మంత్రిగా నువ్వు పనికిరావని ప్రజలు తేల్చి అమర్నాథ్‌ను తిరస్కరించి ఇంటికి పంపారు. కాబట్టి ప్రభుత్వ వాహనాల గురించి 'నేను వదిలేసిన కార్లు' అన్నట్లుగా మాట్లాడటం సరికాదు. అవి ఆయన సొత్తు కాదు, ప్రజల ఆస్తి. ప్రజల ఆస్తిని తన వ్యక్తిగత ఆస్తిగా భావించే మనస్తత్వమే అమర్నాథ్ వ్యాఖ్యల్లో బయటపడిందని అన్నారు.

# తల్లి, చెల్లికి జగన్ నుంచి ప్రాణగండం

- మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ విష ప్రచారం
- త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్
- సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ కొట్టాం
- మీడియా సమావేశంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ ధ్వజం

మంగళగిరి (చైతన్య రథం): గొడ్డలి పార్టీ నేత జగన్ కేవలం ఆస్తుల వ్యామోహంతో తన తోడబుట్టిన చెల్లెళ్లకు, తల్లికి ఘోర అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాడు బాబాయిని చంపేసిన జగన్... నేడు ఆస్తుల కోసం తల్లి, చెల్లిని వేధిస్తున్నారని... రాబోయే రోజుల్లో వారిని కూడా చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుండి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం వికాసం వైపు అడుగులు వేస్తోంది. 2004 నాటికి సొంత ఇళ్లు అమ్ముకునే స్థితిలో ఉన్న వైఎస్సార్ కుటుంబం, నేడు



జగన్మోహన్ రెడ్డి సంపాదించిన అక్రమాస్తుల కోసం కొట్టుకునే స్థాయికి చేరింది. సొంత తోడబుట్టిన చెల్లెళ్లే తమ అన్న తమకు అన్యాయం చేశాడని బహిరంగంగా చెబుతున్నారు.

గత ఐదేళ్ల జగన్ పాలనలో మైనారిటీల సంక్షేమం పూర్తిగా కుంటుపడింది. నంద్యాల, కర్నూలు, ఆదోని, గుంతకల్, కదిరి, హిందూపురంలో పీఎంజీఎవై పథకం ద్వారా నిర్మించిన మైనారిటీల వసతి గృహాల కోసం జగన్ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 270 కోట్లు ఖర్చు చేసింది. కడపలో రూ. 23 కోట్లతో నిర్మించిన హజ్ భవన్, గుంటూరులో రూ. 16 కోట్లతో నిర్మిస్తున్న క్రిస్టియన్ భవనాన్ని పూర్తి చేసేందుకు ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో జగన్‌కు చేతులు రాలేదు.

చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ మైనారిటీల శ్రేయస్సుకు కట్టుబడి ఉంది. మైనారిటీల సంక్షేమం కోసం రూ. 5,000 కోట్లు కేటాయించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా హజ్ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం. ప్రస్తుతానికి 1,630 మంది హజ్ యాత్రకు వెళ్లగా, 331 మందికి లక్ష చొప్పున నిధులు జమ చేశాం. గతంలో మిగిలిపోయిన 72 మందికి కూడా ఈ సాయం అందించాం. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు అందిస్తున్నాం. తాలీం ఏ హునర్ పథకం ద్వారా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రూ. 6 కోట్లు ఖర్చు చేసి 250 మంది మైనారిటీ విద్యార్థులను చదివిస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఆరుగురు పిల్లలున్నా అందరికీ ఇస్తున్నాం. జగన్ లాగా ఒక్కరికే ఇచ్చి మోసం చేయలేదు. దీనివల్ల మైనారిటీ బిడ్డలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.

రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ కార్యక్రమాలు చేస్తోంది. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైకాపా కార్యకర్తే. నంద్యాలలో అల్లర్లు సృష్టించాలని గొడ్డలి పార్టీ పన్నాగం పన్నింది. రాష్ట్రంలో అశాంతి రేపడమే జగన్ లక్ష్యం. వైసీపీ నిరసనలకు మనుషులు దొరకక గాడిదలు, గుర్రాలతో వినూత్న నాటకాలు ఆడుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా మేం నిరసనలు చేస్తుంటే అడ్డుకున్నారు, అణచివేశారు. కానీ నేడు చంద్రబాబు పాలనలో గొడ్డలి పార్టీ వారు ప్రశాంతంగా నిరసనలు తెలుపుకునే స్వేచ్ఛ కల్పించాం.

ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ రాబోతోందని మంత్రి స్పష్టం చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ. 93 కోట్లు, కోర్టుల అభివృద్ధికి రూ. 190 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశాం. ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని నిరంతరం స్మరించుకుంటున్నారు. జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం హామీలకు ఎగనామం పెడితే... మేం 90 శాతం హామీలను అమలు చేసి చూపించాం. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాం. గొడ్డలి పార్టీ విష ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు.

## 55 లక్షలకు చేరిన 'యోగాంధ్ర' నమోదులు

### ఏర్పాట్ల వారీగా జిల్లాలకు స్థానాలు

### కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా యంత్రాంగం కృషి




అమరావతి (చైతన్య రథం): యోగాంధ్ర-2026 కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం వరకు 55 లక్షల నమోదులు జరిగాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన నమోదులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 24 లక్షల నమోదులు జరిగాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 5,34,217, అనంతపురం జిల్లాలో 4,98,758, నెల్లూరు జిల్లాలో 4,94,757, కడప జిల్లాలో 4,79,510 నమోదులు జరిగాయి. ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా జిల్లాల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరగనుంది. వైద్య విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో యోగాసనాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లపై సోమవారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 1,27,562 యోగాసన కార్యక్రమాల వేదికలను గ్రామ-వార్డు స్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటివరకు 72,688 వేదికలు సిద్ధమయ్యాయి. అత్యధికంగా ఏలూరు జిల్లాలో 9,575, పశ్చిమగోదావరి జిల్లాలో 4,702, విజయనగరంలో 4,653, నెల్లూరు జిల్లాలో 4,253 వేదికలు సిద్ధమయ్యాయి. యోగా శిక్షకుల సంఖ్య 1,62,369 వరకు నమోదైంది. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో పురోగతిని కనబరిచే జిల్లాలకు స్థానాలు కూడా ప్రకటిస్తున్నారు. పౌరుల నమోదులు, యోగా శిక్షకులకు శిక్షణ, మ్యాపింగ్, వేదికల గుర్తింపు, పోటీల నిర్వహణ వర్గాల్లో కలిపి జిల్లాల వారీగా పురోగతిని గమనించినప్పుడు గుంటూరు, ఏలూరు జిల్లాల పేర్లు మొదటి, రెండవ స్థానాల్లో ఉన్నాయి. పౌరుల నమోదుల్లో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలు మొదటి, రెండవ స్థానాల్లో ఉన్నాయి. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే విషయంలో ప్రతిరోజూ ఉన్నత స్థాయిలో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు జరుగుతున్నాయి. మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో సోమవారం జరిగిన యోగాసనాల కార్యక్రమంలో రాష్ట్ర వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చురుగ్గా పాల్గొన్నారు.

తొలుత నిర్ణయించిన ప్రకారం కృష్ణానది వంతెన (వెస్ట్ బైపాస్ రోడ్డు) పైన కాకుండా విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల ప్రకారం ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి హాజరుకావాలని పతంజలి రాందేవ్ బాబాను యోగా-నేచురోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు, అధికారులు నేరుగా కలుసుకుని ప్రభుత్వం తరపున ఆహ్వానించారు.

# వైసీపీ విధానమే కుట్రలు కుతంత్రాలు

- స్పోర్ట్స్ కోటా ఓసీ 42 పోస్టుల్లో కమ్మ వర్గానికి వచ్చింది 9 మాత్రమే
- నాడు 36 డీఎస్పీ ప్రమోషన్లలో కమ్మవారు ఒక్కరే ఉన్నా... తప్పుడు ప్రచారం
- నాటి 'డీఎస్పీ' అబద్ధాలనే నేడు 'డీఎస్సీ'లోనూ రిపీట్ చేస్తున్న వైసీపీ
- అమరావతి భూముల నుంచి మెగా డీఎస్సీ వరకూ వైసీపీవన్నీ కుట్రలే
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజం

మంగళగిరి (చైతన్య రథం): అధికారం కోల్పోయిన నాటి నుంచి వైసీపీ ముఠా నిత్యం ఏదో ఒక కుట్రలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి తీవ్రంగా అడ్డుపడుతోందని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో నిరంతరం అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజా రాజధాని అమరావతిపై మొదటి నుంచి కుల విషం చిమ్మి రాజకీయ పబ్బం గడుపుకున్న వైసీపీ నైజాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. అమరావతిలోని మొత్తం 34,323 ఎకరాలకు సంబంధించిన అధికారిక లెక్కలను పరిశీలిస్తే ఎస్సీ, ఎస్టీలు 32 శాతం, రెడ్లు 23 శాతం, బీసీలు 14 శాతం, కాపులు 9 శాతం, మైనారిటీలు 3 శాతంగా ఉన్నారని, కమ్మ సామాజిక వర్గానికి చెందిన రైతులు కేవలం 18 శాతం మాత్రమే భూములిచ్చారని స్పష్టం చేశారు. ఇంతటి సాక్ష్యాధారాలు, నిఖార్సైన వాస్తవాలు కళ్లముందు కనిపిస్తున్నా, ఒకే కులానికి అంటగడుతూ సమాజంలో విద్వేషాలు రేపేందుకు వైసీపీ చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

వైఎస్ కుటుంబం మొదటి నుంచి తమ రాజకీయ సామ్రాజ్య నిర్మాణం కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం కులాలను, మతాలను, వర్గాలను అనేక రకాలుగా వాడుకుంటూ ఈ స్థాయికి వచ్చిందని రాంగోపాల్ రెడ్డి



ఆరోపించారు. తాత రాజారెడ్డి నుంచి, తండ్రి రాజశేఖర్ రెడ్డి మీదుగా నేటి జగన్మోహన్ రెడ్డి వరకు వ్యక్తుల మధ్య విద్వేషాలు సృష్టించి, హత్య రాజకీయాలతోనే తమ అధికార సౌధాలను నిర్మించుకున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిని పదవి నుంచి దించడానికి పాతబస్తీలో మతకల్లోలాలు సృష్టించి, వందలాది మంది సామాన్య ప్రజల మృతికి కారణమైంది ఈ వైఎస్ కుటుంబమేనని ఆయన గుర్తుచేశారు. సొంత బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి గొడ్డలి వేటు హత్య కేసు నుంచి నేటి మెగా డీఎస్సీ వరకు వైసీపీ అనుసరిస్తున్నది ఒకే రకమైన కుట్రపూరిత తప్పుడు ప్రచారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు వివేకా మరణించినప్పుడు తొలుత గుండెపోటు అని నంగనాచి మాటలు చెప్పి, ఆ తర్వాత అది హత్య అని తేలగానే 'నారాసుర రక్త చరిత్ర' అంటూ కొత్త సినిమాకు తెరలేపి సానుభూతి రాజకీయాలు చేశారని ఎండగట్టారు. సొంత బాబాయి కేసులో ఎన్ని రకాలుగా మాటలు మార్చారో, నేడు అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలపైనా అవే అబద్ధాలు చెప్తున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి దుయ్యబట్టారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఎలాగైనా ఉద్యోగాలు రాకూడదనే దుర్బుద్ధితో, నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి వైసీపీ ముఠా ఏకంగా 240 కోర్టు కేసులు వేసి అడ్డుకోవాలని చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆ కుట్రలన్నీ ఛేదించబడ్డాయని స్పష్టం చేశారు. మొదట పేపర్ లీక్ అన్నారని, తర్వాత మెరిట్ లిస్ట్ లేదన్నారని, ఆపై అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్ కథను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇవన్నీ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (జడీు) సాక్ష్యాధారాలతో తుస్సుమనడంతో, స్పోర్ట్స్ కోటా, మహిళల రిజర్వేషన్లు, దివ్యాంగుల రిజర్వేషన్లపై అడ్డగోలుగా అభ్యంతరాలు లేవనెత్తుతూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వం ఇచ్చిన మెరిటోరియల్ స్పోర్ట్స్ కోటా 382 ఉద్యోగాలలో ఎస్సీలకు 110, బీసీలకు 196, ఎస్టీలకు 29 ఉద్యోగాలు పారదర్శకంగా దక్కాయని లెక్కలతో సహా నిరూపించారు. వైసీపీ నేతలు స్పోర్ట్స్ కోటా అంతా ఒకే కులానికి ఇచ్చేశారంటూ అడ్డగోలు ప్రచారం చేస్తున్నారని, అందులోని అసలు వాస్తవాలను గమనిస్తే ఓసీలకు వచ్చిన 42 పోస్టుల్లో కాపు సామాజిక వర్గానికి చెందిన యువతకు 16 ఉద్యోగాలు, రెడ్డి సామాజిక వర్గానికి 10, వైశ్యులకు 2, క్షత్రియులకు 2, బ్రాహ్మణులకు 2, ముస్లిం మైనారిటీకి 1 ఉద్యోగం దక్కాయని వెల్లడించారు. వైసీపీ ఆరోపణ చేస్తున్న కమ్మ సామాజిక వర్గానికి వచ్చింది కేవలం 9 ఉద్యోగాలు మాత్రమేనని స్పష్టం చేశారు. గతంలో 2014-19 మధ్య కూడా 36 మంది డీఎస్పీల ప్రమోషన్లలో కమ్మ అధికారి ఒక్కరే ఉన్నా, మొత్తం కమ్మవారికే ఉద్యోగాలు ఇచ్చేశారంటూ ఎన్నికల వరకు అబద్ధాలు ప్రచారం చేసిన వైసీపీ, నేడు డీఎస్సీలోనూ అదే కుట్రను పునరావృతం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాడేపల్లి వైసీపీ ఆఫీసులో ఆదివారం నాడు నిరుద్యోగులు ఎవరూ రాకపోవడంతో, తమ పార్టీ కార్యకర్తలను, గంజాయి బ్యాచ్‌లను కూర్చోబెట్టి డీఎస్సీ అభ్యర్థుల పేరిట ఫేక్ ధర్నాలు చేయించడం సిగ్గుచేటన్నారు. తిరుపతిలో బహిరంగ చర్చకు రావాలని పిలిచినా నేటి వరకు వైసీపీ నేతలు ఒక్కరు కూడా స్పందించలేదని ఎద్దేవా చేశారు. తిని తినక ఎంతో కష్టపడి, మెరిట్‌తో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న వైసీపీ నేతలకు రాష్ట్ర యువత బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వైసీపీకి నిజంగా దమ్ముంటే, ఏసీ రూముల్లో, ఆఫీసుల్లో కూర్చొని అవాస్తవాలు మాట్లాడటం మానేసి, మీడియా సమక్షంలో అధికారుల ముందు బహిరంగ చర్చకు రావాలని రాంగోపాల్ రెడ్డి సవాల్ విసిరారు.

# జెన్ జీని గందరగోళపర్చే శక్తులున్నాయి!

- ఫ్యాషన్ పేర్లు.. ఫాన్సీ సిద్ధాంతాలపట్ల జాగ్రత్త అవసరం
- చదవండి.. తెలుసుకోండి.. పరిశీలించండి.. నిర్ణయం తీసుకోండి
- దేశ క్షేమం, శ్రేయస్సు, భద్రత, భవిష్యత్తు ప్రధానం
- కాంగ్రెస్ హిపోక్రసీ రాజకీయాలు మానుకోవాలి
- తెలంగాణలో జనసేన నిస్వార్థంగా పోరాడుతుంది
- నరేంద్ర మోదీ బలమైన దేశభక్తిగల నాయకుడు
- ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం'లో డిప్యూటీ సీఎం పవన్



న్యూఢిల్లీ (చైతన్య రథం): "ప్రతి తరంలోనూ సమాజంలో జరిగే కొన్ని విషయాల పట్ల కోపం, కసి, వేదన, బాధ ఉంటాయి. సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి అవి యువతరంలో వివిధ దశల్లో ఉండటం సహజం. యౌవన దశలో కచ్చితంగా అతివాద భావాలుండటం సాధారణం. ఆ భావాలకు దేశభక్తిని జోడించి పరిష్కారం చేపట్టాలి. నా దేశం, నా నేల అనే భావన ప్రతి ఒక్కరిలో కచ్చితంగా ఉండాలి. నేటితరం ఏ విషయాన్ని అయినా చదవండి... తెలుసుకోండి... పరిశోధించండి.. పరిశీలించండి.. ఆ తర్వాతే దానిపై స్థిరమైన భావాన్ని ఏర్పరచుకోండి. అప్పుడే మనకు దేశానికి మేలు చేసే సానుకూల ఆలోచనలు పుడతాయి. కేవలం ఫ్యాషన్‌గా ఉండే పేర్లకు, మెదడును గందరగోళపరిచే అంశాలకు జెన్ జీ దూరంగా ఉండటం మేలు" అని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేటి జెన్ జీ తరం అయినా, ఏ తరమైనా దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమాధికారం, సచ్ఛీలతను కాపాడేలా ఆలోచించాలని చెప్పారు. ఢిల్లీలో సోమవారం జరిగిన 'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' సమావేశం ముగింపు సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. "దేశానికి వాణిజ్య రాజధాని అయిన ముంబయిలో 72 గంటలపాటు ఉగ్రవాదులు చేసిన మారణహోమం భారతీయులందరికీ గుర్తే. దీనిపై నేను చాలా కలత చెందాను. మా నాన్న అస్థికలను వారణాసిలోని గంగా నదిలో కలిపేందుకు వెళ్తూ కాశీ విశ్వేశ్వరుడ్ని బలంగా వేడుకున్నాను. దేశానికి ఉగ్రవాదం పీడ తప్పించే బలమైన నాయకత్వం ఇవ్వమని కోరాను. దేశాన్ని ముందుకు నడిపించే, ఐక్యంగా ఉంచే నిస్వార్థ నాయకుడే నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ. భారతదేశానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ ఓ బలమైన నాయకుడ్ని తయారు చేసుకుంటుంది. అది ఈ దేశానికి ఉన్న సత్తా. మోదీ దేశం గురించి అంత గొప్పగా ఆలోచిస్తారు కాబట్టే, నేను ఆయనకు అంత బలంగా మద్దతు పలుకుతాను. దేశ గతిని మలుపు తిప్పుతూ, ప్రపంచంలోనే దేశాన్ని అత్యున్నత శిఖరం మీద నిలిపిన గొప్ప నాయకుడు మోదీ. ఆయన నాయకత్వానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు పలుకుతుంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన నాయకుల్లో అత్యంత ఎక్కువ రోజులు దేశ ప్రధానిగా పనిచేసిన మోదీకి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను" అన్నారు.

**సైనికులకు ప్రాంతీయత చూస్తామా..?**

"దేశంతో మనం ఇంత భద్రంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో కాపాలా కాసే సైనికుల పుణ్యమే. సియాచిన్ వంటి గడ్డకట్టే చలిలో సైతం వారు దేశానికి చేసే సేవ అపూర్వం. వారెప్పుడూ మా ప్రాంతం అనే భావన చూపించరు. నా దేశం అనుకుంటారు. కానీ వారు నివసించే ప్రాంతంలో మాత్రం సైనికుల కుటుంబాలపై ప్రాంతీయ తత్వం ప్రభావం పడుతోంది. ఇదెలా కరెక్టు. నేను ప్రతిసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మొదట మన ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. దేశం కోసం కష్టపడుతున్న వారిని ప్రాంతాలకు ముడిపెట్టడం సబబు కాదు. జాతీయ పార్టీ అంటే కేవలం ఎన్ని రాష్ట్రాల్లో, ఎన్ని ఓట్లు వచ్చాయని గుర్తించడం కాదు. జాతీయ పార్టీ అంటే దేశాన్ని కలిపేందుకు ఎంతలా పాటుపడుతోంది, దేశ సమగ్రత కోసం ఎంత కష్టపడుతోందనేది చూడాలి. రాజ్యాంగ విలువలని పూర్తిగా పాటిస్తూ, దేశం కోసం పనిచేసే పార్టీనే జాతీయ పార్టీ అనుకోవాలి" అని పిలుపునిచ్చారు.

**రాష్ట్రానికి ఒక సిద్ధాంతం.. దేశానికి ఒక సిద్ధాంతం తప్పు**

"భారత్ జోడో యాత్ర ద్వారా దేశమంతటా తిరిగి అందరినీ కలిసిన పార్టీ – నేను తెలంగాణలో తిరుగుతాను అంటే మాత్రం అనుమతి ఇవ్వదు. 1200 మంది తెలంగాణ కోసం బలిదానాలు చేసిన యువతకు నివాళి అర్పించేందుకు అనుమతి ఇవ్వరు. కాంగ్రెస్ పార్టీ – దేశానికి ఒక సిద్ధాంతం, పాలిస్తున్న రాష్ట్రాలకు మరో సిద్ధాంతం అనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీ రాజకీయాలు మానుకోవాలి. నాకు తెలంగాణ యువత పోరాటాల మీద గౌరవం ఉంది. నేను ఆంధ్రాలో పుట్టినప్పటికీ, నేల గురించి ఎన్ని త్యాగాలు చేయడానికి అయినా సిద్ధపడే తెలంగాణ యువత ఆకాంక్షల మీద గౌరవం ఉంది. తెలంగాణలో కొందరు నాయకులు యువతను బలి చేసి గద్దెలనెక్కారు. నాకు తెలంగాణలో ఎలాంటి పదవులు వద్దు. కానీ తెలంగాణ యువత కోసం, వారి ఆశలు, ఆశయాల కోసం మనస్ఫూర్తిగా జనసేన పార్టీ పనిచేస్తుంది. జనసేన సిద్ధాంతపరంగా బలమైన భావజాలం ఉన్న పార్టీ. ఒక సిద్ధాంతాన్ని నమ్మితే దానికోసం సర్వం కోల్పోవడానికి సిద్ధమయ్యే మనస్తత్వం నాది. పోరాటం.. పోట్లాట పార్టీకి ఊపిరి" అన్నారు.

**గందరగోళపరుస్తారు జాగ్రత్త!**

"సామాజికంగా వచ్చే మార్పులను అనుసరించి రాజకీయంగా వ్యూహాలు మార్చుకోవడం కచ్చితంగా ఉంటుంది. జెన్ జీ తరం వాళ్ళు దేశం కోసం ఆలోచించే బలమైన మనస్తత్వం ఉన్నవారు. యువతే దేశానికి పునాది. వారే భవిష్యత్తుకు మార్గనిర్దేశకులు. అయితే సామాజిక మాధ్యమాల్లో కొందరు గందరగోళపరిచే చర్యలను జెన్ జీ తరం జాగ్రత్తగా గమనించాలి. మీ దగ్గర స్పష్టమైన ఆలోచనలు ఉన్నప్పటికీ నేటి సోషల్ మీడియా ప్రభావం మెదడుపై పడుతుంది. ఫ్యాషన్‌గా ఉండే పేర్లకు, ఫాన్సీ సిద్ధాంతాలకు ఆకర్షణలో పడి గుడ్డిగా ఎవరినీ నమ్మొద్దు. ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలించండి.. పరిశోధించండి.. చదవండి... స్థిరమైన అభిప్రాయం ఏర్పరచుకోండి. దేశం కోసం భగత్ సింగ్ ఏం చేశారు.. సుభాష్ చంద్రబోస్ ఎవరు..? చంద్రశేఖర్ ఆజాద్ జీవితం ఏంటి..? ఇలాంటి గొప్ప విషయాలను తెలుసుకోండి. పుస్తకాలు చదవండి. దేశం పట్ల, ఈ నేల పట్ల, ఈ భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటే సమాజం పట్ల నిస్వార్థమైన బాధ్యతతో వ్యవహరించాలి. తార్కికంగా, దేశం మీద ప్రేమతో కూడిన ఆలోచనలు ఉండాలి" అని హితవు పలికారు.

**భారతీయుడికి ప్రాంతంతో పనేముంది..?**

భారతదేశం అంతటి గొప్ప దేశం మరొకటి ఉండదు. ఇక్కడ విభిన్న సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలు, భాషలు, యాసలు – ఎన్నో విభిన్నమైన మనుషులను ఏకతాటిపైకి తెచ్చేది దేశం. భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప భావనకు మించింది ఏముంటుంది. కేరళకు చెందిన వర్గీస్ కురియన్ శ్వేత విప్లవాన్ని తీసుకొచ్చి గుజరాత్‌ను రోల్ మోడల్ చేశారు. శ్రీధరన్ కేరళలో పుట్టి ఢిల్లీలో అత్యద్భుత మెట్రోకు రూపకల్పన చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్ణాటక వాసి. ఆయన హైదరాబాద్ మూసీ నది వరదల నివారణకు కృషి చేసిన మహానుభావుడు. భారతదేశం నీ ఇల్లు అయితే నువ్వు రాష్ట్రమనే ఏ గదిలో ఉన్నా ఇల్లు అంతా నీదే అవుతుంది. భారతీయుడికి రాష్ట్రంతో పనేముంది. మనకు దేశమే తొలి ప్రాధాన్యం కావాలి. అయితే కొన్ని దశాబ్దాల నుంచి ఈ స్ఫూర్తి మెల్లగా తగ్గుతోంది. ఇది ప్రమాదకరం. మనమంతా ఒకటే దేశం. మనదంతా భారతదేశం. మనసంతా భారతీయం అనే భావాలు ప్రతి ఒక్కరిలో కలగాలి" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## జూన్ 26 నుంచి 28 వరకు జ్యేష్ఠాభిషేకం!



తిరుమల (చైతన్య రథం): తిరుమలలోని శ్రీవారి ఆలయంలో జూన్ 26 నుండి 28 వరకు సాలకట్ల జ్యేష్టాభిషేకం జరుగనుంది. యేటా జ్యేష్టమాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహిస్తారు. సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును "అభిద్యేయక అభిషేకం" అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనమైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు మయప్పస్వామివారికి ఉన్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండవ రోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. మూడవ రోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం సమయంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

**ఆర్జిత సేవలు రద్దు**

జ్యేష్టాభిషేకాన్ని పురస్కరించుకుని జూన్ 28వ తేదీన కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.

# కూటమి ప్రభుత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష

- గొడ్డలి పార్టీపట్ల అప్రమత్తం
- విజయోత్సవ సభలో మంత్రి నిమ్మల పిలుపు



కర్నూలు (చైతన్య రథం): కూటమి ప్రభుత్వ కొనసాగింపే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. గొడ్డలి పార్టీపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆ పార్టీకి శాశ్వత సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. 2ఏళ్ళ నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం కర్నూల్‌లో సోమవారం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నిమ్మల రామానాయుడు కార్యక్రమలో పాల్గొని ప్రసంగించారు. కుట్రలు, కుతంత్రాలతో గొడ్డలి పార్టీ రాజకీయం చేస్తుందంటూ చంద్రబాబు చెబుతున్న మాట నూటికి నూరుశాతం నిజమన్నారు. మెగా డిఎస్సీ నిర్వహణ విషయంలో ఇప్పుడు గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారంతో మరోసారి స్పష్టమౌతుందన్నారు. అధికారంలో ఉన్న రోజుల్లో ప్రజలకు మేలు చేయరు, డిఎస్సీలు నిర్వహించరు, కానీ అధికారం కోల్పోయాక మాత్రం కుట్రల మీద కుట్రలు పన్నుతూ ఉంటారని విమర్శించారు. మెగా డిఎస్సీ–2025ను అడ్డుకోవడానికి, ఆ ప్రక్రియను పురిట్లోనే చంపేయడానికి యువత భవితపై గొడ్డలి వేటు వేయడానికి నాడే కుట్రలు పన్ని, 32 కేసులు వేసి నిలిపేయాలనుకుందని దుయ్యబట్టారు. చంద్రబాబు, నారా లోకేశ్ ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ, ఇంకోవైపు పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు సృష్టించేలా పరిశ్రమలను తెస్తున్నారన్నారు. ఇదిచూసి గొడ్డలి పార్టీ ఓర్వలేక కుట్రలు, దుష్ప్రచారం చేస్తూ, రాతలు రాయిస్తోందన్నారు. అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డిఎస్సీ–2025పై ఏడాది తర్వాత ఆరోపణలు గుప్పిస్తూ, ఆ పార్టీ సైకోయిజాన్ని ప్రదర్శిస్తోందని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి ఫైల్‌గా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంతకం చేశారన్నారు. 5.77 లక్షల అప్లికేషన్లు స్వీకరిస్తే, 3.36 లక్షలమంది అభ్యర్థులు డిఎస్సీ–2025లో పోటీపడ్డారన్నారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు మొత్తం ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేశామన్నారు. 2019–24 మధ్య ఒక్క మెగా డిఎస్సీ కూడా నిర్వహించని వారు, 16,347 పోస్టులతో దేశంలోనే అతిపెద్ద టీచర్ నియామక ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వాన్ని విమర్శించడం విచిత్రమన్నారు. మెగా డిఎస్సీ–2025 పూర్తిగా పారదర్శకంగా, సాంకేతిక భద్రతా ప్రమాణాలతో, కోర్టు ఆదేశాలు మరియు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామన్నారు. సంక్లిష్టమైన డిఎస్సీ వ్యవహారాన్ని సమర్ధవంతంగా నారా లోకేశ్ పూర్తి చేశారన్నారు. ఎవరికి ఉద్యోగం వస్తుందో, ఎవరికి రాదో కంప్యూటర్ సిస్టమ్ మాత్రమే తేల్చింది, ఇందులో ఏ అధికారి, ఏ ప్రజా ప్రతినిధి జోక్యం చేసుకునే అవకాశం లేకుండా చేశారన్నారు. వైసీపీ పాలనతో వెంటిలేటర్ మీదకు వెళ్లిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేసి చంద్రబాబు ఐసీయూ లోకి తీసుకొచ్చారని చెప్పారు. నాడు జగన్ అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇస్తే, నేడు కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే అందరికీ తల్లికి వందనం అందిస్తున్నామన్నారు. మెగా డిఎస్సీ అని, ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వకుండా యువతను నిలువునా గొడ్డలిపార్టీ నాయకుడు మోసం చేశాడన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని,సంక్షేమాన్ని, పథకాలను మంత్రి రామా నాయుడు గణాంకాలతో వివరించారు. కార్యక్రమంలో కూటమి పార్టీలకి చెందిన ఎమ్మెల్యేలు,జిల్లా అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చైతన్యరథం

- ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న కూటమి సర్కారు
- గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాల్ని తిప్పికొడదాం...
- కూటమి ప్రభుత్వ విజయాల్ని క్షేత్రస్థాయిలో బ్రాండింగ్ చేద్దాం
- స్వర్ణాంధ్ర విజన్ 2047తో దేశంలో అగ్రస్థానంలో నిలుద్దాం
- రవాణా, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## అభివృద్ధి.. సంక్షేమం

# రెండేళ్ల పాలనలో స్పష్టమైన ముద్ర

రాయచోటి (చైతన్య రథం): రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేసిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ప్రధాన స్తంభాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లిందని రాష్ట్ర రవాణా, యువజన-క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా ప్రతి కుటుంబ జీవన ప్రమాణాల మెరుగుదల, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.

తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు అందజేశారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించగా ఇప్పటివరకు 71 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి.

దివ్యాంగ శక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత ప్రయాణంతో 32 లక్షల ప్రయాణాలు జరిగాయి. దీపం-2 పథకం కింద ఇప్పటివరకు 4.26 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి 9.71 కోట్ల భోజనాలు అందించారు. అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ. 8,985 కోట్లు మూడు విడతల్లో జమ చేసినట్టు మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.



## సంక్షేమంనుంచి సాధికారత వైపు...

# భద్రతనుంచి సమగ్ర అభివృద్ధి దిశగా ముందడుగు

### రెండేళ్లలో మహిళా, శిశు, గిరిజన సంక్షేమ రంగాల్లో ప్రగతి

### గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మహిళా, శిశు, గిరిజన సంక్షేమ రంగాలను అత్యున్నత ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి గత రెండేళ్లలో ఎన్నడూలేని స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్టు మహిళా అభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, ప్రతి మహిళకు భద్రత, ప్రతి చిన్నారికి పోషకాహారం, ప్రతి గిరిజన కుటుంబానికి అభివృద్ధి అవకాశాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి బలహీన వర్గానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా, ప్రభుత్వాన్ని ప్రజల జీవితాల్లో విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా, మహిళలు భయరహితంగా జీవించేలా, పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా, గిరిజనులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు 20 లక్షల మంది లబ్ధిదారులు ఈ సేవలను పొందుతున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పోషకాహార సరఫరా కొనసాగించడంతో పాటు అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అంగన్‌వాడీ సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించేందుకు 5,389 మంది అంగన్‌వాడీ టీచర్ల నియామకం, 5,287 మంది ఆయాల నియామకం ద్వారా మొత్తం 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార పంపిణీ కేంద్రాలుగానే కాకుండా, చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో 10,000 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలు, ఆర్.ఓ. ప్లాంట్లు, భవన మరమ్మతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, వంట సామగ్రి, పచ్చదనం పెంపు కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. దీనివల్ల ఇంధన పొదుపు, పరిశుభ్రత, సమర్థవంతమైన వంట ప్రక్రియ సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

డిజిటల్ పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో రూ.72 కోట్ల వ్యయంతో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు ఆధునిక 5జి



స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పోషకాహార పంపిణీ, గర్భిణీలు-బాలింతల ఆరోగ్య సమాచారం, హాజరు నమోదు, ప్రభుత్వ పథకాల అమలు రియల్ టైమ్‌లో పర్యవేక్షించబడుతోందని వివరించారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసి మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు, మానసిక స్థైర్యం కల్పించడంతో పాటు పోలీసు సహకారం ఒకే వేదికపై అందిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో వేలాది మంది మహిళలు ఈ సేవల ద్వారా లబ్ధి పొందారని పేర్కొన్నారు. బాలికల భవిష్యత్తును రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా గత రెండు సంవత్సరాల్లో 3,393 బాల్య వివాహాలను అడ్డుకున్నామని మంత్రి తెలిపారు. ప్రతి బాలిక విద్యను పూర్తి చేసి స్వావలంబన సాధించే వరకు ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి ప్రసవానికి రూ. 5,000, రెండో ప్రసవానికి రూ. 6,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే తల్లిపాల ప్రోత్సాహం, పోషకాహార భద్రత, శిశు సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వం ప్రత్యేక బాధ్యతగా స్వీకరించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 371 ఆశ్రమ పాఠశాలలు, 199 గురుకులాలు, 179 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 1,950 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో సహా మొత్తం 2,715 గిరిజన విద్యా సంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, నోట్‌బుక్స్, బెడ్ షీట్లు, దుప్పట్లు, స్టేషనరీ కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రత, పోషకాహారం, భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా కనిపించే సికిల్ సెల్ అనీమియా వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. లక్షలాది మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విశాఖపట్నంలో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపరచేందుకు భారీ స్థాయిలో రోడ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి తెలిపారు. ఎవరూ వైద్య సేవల కోసం డోలీలపై ప్రయాణించాల్సిన పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. అటవీ అనుమతులు అవసరమయ్యే పరిస్థితుల్లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజన రైతుల ఆదాయం పెంచేందుకు కాఫీ, మిరియాలు, పసుపు, చింతపండు వంటి విలువ ఆధారిత పంటలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సుమారు 2.26 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు జరుగుతోందని, ట్రైకార్ రుణాలు, మార్కెటింగ్ సదుపాయాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం ద్వారా గిరిజన రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాతో సహా అన్ని గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగును పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రత్యేక "ఈగల" బృందాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుండగా, పలు మండలాల్లో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందని వెల్లడించారు.

మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెపుతూ మంత్రి సంధ్యారాణి, ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించబడిందని స్పష్టం చేశారు. ఏ ఒక్క వర్గానికో, కులానికో ప్రత్యేక ప్రయోజనం కల్పించలేదని, షెడ్యూల్డ్ ట్రైబ్స్, షెడ్యూల్డ్ కాస్ట్స్, బీసీలు, ఈడబ్ల్యూఎస్, మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులకు వర్తించే రిజర్వేషన్లను నిబంధనల ప్రకారమే అమలు చేశామని తెలిపారు. మొత్తం 16,500కు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. వాలంటీర్ వ్యవస్థపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, గతంలో వాలంటీర్లను తొలగించినవారే ఇప్పుడు వారి పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు మాట్లాడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం యువతకు స్థిరమైన ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తోందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ గుర్తింపు పత్రాలు కూడా లేని మారుమూల గిరిజన కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, పెన్షన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. ముఖ్యంగా శ్రీశైలం, నల్లమల, మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు తదితర గిరిజనులకు ప్రభుత్వ సేవలను చేరువ చేస్తున్నామని వివరించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, యూనిఫార్మ్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ఇండక్షన్ స్టవ్‌లు, పరిశుభ్రమైన వసతి సదుపాయాలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే సికిల్ సెల్ అనీమియా బాధిత గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య సేవలు, ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళలు, పిల్లలు, గిరిజనుల సంక్షేమం మరియు సాధికారత కోసం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి కొనసాగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, రాష్ట్ర స్త్రీ శిశు, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు ఎం. వేణుగోపాల రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి, ఏపీ గురుకుల పాఠశాలల సెక్రటరీ గౌతమి, గిరిజన సంక్షేమ శాఖ సీఈ వసంత తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమను రతనాలసీమ చేయాలనేదే ధ్యేయం

- నీటిపారుదల నిధుల్లో 51 శాతం కేటాయింపు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- ప్రాజెక్టుల పురోగతిపై కర్నూలు కూటమి నేతలతో భేటీ
- సీమ అభివృద్ధే కూటమి ధ్యేయమని ప్రకటన



కర్నూలు (చైతన్య రథం): రాయలసీమను రతనాలసీమగా తీర్చిదిద్దడమే కూటమి ధ్యేయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ నుంచి నేడు చంద్రబాబు నాయుడు వరకు రాయలసీమలో నీటిపారుదల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని సోదాహరణంగా వివరించారు. అలాగే నేడు కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి 25 వేల కోట్లు కేటాయిస్తే, అందులో రూ. 12,450 కోట్లు అంటే 51 శాతం నిధులను రాయలసీమకు కేటాయించినట్లు మంత్రి చెప్పారు. అలాగే ఇంతకుముందు కూడా 2014-19 కాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమ ప్రాంతానికి రూ. 12,500 కోట్లు కేటాయిస్తే, అనంతరం వచ్చిన గొడ్డలి పార్టీ తన ఐదేళ్ల పదవీకాలంలో కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని మంత్రి విమర్శించారు. మాట్లాడితే రాయలసీమ ముద్దుబిడ్డ అని చెప్పుకునే గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అడుగడుగునా రాయలసీమకు అన్యాయం చేసి రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయాడన్నారు.

రాయలసీమ ప్రాంతానికి తుంగభద్ర కూడా ముఖ్యమని చెబుతూ, తుంగభద్ర డ్యాం 19వ గేటు పాడైతే దానిని రికార్డు స్థాయిలో చక్కదిద్దిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అంతేకాక మిగిలిన 33 గేట్లు కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 25న కేంద్ర జలశక్తి మంత్రి పార్టీల చేతుల మీదుగా వాటిని ప్రారంభించుకోబోతున్నామన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి పనులకు రూ. 253 కోట్లు కేటాయించినట్లు రామానాయుడు చెప్పారు. గోరకొల్లు రిజర్వాయర్ ప్రమాదంలో పడిన నేపథ్యంలో దానికి రూ. 59 కోట్లు కేటాయించి పనులకు టెండర్లు పిలిచామన్నారు.

ఈ గోరకల్లు రిజర్వాయర్‌కు కూడా జగన్ తన హయాంలో ఘోరమైన అన్యాయం చేశారన్నారు. ఏమాత్రం నిధులు కేటాయించని రాయలసీమ ద్రోహిగా జగన్ మరోసారి నిరూపించుకున్నాడన్నారు. రాయలసీమ జీవనాడి హంద్రీనీవా పథకానికి కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే రూ. 3,860 కోట్లు కేటాయించామన్నారు. 728 కిలోమీటర్లు పొడవునా కృష్ణా జలాలు తరలించామన్నారు. హంద్రీనీవా విషయంలో కూడా రాయలసీమ ప్రజలకు జగన్ తీవ్ర అన్యాయం చేశాడని రామానాయుడు విమర్శించారు. అలాగే కర్నూలు పశ్చిమ ప్రాంతానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ చెప్పారని ఆయన వివరించారు. అందులో భాగంగానే పశ్చిమ ప్రాంతానికి సంబంధించి పనులను ప్రాధాన్య క్రమంలో ఎంపిక చేసి వచ్చే మూడేళ్లలో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. దీనిని ముఖ్యమంత్రితో చర్చించి అమలుకు శ్రీకారం చుడతామన్నారు.

కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ కెనాల్, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నీటి ద్వారా 68 చెరువులు నింపేందుకు ఇప్పటికే రూ. 228 కోట్లు ఖర్చు చేసి, 98 శాతం పనులు పూర్తికాగా, 67 చెరువులకు నీరందించామని వెల్లడించారు. జిల్లాలో 68 చెరువుల పథకంలో భాగమైన జొన్నగిరి చెరువుకు పైప్‌లైన్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తున్నామని అన్నారు. గాజుల దిన్నె ప్రాజెక్టుకు భూసేకరణ, గేట్ల అమరిక, పెంచిన ఒక టీఎంసీ నీటి నిల్వకు అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో పూర్తి చేయాలనుకున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులలో వేదవతి లిఫ్ట్ స్కీమ్‌ను చేర్చామన్నారు. వేదవతి లిఫ్ట్ నీటిపారుదల పథకం డీపీఆర్, అటవీ, పర్యావరణ అనుమతులు పొందే బాధ్యతను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించినట్లు ఆయన వివరించారు. ఆలూరు నియోజకవర్గంలోని నగరడోన రిజర్వాయర్‌లో ఆగిన పనులను మళ్లీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరించేలా సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యేక మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందించి, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగునీరందించేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో గురురాఘవేంద్ర లిఫ్ట్ స్కీమ్‌లో మోటార్లు దొంగలించుకుపోయినా పట్టించుకోలేదన్నారు. రాయలసీమకు జగన్ చేసిన ద్రోహాన్ని, నాడు ఎన్టీఆర్ నుంచి నేటి కూటమి వరకు సీమ ప్రజలకు చేసిన మంచిని తులనాత్మకంగా పరిశీలించుకోవాలన్నారు. రాయలసీమను రతనాలసీమ చేయాలన్న కూటమి ప్రభుత్వ ధ్యేయానికి మద్దతు పలకాలన్నారు.

# ఎయిమ్స్ సేవలు అద్భుతం

## *ఆరోగ్యాంధ్ర డబుల్ ఇంజన్ సర్కార్ ఘనతే - ఎయిమ్స్ పనితీరును పరిశీలించిన లంక దినకర్*

మంగళగిరి (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలనలో చేపట్టిన ప్రజోపయోగ అభివృద్ధి కార్యక్రమాలను ఒకసారి గుర్తు చేసుకొనే విధంగా క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగిన మరియు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి అక్కడి ప్రజల అనుభవాలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా నేడు మంగళగిరిలోని ఎయిమ్స్‌ను సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మరియు డీన్ రీసర్చ్ డా. జాయ్ ఘోషల్, డీన్ అకాడమిక్ దేసు రామ్ మోహన్ మరియు వివిధ విభాగాల ఉన్నత స్థాయి వైద్యులు, ప్రొఫెసర్ల సమన్వయ సహకారంతో లంక దినకర్ సందర్శించి ఆధునిక వైద్య పరికరాల ద్వారా ఎయిమ్స్ అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. వైద్య సేవల కోసం వచ్చిన వారితో మమేకం అయ్యి వైద్య పరీక్షలు, స్కాన్లు మరియు ఇతర సేవల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం మంగళగిరి ఎయిమ్స్ సాధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిట్ర శివన్నారాయణ, ఎస్సీ మోర్చా నాయకులు మేకల లక్ష్మణ్, బీజేవైఎమ్ నాయకులు నవనీత్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు తుళ్ళి మిల్లి రామకృష్ణ, పంచుమర్తి ప్రసాద్, మునగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం 2015లో రూ. 1,618 కోట్లతో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మంగళగిరిలో 183 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ నిర్మాణం ప్రారంభించి, 2019 కి పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారని దినకర్ అన్నారు. 2019లో సేవలు ప్రారంభించిన సమయానికి దేశంలోని మొత్తం ఎయిమ్స్‌లలో చివరి స్థానంలో ఉన్న మంగళగిరి ఎయిమ్స్ నేడు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల ఎయిమ్స్‌లలో 8వ స్థానంలో నిలవడం విశేషం.

ఎయిమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మరియు అధికారులు వివరిస్తూ, ఓపీకి రూ. 10 చొప్పున ప్రస్తుతం ప్రతి రోజు సగటున 4 వేల ఓపీలు, ఇన్‌పేషంట్లుగా (రోగులతో పాటు అటెండెన్స్ కింద మరో 2 వేల మంది అదనంగా) సేవలు వినియోగించుకుంటున్నారు. 2025-26 సంవత్సరంలో 9.85 లక్షల మందికి ఓపీ సేవలు అందించగా ఈ



సంవత్సరం 10 లక్షల మందికి ఓపీ సేవల రికార్డు సృష్టించబోతోంది. 2019 నుండి ఇప్పటివరకు 35.26 లక్షల మంది సేవలను పొందారు.

2018 నుండి ఇప్పటివరకు 22,081 మేజర్ ఆపరేషన్లు మరియు 9,238 మైనర్ ఆపరేషన్లు కలిపి మొత్తం 31,319 ఆపరేషన్లు జరిగాయి. 35 పడకలతో డయాలసిస్ సేవలు అందించడం జరుగుతుంది, సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 16,586 మందికి సేవలు అందించారు. రోజుకు 600 నుండి 700 మందికి ఎక్స్‌రే సేవలు, 250 నుండి 300 మందికి అల్ట్రా సౌండ్ సేవలు, క్యాన్సర్ రోగులకు ఇప్పటివరకు 6,225 ఆంకాలజీ రేడియేషన్ సేవలు అందించామని వైద్యులు తెలిపారు. రూ. 33 కోట్ల వ్యయంతో అత్యాధునిక పెట్ స్కాన్, స్పెట్ స్కాన్ మరియు రేడియో థెరపీ సేవలు అందిస్తున్నారు. రోజుకు సగటున 80కి పైగా ఎంఆర్ఐ స్కాన్లు మరియు 130కి పైగా సీటీ స్కాన్లు అతి తక్కువ ధరకు అందించడం జరుగుతుంది. అత్యవసర కేసులకు ఉచితంగా స్కాన్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 38 ప్రయోగశాలల్లో ల్యాబ్ మరియు డయాగ్నోస్టిక్ సేవలు ఇప్పటివరకు 66,23,923 అందించగా, 2025-26 సంవత్సరంలో 21.85 లక్షల మందికి ఈ సేవలు అందాయి.

అమృత్ కింద నాణ్యమైన ప్రత్యేక మందులు మరియు నమ్మదగిన ఇంప్లాంట్లు అతి తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రిలోని జన ఔషధి కేంద్రంలో అతి తక్కువ ధరకు మందులు లభిస్తున్నాయని రోగులను ప్రత్యక్షంగా కలిసి వారి నుండి తెలుసుకోవడం జరిగింది. ఆయుర్వేద మరియు హోమియోపతి వైద్య సేవలను అందించే సదుపాయాలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3,86,895 ఐడీలు ఇచ్చి 25,52,171 రికార్డులను లింక్ చేసి 10,42,947 రికార్డులను స్కాన్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చడం జరిగింది.

45 రకాల విభాగాలకు సంబంధించి 42 డిపార్ట్‌మెంట్ల సేవలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 1,698 మందిలో 210 మంది ఫ్యాకల్టీ, 46 మంది నాన్ ఫ్యాకల్టీ-జీపీ ఏ, 233 మంది సీనియర్ రెసిడెంట్లు, 246 మంది జూనియర్ రెసిడెంట్లు, 84 మంది నాన్ ఫ్యాకల్టీ-జీపీ బి, 218 మంది సీనియర్ నర్సింగ్ సిబ్బంది, 504 మంది జూనియర్ నర్సింగ్ సిబ్బంది, 157 మంది నాన్ ఫ్యాకల్టీ-జీపీ సి లు సేవలు అందిస్తున్నారు.

మొత్తం క్యాంపస్‌లో 70 రకాల కోర్సులకు సంబంధించిన 1,280 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 623 మంది ఎంబీబీఎస్, 30 డిపార్ట్‌మెంట్లలో 243 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు 17 డిపార్ట్‌మెంట్లలో 49 మంది సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు ఉన్నారు. మిగతా విద్యార్థులు నర్సింగ్, హెల్త్ కేర్, ఎమ్ఎస్సీ నర్సింగ్ తదితర విభాగాల్లో ఉన్నారు.

2019-24 మధ్య జగన్మోహన్ రెడ్డి హయాంలో రహదారికి అవసరమైన భూమిని ఎయిమ్స్ వద్ద సమకూర్చలేదు, కనీసం ఎయిమ్స్‌కి అవసరమైన నీటి వసతి కల్పించడంలో విఫలమయ్యారని లంక దినకర్ తెలిపారు. 2024లో కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మరియు రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ సర్కార్ ఎయిమ్స్ రహదారికి అవసరమైన స్థలం మరియు ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన నీటి సరఫరా మౌలిక సదుపాయాలు కల్పించిందని లంక దినకర్ పేర్కొన్నారు.

చైతన్యరథం

## వైసీపీ విధ్వంసం నుంచి

# ఎక్సైజ్‌ను గాడిలో పెట్టాం

- పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల స్వేచ్ఛ, ప్రభుత్వ ఆదాయం
- ఈ నాలుగంశాలు లక్ష్యంగా సమూల సంస్కరణలు
- రెండేళ్లలో ఎక్సైజ్ రంగంలో చారిత్రాత్మక మార్పులు సాధించాం
- రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఎక్సైజ్ రంగాన్ని గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, విధానపరమైన వైఫల్యాలు, పారదర్శకత లేమి తీవ్రంగా దెబ్బతీశాయని రాష్ట్ర ఎక్సైజ్, గనులు-భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రజల అభిరుచులు, మార్కెట్ అవసరాలు, ప్రభుత్వ ఆదాయ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి అమలు చేసిన విధానాల వల్ల రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థ విశ్వసనీయత కోల్పోయిందని ఆయన అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్సైజ్ రంగ పునరుద్ధరణను అత్యంత ప్రాధాన్యత అంశంగా గుర్తించి సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏర్పడిన అవ్యవస్థను సరిదిద్దడంతో పాటు పారదర్శకత, సాంకేతికత, వినియోగదారుల స్వేచ్ఛ, నాణ్యత నియంత్రణ, ఆదాయ వృద్ధి అనే ఐదు అంశాలపై ఆధారపడి కొత్త ఎక్సైజ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారదర్శక పాలన, అక్రమాల నిర్మూలన, ప్రభుత్వ ఆదాయ వృద్ధి అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థను దేశంలోనే ఆదర్శవంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో జరిగిన విధానపరమైన లోపాలను సరిదిద్దుతూ, ప్రజల ప్రయోజనాలను కేంద్రబిందువుగా ఉంచుకుని సంస్కరణల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో మద్యం విక్రయ వ్యవస్థను పూర్తిగా కేంద్రీకరించి, మార్కెట్ డిమాండ్‌ను పక్కనబెట్టి కొద్ది బ్రాండ్లకు మాత్రమే ప్రాధాన్యత కల్పించారని మంత్రి విమర్శించారు. దేశవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడయ్యే ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను రాష్ట్రంలో అందుబాటులో లేకుండా చేయడం ద్వారా వినియోగదారుల ఎంపిక హక్కును కాలరాసారని అన్నారు. ప్రజలకు కావలసిన బ్రాండ్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో అక్రమ సరఫరా వ్యవస్థలు పెరిగాయని, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

మద్యం సరఫరా, పంపిణీలో పారదర్శకతను తీసుకువచ్చే ఆన్‌లైన్ ఆర్డర్ ఫర్ సప్లై వ్యవస్థను నిర్వీర్యం చేసి మాన్యువల్ విధానాలకు ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి తెలిపారు. షాపులు కోరిన బ్రాండ్లకు బదులుగా అధికార యంత్రాంగం నిర్ణయించిన బ్రాండ్లను బలవంతంగా సరఫరా చేయడం వల్ల మార్కెట్ సహజ వ్యవస్థ దెబ్బతిందన్నారు. డిమాండ్ ఉన్న బ్రాండ్లు కొరతకు గురవగా, వినియోగదారులకు ఇష్టంలేని ఉత్పత్తులు మార్కెట్‌లోకి ప్రవేశపెట్టబడ్డాయని చెప్పారు.

గత ప్రభుత్వ కాలంలో డిజిటల్ చెల్లింపులను నిరుత్సాహపరిచి నగదు లావాదేవీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పారదర్శకత పూర్తిగా దెబ్బతిందని మంత్రి తెలిపారు. దాదాపు రూ. 99,413 కోట్ల రిటైల్ మద్యం విక్రయాల్లో కేవలం రూ. 615 కోట్ల మేర మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరగడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎక్సైజ్ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. పారదర్శకత, పోటీ, వినియోగదారుల స్వేచ్ఛ, ప్రభుత్వ ఆదాయ వృద్ధి లక్ష్యాల ఆధారంగా నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపొందించామని చెప్పారు. ప్రైవేట్ రిటైల్ వ్యవస్థను పునరుద్ధరించి, పూర్తిగా పారదర్శకమైన దరఖాస్తు మరియు లాటరీ విధానాల ద్వారా షాపుల కేటాయింపులు చేపట్టామని తెలిపారు. గతంలో ఉన్న అనధికార చెల్లింపులు, మధ్యవర్తిత్వ వ్యవస్థలకు పూర్తిగా ముగింపు పలికామని స్పష్టం చేశారు.

నూతన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతి దుకాణానికి అనేక రెట్లు పోటీ నెలకొందన్నారు. ప్రభుత్వంపై, విధానంపై ప్రజలకు, వ్యాపార వర్గాలకు ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

నూతన ఎక్సైజ్ విధానంలో వినియోగదారుల అభిరుచులు, మార్కెట్ డిమాండ్‌కు అత్యంత ప్రాధాన్యత కల్పించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అందుబాటులో లేకుండా పోయిన అనేక జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను తిరిగి రాష్ట్ర మార్కెట్‌లోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. బీర్ విభాగంలోనే 46కు పైగా బ్రాండ్లు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయని, గతంలో రాష్ట్ర మార్కెట్‌లో లేని అనేక అంతర్జాతీయ బ్రాండ్లు కూడా ప్రవేశించాయని చెప్పారు.

మద్యం నాణ్యత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన ప్రమాణాలను అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విక్రయించే ప్రతి మద్యం ఉత్పత్తిని శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా సమగ్రంగా పరీక్షించిన అనంతరమే మార్కెట్‌లోకి అనుమతిస్తున్నామని తెలిపారు. ప్రతి బ్రాండ్‌పై 13కు పైగా కీలక నాణ్యత ప్రమాణాల ఆధారంగా పరిశీలనలు చేపడుతూ అత్యాధునిక ప్రయోగశాలల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని మంత్రి స్పష్టం చేశారు.

కల్తీ మద్యం, నకిలీ బ్రాండ్లు, అక్రమ రవాణా, పన్ను ఎగవేత వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్ర సరిహద్దులు, గిడ్డంగులు, రిటైల్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే కల్తీ మద్యం తయారీ, విక్రయాలపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు.

ఎక్సైజ్ శాఖలో సాంకేతికత వినియోగాన్ని విస్తృతంగా పెంచామని మంత్రి తెలిపారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ట్రాకింగ్, తక్షణ పర్యవేక్షణ, సరఫరా గొలుసు పర్యవేక్షణ వంటి చర్యల ద్వారా ఆదాయ లీకేజీలను అరికట్టగలిగామని చెప్పారు. నూతన ఎక్సైజ్ విధానం రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికీ దోహదపడుతోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పర్యాటక కార్యకలాపాలు, ఆతిథ్య రంగం అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంలో ఎక్సైజ్ రంగ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. సమావేశంలో రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, నిషేధ-ఎక్సైజ్ శాఖ కమిషనర్ చాముకూరి శ్రీధర్, నిషేధ-ఎక్సైజ్ అమలు విభాగం డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని

# కూటమి ప్రభుత్వం అమలు చేసింది

- రెండేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచలేదు, మూడేళ్లలో పెంచేది లేదు
- పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
- పెట్టుబడిదారులను తరిమేసిన చరిత్ర జగన్ రెడ్డిది
- ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టీకరణ



నరసరావుపేట (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతూ దుష్ప్రచారాలు చేయడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పార్టీ నీచ రాజకీయాలు చేస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నరసరావుపేటలో సోమవారం నిర్వహించిన కూటమి రెండేళ్ల విజయోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, బిందు సేద్యపు వ్యవస్థలు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. అలాగే డీఆర్డీఏ, వెలుగు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సబ్సిడీపై ఆటోలను అందజేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించిన మంత్రి గొట్టిపాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం నిర్వహించిన సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి కూటమి కార్యకర్తలే ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది అయితే, విద్యుత్ పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి తరిమేసిన నీచ చరిత్ర జగన్ ప్రభుత్వానిదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసమే ఏడాదికి రూ. 33 వేల కోట్లను వెచ్చిస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున పింఛన్ల కోసం ఖర్చు చేయడం లేదని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కరోజే రూ. 10 వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ. 8,900 కోట్లకు పైగా సహాయం చేశామన్నారు. విద్యార్థులు అందరికీ ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి కేవలం ఒక్క బిడ్డకే అమ్మ ఒడి అమలు చేసినట్లు మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ఇలా ఇచ్చిన ప్రతీ హామీని వైసీపీ ప్రభుత్వం తప్పిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న అవినీతి ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు.

వైసీపీ పాలనలో అమరావతి రాజధాని పనులు నిలిచిపోయాయని, 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు కూడా నిలిచిపోవడంతో రైతులకు సాగునీరు అందలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిలిచిపోవడం వల్ల 920 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం కూడా ఆగిపోయిందని తెలిపారు. వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, కోట్లాది రూపాయిలు అప్పులు తెచ్చి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారని మంత్రి ఆరోపించారు. రెండేళ్ల కూటమి పాలనలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విద్యుత్ భారం ప్రజలపై వేయలేదని, రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీల పెంపు ఉండదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. రాయలసీమతో పాటు పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, పల్నాడులో రెండు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రజలకు ఏవి అవసరమో అవన్నీ చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లతో పాటు అర్హులకు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు.

# రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా

# ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం పాలన
- కొండపి నియోజకవర్గంలో రెండేళ్లలోనే రూ.532 కోట్ల అభివృద్ధి
- ప్రకాశం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం
- రాష్ట్రాభివృద్ధికి కూటమి సుస్థిరకాలం అధికారంలో ఉండాలి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టీకరణ
- టంగుటూరులో 2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" సభ



ప్రకాశం / టంగుటూరు, జూన్ 15: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం టంగుటూరులో కొండపి నియోజకవర్గస్థాయి 2 ఏళ్ల నమ్మకం –అభివృద్ధి –సంక్షేమం" విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి డిఎస్‌బీవీ స్వామి, ఒంగోలు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. సభలో మంత్రి డోలా మాట్లాడుతూ... "రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామలన్నీ అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం... సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో పెద్దఎత్తున సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. కొండపి నియోజకవర్గంలో రెండేళ్లలోనే రూ.532 కోట్ల అభివృద్ధి సాధించాం. 2012లో కొండపి రోడ్డు మంజూరు చేయిస్తే ఏడేళ్ల తర్వాత తిరిగి తెదేపా నిర్మించింది. అభివృద్ధికి చిహ్నం తెదేపా, కొండపి నియోజకవర్గంలో పంచాయతీరాజ్, విద్యుత్తుశాఖ, అర్ అండ్ బీ, నీటిపారుదల, వైద్యశాఖ, ఆర్ డబ్ల్యూఎస్, సంగమేశ్వరం తదితర శాఖల పనులకు రూ.532 కోట్లతో పనులు చేపట్టాం. దేశవ్యాప్తంగా అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే. పేదల కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. డీఎస్సీ పోస్టింగులపై కులాలకు ఆపాదించి కులాల మధ్య రెచ్చగొట్టే చేష్టలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని గౌరవించే స్వేచ్ఛను ఇస్తే వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో హౌసింగ్ ద్వారా ఇళ్లు నిర్మించుకుంటే ఒక్క రూపాయి ఇవ్వకుండా ఆ నిధులను పక్కదోవ పట్టించారు. అమరావతి నిర్మాతగా చంద్రబాబు పేరు ఉండకూడదన్న కారణంతో వైకాపా పేటిఎం బ్యాచ్ నేటికీ అమరావతిపై విష ప్రచారమే సాగిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి కూటమి సుస్థిరకాలం అధికారంలో ఉండాలని, ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

## వైసీపీ హయాంలో

# దొంగ రిజిస్ట్రేషన్లతో పట్టా భూమి కబ్జా

- ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించిన హోంగార్డు
- వైసీపీ హయాంలో కాలిబాట కబ్జా
- రెవెన్యూ అధికారుల మాయాజాలం.. రికార్డులున్నా దక్కని న్యాయం
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
- మైనారిటీ మంత్రి ఫరూఖ్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్



మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పలువురు తమ సమస్యలతో అర్జీలు సమర్పించారు. భూ కబ్జాలు, రెవెన్యూ అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం వంటి సమస్యలపై మైనారిటీ మరియు న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్‌లకు పలువురు అర్జీలు అందించారు.

కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామానికి చెందిన చిన్న మాబు అర్జీ ఇస్తూ, తమకు వారసత్వంగా సంక్రమించిన 62 సెంట్ల పట్టా భూమిని వైఎస్సార్సీపీ హయాంలో స్థానిక వ్యక్తులు రాజకీయ పలుకుబడి, రెవెన్యూ అధికారుల సహకారంతో దొంగ రిజిస్ట్రేషన్ల ద్వారా కాజేశారని వివరించారు. ముందుగా 30 సెంట్లు, ఆ తర్వాత మొత్తం 62 సెంట్ల భూమిని వేర్వేరు వ్యక్తుల పేర్లపై విక్రయించారని తెలిపారు. అధికారుల చుట్టూ తిరిగినా "కోర్టుకు పోయి తేల్చుకో" అని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా గొల్లగూడెం గ్రామానికి చెందిన బాలరాజు, సాంబశివరావు, శ్రీనివాస్ అర్జీ ఇస్తూ, తమ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన హోంగార్డు చేబోయిన మురళి కుటుంబం అక్రమంగా ఆక్రమించిందని తెలిపారు. పాఠశాల ఆవరణలోనే పశువుల పాక నిర్మించి పిల్లల చదువులకు అడ్డుపడుతున్నారని, అరుగులపై ప్రమాదకరమైన పురుగు మందుల డబ్బాలు ఉంచి చిన్నారుల ప్రాణాలను ప్రమాదంలో పెడుతున్నారని వివరించారు. రెవెన్యూ సిబ్బంది హద్దులు చూపించేందుకు వచ్చినా హోంగార్డు కుటుంబం వారిని అడ్డుకుని వెనక్కి పంపిందని, అయినా స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పశువుల పాకలు, అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని కోరారు.

కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన వెంకటేశ్వరరావు అర్జీ ఇస్తూ, తమ ప్రాంతంలో ఒక కాలిబాటను వైఎస్సార్సీపీ హయాంలో కొందరు స్థానికులు పూర్తిగా తవ్వేసి, అక్కడున్న కల్వర్టును కూడా కూల్చివేశారని తెలిపారు. సుమారు మూడేళ్లుగా ప్రత్యామ్నాయ మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం హాలిగేర గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ అర్జీ ఇస్తూ, తమకు చెందిన పట్టా భూమిలో సుమారు 15 సెంట్లను పక్క పొలం వారు అక్రమంగా ఆక్రమించారని తెలిపారు. రికార్డులన్నీ తమ పేరిటే ఉన్నప్పటికీ స్థానిక తహసీల్దార్ క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండా ఏకపక్షంగా తప్పుడు నివేదిక ఇచ్చి కేసు క్లోజ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాపట్ల జిల్లా రేపల్లె మండలం పోటుమెరక గ్రామానికి చెందిన కాగితాల రవిబాబు అర్జీ ఇస్తూ, తమ వ్యవసాయ భూమికి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువులు తవ్వారని తెలిపారు. అధికారులు పెనాల్టీలు విధించినా వసూలు చేయలేదని, చెరువులు ధ్వంసం చేయాలని సబ్ డివిజనల్ కమిటీ తీర్మానించినా మత్స్యశాఖ అధికారులు ఆ ఫైలును కలెక్టర్ వద్దకు వెళ్లనివ్వకుండా మూడు నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

చిత్తూరు జిల్లా వి.కోట మండలం కె.నక్కనపల్లి గ్రామానికి చెందిన దిలీప్ అర్జీ ఇస్తూ, తన తండ్రి 1992లో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని తమ కుటుంబమే సాగు చేస్తూ వస్తోందని తెలిపారు. తండ్రి నిరక్షరాస్యుడవడంతో పట్టాదారు పాస్ పుస్తకం తీసుకోలేదని, తండ్రి మరణానంతరం తన పేరిట భూమి బదిలీ చేయించుకోవడానికి సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరిగినా "చేస్తాం చూస్తాం" అంటూ కాలయాపన చేస్తున్నారని వివరించారు. మార్కాపురం జిల్లా వాలిచర్ల గ్రామానికి చెందిన హరినారాయణ రెడ్డి, రంగారెడ్డి అర్జీ ఇస్తూ, వారసత్వంగా సంక్రమించిన ఏడు ఎకరాల పట్టా భూమిని రికార్డుల్లో నమోదు చేయడానికి డబ్బులు తీసుకున్న రెవెన్యూ అధికారులు తమ పేర్లు చేర్చకుండా ఇతరులకు అనుకూలంగా మార్పులు చేశారని, నకిలీ రిజిస్ట్రేషన్ల ద్వారా అసలు హక్కుదారులైన తమ భూమిని అక్రమంగా వేరే వారికి విక్రయించారని ఆరోపించారు.

చిత్తూరు జిల్లా వి.కోట మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన శివశంకర్ అర్జీ ఇస్తూ, తమ పొలం పక్కనున్న పెద్ద భూస్వాములు రాజకీయ పలుకుబడితో సరిహద్దు రాళ్లు, గట్లు పెకిలించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమకు తెలియకుండా పట్టా భూమిలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు నాటారని, పలు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని వివరించారు.

ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలానికి చెందిన గాదే కోటిరెడ్డి అర్జీ ఇస్తూ, గత ఐదు సంవత్సరాలుగా స్థానిక వ్యక్తులు తమను పొలంలోకి వెళ్లనివ్వడం లేదని తెలిపారు. అధికారి అనుమతితో రోడ్డు వేయించినా సదరు వ్యక్తులు మళ్లీ ముళ్ల తీగలు కట్టి దారి మూసివేశారని, అడిగినందుకు కుటుంబ సభ్యులపై దాడి చేసి మొబైల్ ఫోన్లు పగలగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అర్జీ ఇస్తూ, తల్లి మరణానంతరం చట్టబద్ధంగా మ్యుటేషన్ అయిన భూమిలో 80 సెంట్లను సహ హక్కుదారురాలి సంతకం లేకుండానే రెవెన్యూ రికార్డుల్లో వేరే వ్యక్తుల పేరిట మార్చివేశారని తెలిపారు. ఆర్డీఓ ఆదేశాలు ఇచ్చినా వీఆర్ఓ, సర్వేయర్ నేటికీ రికార్డులు సరిచేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నంద్యాల జిల్లా వాలిచర్ల గ్రామానికి చెందిన భరత్ అర్జీ ఇస్తూ, కౌలుకు తీసుకున్న ఆరు ఎకరాల భూమిని సాగుకు అనుకూలంగా మార్చేందుకు ఆరు లక్షల రూపాయలు ఖర్చు చేశానని, అయితే భూ యజమాని బుద్ధి మార్చుకుని తనకు తెలియకుండానే ఆ భూమిని వేరే వారికి ఇచ్చేశాడని, నిలదీసినందుకు బెదిరింపులకు గురిచేస్తున్నాడని వివరించారు. బాపట్ల జిల్లా యడపూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ అర్జీ ఇస్తూ, తమ తండ్రి 1957లో కొనుగోలు చేసిన భూమిలో 28 సెంట్లను స్థానిక వ్యక్తి అక్రమంగా ఆక్రమించి రెవెన్యూ రికార్డుల్లో కూడా తన పేరు నమోదు చేయించుకున్నాడని ఆరోపించారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు సమర్పించిన వారితో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థించారు.



## నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం పవన్

**అమర స్థూపం వద్ద వీర జవాన్లకు ఘన నివాళి**

**త్యాగచక్ర గోడలపై తెలుగు సైనికుల ఫలకాలకు అంజలి**

న్యూఢిల్లీ (చైతన్య రథం): భారత సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచే ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్‌ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. అమరస్థూపం వద్ద వీర జవాన్లకు పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వందనం సమర్పించారు. కల్నల్ ఆర్.కె. ఆనంద్, కెప్టెన్ రోహిత్ గార్గ్ నేతృత్వంలో ఈ వందన సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దేశ భద్రత కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల జీవితాలను సైనికాధికారులు వివరిస్తుంటే శ్రద్ధగా ఆలకించారు. సైనికుల ప్రాణత్యాగాల ఔన్నత్యాన్ని తెలుసుకునే అవకాశం దక్కడం, వారికి నివాళులు అర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం వార్ మెమోరియల్‌లో త్యాగచక్ర పేరిట అమర జవాన్ల పేర్లతో చెక్కిన వివరాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వీర జవాన్ జి.ఎన్.ఆర్. సతీష్ తదితరుల పేర్లతో చెక్కిన గోడలకు నివాళులు అర్పించారు. శౌర్య చక్ర రాజ్‌కుమార్, హవిల్దార్ అరుణ్ కుమార్ పేర్ల వద్ద పుష్పాలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం వార్ మెమోరియల్ సందర్శనకు గుర్తుగా డిజిటల్ పుస్తకంలో సంతకం చేశారు. వార్ మెమోరియల్‌లో నాలుగు స్మారక చక్రాల విశేషాలను సైనికాధికారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేలాది మంది నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించి తమకు ఇష్టమైన వీర జవాన్ల పేర్లు లిఖించిన గ్రానైట్ ఫలకాలకు నివాళులు అర్పిస్తుంటారని, వార్ మెమోరియల్‌కి వచ్చే వారంతా దీన్ని ఓ దేవాలయంలా భావిస్తారని సైనికాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక–సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, జనసేన పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, లింగమనేని రమేష్, శాసనమండలి సభ్యులు కొణిదల నాగబాబు, టీటీడీ బోర్డు సభ్యులు ఆనంద్ సాయి, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు వార్ మెమోరియల్ సందర్శించిన వారిలో ఉన్నారు.

# పేదల గూడుకు 'చంద్రన్న' భరోసా

- **సొంతింటి కల సాకారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**
- **2029 నాటికి అర్హులందరికీ పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు**
- **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అదనపు సాయం**
- **శరవేగంగా పీఎంఏవై 1.0 పథకం ఇళ్ల నిర్మాణం**
- **అర్బన్‌లో ఊపందుకుంటున్న పీఎంఏవై 2.0 పనులు**
- **సీఎం ఇచ్చిన టార్గెట్లను అందుకునేందుకు శ్రమిస్తున్న మంత్రి**
- **వారం వారం సమీక్షలతో క్షేత్రస్థాయిలో పరుగులు పెడుతున్న అధికారులు**



రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వాలు మారుతుంటాయి... కొత్త ప్రభుత్వాలు వస్తుంటాయి... రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గృహ నిర్మాణ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను ఆపవద్దని, కక్షపూరిత చర్యలకు కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని తెలియజేశారు. దీంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY 1.0) పథకం ద్వారా రాష్ట్రంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టించింది. 2025 నవంబరు 12న ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల మంది పేదలకు సొంతిళ్లు అందించి వారి కళ్లల్లో ఆనందం నింపారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు వాటిని ఉగాది సందర్భంగా 30-03-2026న అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అంతే కాదు 2026 జూన్ నాటికి మరో 2.70 లక్షల, సెప్టెంబరు నాటికి 1.62 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించి కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చే మంచి ప్రభుత్వం అని ఈ దేశానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అహర్నిశలూ శ్రమిస్తున్నారు. పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా పేదల కల నెరవేర్చేందుకు ఇటు గృహ నిర్మాణ శాఖ అధికారులు, అటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సమన్వయంతో దూసుకుపోతున్నారు.

### ఆర్థిక ఇబ్బందుల్లోనూ పేదవారికి చేయూత

రాష్ట్రం అప్పుల ఊబిలో దిగిపోయి, ఆ పరిస్థితి నుంచి ఎలా బయటపడాలనే ఆలోచనలో ఉన్నప్పటికీ పేదవారి సొంతింటి కలను నెరవేర్చడమే బాధ్యతగా కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన విషయాన్ని, వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు నినాదాన్ని నిజం చేసేందుకు చంద్రబాబు పరితపిస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, బీసీ, ఎస్టీలకు 2014-18 మధ్య కాలంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తే... .వాటిని రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అదనపు ఆర్థిక సాయంగా రూ.50వేలు, ఎస్సీలకు రూ.75వేలు, పీవీజీటీలకు రూ.లక్ష అందించేందుకు చర్యలు చేపట్టింది. తద్వారా రాష్ట్ర ఖజానాపై రూ.3,219.75 కోట్ల భారం పడింది. అంతేకాదు ముస్లిం మైనార్టీలకు కూడా అదనపు ఆర్థిక సాయం కావాలని అడిగిన వెంటనే చంద్రబాబు వారికి వరం ఇచ్చిన విధంగా రూ.50వేలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై మరో రూ.90కోట్ల అదనపు భారం పడింది.

### 5.98లక్షల మంది పేదల కళ్లల్లో, ఇళ్లల్లో ఆనందం

జగన్మోహన్ రెడ్డి మాదిరి కక్షపూరిత చర్యలకు పాల్పడకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు ఆర్థిక సాయం విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ధరించడంతో లక్షలాది పేదల ఇళ్లల్లో, కళ్లల్లో ఆనందం నిండింది. ఆయన నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 5.98లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీల కల నెరవేరుతోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకుంటున్న 3,73,204 మంది బీసీలకు రూ.50వేలు చొప్పున ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,866.02 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైంది. 1,57,383 లక్షల మంది ఎస్సీలకు రూ.50వేలు చొప్పున రూ.786.915 కోట్ల భారం భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పీవీజీటీలు 45,766 మందికి రూ.75వేలు చొప్పున రూ.343.245 కోట్లు ఇవ్వడానికి సముఖత వ్యక్తం చేసింది. 22,357 పీవీజీటీల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఇవ్వనుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వంపై పడే ప్రత్యేక భారం రూ.223.57 కోట్లు. రాష్ట్రంలోని మైనార్టీలు 18వేల మందికి రూ.50వేల ఆర్థిక సాయం కోసం రూ.90కోట్లు ఖర్చు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పీఎంఏవై అర్బన్‌కు సంబంధించి 1.19 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం రూ.231.45 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం కోసం విడుదల చేసి పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఎనలేని కృషి చేస్తోంది.

### ఊపందుకుంటున్న PMAY 2.0 ఇళ్ల నిర్మాణం

ఏపీకి అవసరమైన ఇళ్ల జాబితాను కేంద్రానికి పంపగా ఆమోదం వచ్చిన 46,636 ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే



ఊపందుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వీటిలో ఇప్పటిదాకా 2,562 ఇళ్లు పూర్తయ్యాయి. 44,074 ఇళ్లు పెండింగులో ఉండగా 18,906 నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 25,168 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభంకావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు పీఎంఏవై 1.0, 2.0 పనుల కింద 15,82,260 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 9,46,544ఇళ్లు పైకప్పు వరకు పూర్తయ్యాయి. మరో 6,35,716 ఇళ్లు పెండింగు లో ఉండగా వాటిలో 6,10,548ఇళ్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. 25,168 ఇళ్లు నేటికీ ప్రారంభం కాలేదు. ఈ ఇళ్లు అన్నింటి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.20,260.74 కోట్లు ఖర్చు పెట్టనుంది.

### PMAY 2.0లో ఇళ్ల కోసం 10.42 లక్షల దరఖాస్తులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో కొత్త ఇళ్లు కావాలని 10.42 లక్షల దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ సిబ్బంది చేసిన ఆవాస్ ప్లస్ సర్వే ద్వారా ఈ వివరాలు తెలిశాయి.


| క్రమ సంఖ్య | జిల్లా పేరు | దరఖాస్తులు |
|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 75,117 |
| 2 | విజయనగరం | 39,559 |
| 3 | పార్వతీపురం మన్యం | 31,325 |
| 4 | అల్లూరి సీతారామరాజు | 77,353 |
| 5 | విశాఖపట్నం | 7,433 |
| 6 | అనకాపల్లి | 45,129 |
| 7 | కాకినాడ | 28,621 |
| 8 | కోనసీమ | 27,667 |
| 9 | తూర్పు గోదావరి | 23,676 |
| 10 | పశ్చిమ గోదావరి | 16,773 |
| 11 | ఏలూరు | 54,234 |
| 12 | కృష్ణా | 10,445 |
| 13 | ఎన్టీఆర్ | 22,126 |
| 14 | గుంటూరు | 25,254 |
| 15 | బాపట్ల | 21,698 |
| 16 | పల్నాడు | 45,348 |
| 17 | ప్రకాశం | 41,706 |
| 18 | నెల్లూరు | 60,873 |
| 19 | తిరుపతి | 42,813 |
| 20 | చిత్తూరు | 50,460 |
| 21 | అన్నమయ్య | 68,508 |
| 22 | వైఎస్ఆర్ కడప | 29,631 |
| 23 | అనంతపురం | 66,969 |
| 24 | శ్రీసత్యసాయి | 63,586 |
| 25 | నంద్యాల | 34,880 |
| 26 | కర్నూలు | 31,015 |
| **మొత్తం** | | **10,42,199** |






### ఐదేళ్లలో 16.63 లక్షల ఇళ్ల నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తున్నాం
### గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి

సొంతిల్లు లేని పేదవారు ఉండకూడదు. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పేదల విషయంలో నిర్లక్ష్యం అనేది ఎక్కడా కనిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన తొలి సమీక్షలోనే మాకు దిశానిర్దేశం చేశారు. అంతేకాదు దశలవారీగా ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు అందించాలని, నిర్దిష్ట ప్రణాళికలు పెట్టుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కూడా సీఎం ఆదేశించారు. ప్రతి ఆర్థిక సంవత్సరం మాకు నిర్దిష్ట టార్గెట్లు ఇచ్చి ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో 3లక్షల ఇళ్లు ఒకసారి, 2.50లక్షల ఇళ్లు ఒకసారి ఇచ్చాం. 2026-27 నాటికి PMAY అర్బన్ పథకం ద్వారా 3,35,376 ఇళ్లను రూ.3,769.58 కోట్లతో, PMAY గ్రామీణ పథకం ద్వారా 62,157 ఇళ్లను రూ.699కోట్లతో, PMJANMAN పథకం ద్వారా 16,971 ఇళ్లను రూ.190.80 కోట్లతో నిర్మించేందుకు ఒక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఈ ఏడాది ప్రారంభమయ్యే PMAY అర్బన్ 2.0 పథకం ద్వారా 30,000 ఇళ్లను రూ.750 కోట్లతో, PMAY గ్రామీణ్ 2.ా పథకం ద్వారా 10,000 ఇళ్లను రూ.120కోట్లతో ఇళ్లు నిర్మించబోతున్నాం. మొత్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో 4,54,504 ఇళ్లను రూ.5,529.38కోట్లతో నిర్మించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళు న్నాం. 2027-28 సంవత్సరంలో PMAY అర్బన్ 2.0 పథకం ద్వారా 40,000 ఇళ్లను రూ.1,000 కోట్లతో, PMAY గ్రామీణ్ 2.0 పథకం ద్వారా 3,50,000 ఇళ్లను రూ.4,200కోట్లతో నిర్మించబోతున్నాం. 2027-28 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3,90,000 ఇళ్లను రూ.5,200 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సిద్ధం చేశాం. 2028-29 సంవత్సరంలో PMAY అర్బన్ 2.0 పథకం ద్వారా 28,651ఇళ్లను రూ.716.28కోట్లతో, PMAY గ్రామీణ్ 2.ా పథకం ద్వారా 2,40,000 ఇళ్లను రూ.2,880 కోట్లతో నిర్మించబోతున్నాం. 2028-29 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2,68,651ఇళ్లను రూ.3,596.28 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలతో గృహ నిర్మాణ శాఖ సంసిద్ధంగా ఉంది. 2024-2029 మధ్య కూటమి ప్రభుత్వం పేదవారి కోసం 16,63,155 ఇళ్లు నిర్మించేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఇది పేదల సొంతింటి కలను నెరవేర్చే ప్రభుత్వం..మంచి ప్రభుత్వం అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా అర్థం చేసుకుంటారని నమ్ముతున్నాం.



**కొలుసు పార్థసారధి**
*రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి*

## లీ క్వాన్ యూ, చంద్రబాబు... ఇద్దరి సిద్ధాంతం ఒకటే

# అభివృద్ధే పరమావధి



చరిత్రలో కొందరు నాయకులు కేవలం పాలకులు గానే కాకుండా తమ ప్రాంతాల భవిష్యత్తును మలిచిన శిల్పులుగా నిలిచిపోతారు. అటువంటి వారు అధికారాన్ని అనుభవించడానికి కాదు తమ కలను సాకారం చెయ్యడానికి రాజకీయాల్లోకి వస్తారు. అలాంటి నాయకుల జాబితాలో సింగపూర్ వ్యవస్థాపక మాజీ ప్రధాని లీ క్వాన్ యూ పేరు అగ్రస్థానంలో నిలుస్తుంది. మూడో ప్రపంచ దేశంగా, సహజ వనరులు లేని చిన్న ద్వీపంగా ఉన్న సింగపూర్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దిన ఆయన దూరదృష్టి నేటి ప్రపంచదేశాలకు ఆదర్శం. అలాగే సింగపూర్ నమూనాను అత్యంత సమీపంగా అధ్యయనం చేసి, అభివృద్ధి సిద్ధాంతాన్ని భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయడానికి ప్రయత్నించిన నాయకుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. లీ క్వాన్ యూ సింగపూర్‌కు ఏ స్థానం సంపాదించారో అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు చంద్రబాబునాయుడు. ఈ ఇద్దరి ప్రయాణాలు భిన్నమైన రాజకీయ పరిస్థితుల్లో సాగినా, వారి ఆలోచనల కేంద్ర బిందువు మాత్రం ఒక్కటే... అదే అభివృద్ధే పరమావధి. ప్రజల జీవన ప్రమాణాల పెంపు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, సాంకేతికత ఆధారిత పాలన, భవిష్యత్ తరాలకు అవకాశాల సృష్టి వంటి అంశాల్లో ఇద్దరి సిద్ధాంతం ఒక్కటే.

1965లో మలేషియా నుంచి విడిపోయి సింగపూర్ స్వతంత్ర దేశంగా అవతరించినప్పుడు మంచినీటి కోసం కూడా పొరుగు దేశాలపై ఆధారపడిన, సహజ వనరులు లేని ఒక చిన్న ద్వీప దేశం. భూ భాగం తక్కువ, నిరుద్యోగం ఎక్కువ, జాతి విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. కానీ లీ క్వాన్ యూ దాన్ని కేవలం భౌగోళికంగానే కాకుండా ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రగామిగా నిలిపారు. విద్య, పారిశ్రామికీకరణ, విదేశీ పెట్టుబడులే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని విశ్వసించారు. ఆ విధంగానే 2014 లో విభజన గాయాలతో, నిధులు లేని శూన్య స్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సింగపూర్ పరిస్థితులే ఎదురయ్యాయి. ఆ సంక్షోభ సమయంలో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా క్లిష్ట పరిస్థితుల్లోనూ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించగలిగారు. పారిశ్రామిక కారిడార్లు, ఐటీ విస్తరణ, ప్రపంచ స్థాయి రాజధాని, మౌలిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు చూపిన పట్టుదల సింగపూర్ నమూనాను గుర్తుకు తెస్తుంది. వనరులు లేని దేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలబెట్టిన లీ క్వాన్ యూ సంకల్పం ఎంత బలమైనదో, విభజించి నష్టపోయిన రాష్ట్రాన్ని సాంకేతికతతో, మౌలిక వసతులతో ప్రగతి పథంలో నడపాలన్న చంద్రబాబునాయుడి అకుంఠిత దీక్ష అంతటిదే.

### నాటి సింగపూర్ మోడల్ నేటి నవ్యాంధ్రలో పునరావృతం

లీ క్వాన్ యూ,చంద్రబాబు ఇద్దరివీ వేర్వేరు దేశాలు అయినా వేర్వేరు కాలాలకు చెందిన నాయకులు అయినా వారి ఆలోచనల్లో సిద్ధాంతం ఒక్కటే అభివృద్ధే. ఒకరు సింగపూర్‌ను ప్రపంచంలో అద్భుతంగా నిర్మించగా మరొకరు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, సుపరిపాలనకు ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. సింగపూర్ వ్యవస్థాపక మాజీ ప్రధాని లీ క్వాన్ యూ అభివృద్ధి సిద్ధాంతం చంద్రబాబును ఎప్పటి నుంచో ప్రభావితం చేస్తుంది. అభివృద్ధి, సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పెట్టుబడులు ఆకర్షణ వంటి అంశాల్లో ఆయన సింగపూర్ నమూనాను ఆదర్శంగా తీసుకొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను ఐటీ హబ్ గా తీర్చిదిద్దడం నుంచి, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అభివృద్ధి దిశను నిర్దేశించడం వరకు చంద్రబాబు ఆలోచనల్లో నాటి సింగపూర్ మోడల్‌ను నేటి నవ్యాంధ్రలో పునరావృతం చేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. నాటి సింగపూర్ పరిణామం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచినట్లే, నవ్యాంధ్ర అభివృద్ధి గాథ కూడా భవిష్యత్‌లో దేశానికి ఆదర్శంగా నిలవనున్నది.

### వ్యవస్థల నిర్మాణానికే ప్రాధాన్యం


లీ క్వాన్ యూ, చంద్రబాబు ఇద్దరూ కూడా వ్యక్తిగత ఇమేజ్ కంటే వ్యవస్థల నిర్మాణానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అవినీతి రహిత పాలన కోసం కఠినమైన చట్టాలు, సమర్థవంతమైన సివిల్ సర్వీస్ వ్యవస్థను నిర్మించగా... పాలనను ప్రజలకు చేరువ చెయ్యడానికి చంద్రబాబు 'ఈ గవర్నెన్స్', ' రియల్ టైమ్ గవర్నెన్స్' వంటి వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అధికారులను జవాబు దారీగా మార్చడంలో సాంకేతికతను పాలనలో భాగం చెయ్యడంలో ఆయన చూపిన చొరవ లీ క్వాన్ యూ శైలిని తలపిస్తుంది. ఈ ఇద్దరు నాయకులూ నిరంతరం పని చేసే విషయంలో ప్రపంచ ప్రసిద్ధి చెందారు. విశ్రాంతి గురించి ఇద్దరూ పట్టించుకోరు. రోజుకు 16 నుంచి 18 గంటలు పనిచెయ్యడం వీరిద్దరి దిన చర్యలో భాగం. కంపెనీ లాభాల కోసం సీఈవో ఎలాగైతే నిరంతరం ఆలోచిస్తాడో... రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు అంతే కష్టపడి పని చేస్తారు. లీ క్వాన్ యూ సింగపూర్ ప్రజల మేధస్సుపై పెట్టుబడి పెట్టారు. అందుకే ఆ దేశంలో సహజ వనరులు లేకపోయినా మానవ వనరుల ద్వారా అభివృద్ధి చేశారు. చంద్రబాబు కూడా నాలెడ్జ్ ఎకానమీ పట్ల అదే నమ్మకాన్ని కలిగి అధికారంలో ఉన్న ప్రతిసారీ విద్యా సంస్థలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, టెక్నాలజీ హబ్‌ల స్థాపనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

### ఏ ప్రాజెక్టు చేపట్టినా ప్రపంచంలోనే బెస్ట్‌గా ఉండాలనే తపన

లీ క్వాన్ యూ... సింగపూర్‌ను ఆసియాకే పరిమితం చేయకుండా అమెరికా, యూరోపా దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దారు. ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాలు, పారిశ్రామిక వాడలను ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయిలో నిర్మించారు. చంద్రబాబు కూడా ఏ ప్రాజెక్టు చేపట్టినా ప్రపంచంలోనే బెస్ట్‌గా ఉండాలనే తపనపడతారు. ఉదాహరణకు శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణం, తర్వాత అమరావతి రాజధాని ప్రణాళికల్లో ఆయన సింగపూర్, జపాన్ వంటి దేశాల్లోని అత్యుత్తమ ప్రమాణాలను మన రాష్ట్రానికి తీసుకురావాలని ప్రయత్నించారు. లీ-ప్రపంచ పెట్టుబడిదారులను సింగపూర్‌కు ఆహ్వానించి, దానిని అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా మార్చారు. ప్రభుత్వ స్థిరత్వం, పారదర్శకత, వేగవంతమైన నిర్ణయాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయి. సింగపూర్‌ను సాంకేతికంగా ఆధునిక దేశంగా తీర్చిదిద్దారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇచ్చారు. చంద్రబాబు కూడా ఇదే సూత్రాన్ని పాటించి దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. చంద్రబాబు భారత రాజకీయాల్లో సాంకేతికతను పరిపాలనలో వినియోగించిన తొలి నాయకుల్లో ఒకరు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడం నుంచి డిజిటల్ గవర్నెన్స్ వరకు ఆయన తీసుకున్న చర్యలు అభివృద్ధిలో సాంకేతికత పాత్రను ప్రతిబింబించాయి. దూరదృష్టి ఉన్న నాయకులు తరాల భవిష్యత్తు గురించి ఆలోచిస్తారు. లీ క్వాన్ యూ సింగపూర్‌ను ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానంలో నిలపగా చంద్రబాబు కూడా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

### ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకుని...

చంద్రబాబు ఎప్పుడూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల కోసం కాకుండా దీర్ఘకాలికంగా ఉపయోగపడే వ్యవస్థలను నిర్మించడానికే ప్రాధాన్యత ఇస్తారు. లీ క్వాన్ యూ సింగపూర్‌ను దాదాపు మూడు దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంతో అభివృద్ధి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో, పరిమిత కాలంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనుకోవడం చంద్రబాబుకి ఉన్న అతిపెద్ద సవాలుగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రజలు తాత్కాలిక ప్రయోజనాలను కోరుకుంటే దూరదృష్టితో



రాబోయే 25 ఏళ్ల గురించి ఆలోచించడం వీరిద్దరి సిద్ధాంతం. హైటెక్ సిటీ నుంచి అమరావతి వరకు చంద్రబాబు ప్రయాణం, లీ క్వాన్ యూ నిర్మించిన గ్లోబల్ సిటీ మాడల్‌ను తలపిస్తుంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంలో చూపిన అసాధారణమైన సమర్థత వీరిద్దరినీ సమకాలీన ప్రపంచ నాయకుల్లో ప్రత్యేకంగా నిలబెట్టాయి.మానవ వనరులే సంపద అని, దేశం దేని మీద ఆధారపడకూడదు, కేవలం ప్రజల మేధస్సు, వారి నైపుణ్యమే అభివృద్ధికి చోదక శక్తి కావాలని నమ్ముతారు ఈ ఇద్దరు నాయకులు. లీ క్వాన్ యూ నిర్మించిన సింగపూర్ ప్రపంచానికి ఎలా ఒక పాఠమో, చంద్రబాబు వేసిన పునాదులు కూడా తెలుగు రాష్ట్రాల పారిశ్రామిక, సాంకేతిక ప్రగతికి ఒక దిక్సూచిగా నిలుస్తాయి అనడంలో సందేహం లేదు. ప్రభుత్వాలు మారుతాయి. కానీ శూన్యం నుంచి శిఖరాన్ని నిర్మించే క్రమంలో వారు చూపిన దార్శనికత, దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టాలనే తపన ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే. ఒకే విధమైన లక్ష్యంతో, ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకున్న ఈ ఇద్దరు 'కర్త, కర్మ, క్రియ'లు నాయకత్వానికి ఉన్న అసలైన నిర్వచనం.ఈ ఇద్దరు నాయకులలో ఉన్న ప్రధాన సారూప్యత నిరంతర అన్వేషణ. సింగపూర్ మాజీ ఆర్థిక మంత్రి క్వేట్ శితర్మన్ షణ్ముగరత్నంరి ఒక సందర్భంలో చంద్రబాబును ఉద్దేశించి... సింగపూర్ అభివృద్ధికి లీ క్వాన్ యూ ఎలాంటి పునాదులు వేశారో ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే విషయంలో చంద్రబాబునాయుడు అలాంటి దీక్షతో పనిచేస్తున్నారని ప్రశంసించడం యాదృచ్ఛికం కాదు. వీరిద్దరి సారూప్యతలో కనిపించే ముఖ్యాంశాలు. వీరిద్దరి ప్రయాణంలోనూ రాజకీయాలకు అతీతంగా 'అభివృద్ధే పరమావధిగా నిలిచింది. ఒకరు దేశాన్ని నిర్మిస్తే, మరొకరు రాష్ట్రాన్ని ఒక బ్రాండ్‌గా మార్చారు. ఇద్దరూ సమర్థవంతమైన పాలన, దూరదృష్టి గల ప్రణాళికలు, క్రమశిక్షణతో కూడిన నాయకత్వమే సామాన్యుడి జీవితాన్ని మారుస్తాయని నిరూపించారు. నిజమైన నాయకులకు అధికారం కంటే సమాజంపై వారు చూపే ప్రభావమే కొలమానమని వీరిద్దరి చరిత్ర మనకు నిరంతరం గుర్తు చేస్తుంది.

నీరుకొండ ప్రసాద్

---

#### ప్రజా సమస్యలపై వచ్చే వినతులను

## త్వరితగతిన పరిష్కరించాలి

#### అధికారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశం

బనగానపల్లె (చైతన్య రథం): ప్రజల నుంచి వచ్చిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు-భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా సంతోషం వ్యక్తమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



# మాజీ మంత్రి అమర్నాథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**●గాజువాక నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ::గొల్లవిల్లి కనక భవాని**



గాజువాక (చైతన్యరథం): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవాని ఆధ్వర్యంలో తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు గాజువాక పట్టణ పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి విశాఖ జిల్లా చోడవరం పట్టణంలో జరిగిన వైసీపీ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై వ్యక్తిగతంగా, మహిళా గౌరవానికి భంగం కలిగించే విధంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మహిళల పట్ల గౌరవం, మర్యాద పాటించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, ఒక దళిత మహిళగా ఉన్న రాష్ట్ర హోంశాఖ మంత్రిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం సమాజంలో తప్పు సంకేతాలను పంపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**● సాగునీటి కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే బగ్గురమనమూర్తి**



నరసన్నపేట (చైతన్యరథం): దేవాది పాత హైవే రోడ్డు పక్కన ఉన్న గోపాలపెంటకు వెళ్లే ప్రధాన కాలువ ఓల్డ్ ఎన్‌హెచ్-5 రహదారిని దాటే ప్రాంతంలో ఉన్న పాత కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలు, రైతుల నుంచి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే కాలువ పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కాలువ ద్వారా దేవాది గ్రామంతో పాటు గోపాలపెంట, మాకివలస ప్రాంత రైతులకు సాగునీరు అందుతుండగా, ప్రస్తుతం కల్వర్టు దెబ్బతినడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కల్వర్టు పునర్నిర్మాణం చేపట్టకపోతే సుమారు 600 నుంచి 700 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి కల్వర్టు పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే మరమ్మతులు పూర్తి చేసి కాలువలో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కూడా సమస్యను పరిశీలించి, త్వరలోనే సాంకేతిక నివేదిక సిద్ధం చేసి అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే పర్యటనతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రూ.2.27 కోట్లతో అభివృద్ధి పనులు



సింహాచలం (చైతన్యరథం): జీవీఎంసీ 98 వార్డులో రూ.2.77 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు అడవివరం కాపుదిబ్బ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాద్రి అప్పన్న దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తారని.. రూ. 1.25 కోట్లతో తొలిపావంచ వద్ద అభివృద్ధి, సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు. అలాగే వార్డు కార్యాలయం, రోడ్లు, డ్రెయిన్ల కోసం మరో రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్లలో మధురవాడ జోన్ లో మౌలిక వసతులు కల్పన కోసం రూ. 200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించామని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, బూర్ల కనకారావు, అవినాష్, రాజు, సూరిబాబు, ముగ్గ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో వెన్నుపోటుకు నిలువెత్తు రూపం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు

**●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**●ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.2,500 కోట్లు కేటాయించాం**

**●రెండేళ్లలో రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.62 వేల కోట్లు ఖర్చు చేసాం**

**●మద్యపాన నిషేధం పేరుతో ప్రజలను మోసగించిన గొడ్డలి పార్టీ అధ్యక్షుడు**

**●రెండేళ్ల విజయ ప్రస్థానానికి ఘనోత్సవం.. టెక్కలిలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ**

టెక్కలి (చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గంలోని ఆదిత్య కళ్యాణ మండపంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ఇచ్చిన పిలుపునకు ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లతో ఎన్డీఏకు అధికారాన్ని అందించారు" అని అన్నారు. అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లో సంక్షోభం నెలకొని, వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని అన్నారు. రెండేళ్ల కాలంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన ప్రగతిని వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేయూతనందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపై, గొడ్డలి పార్టీ అధ్యక్షుడిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రూ.10.50 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. 2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల పాటు ఏపీ అవకాశాలను కోల్పోయిందన్నారు. విధ్వంసాన్ని సరిచేసేందుకు ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నామని తెలిపారు. ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఎమ్మార్వో కార్యాలయాలు, ఆస్పత్రులు, మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టారని విమర్శించారు. యావత్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన గొడ్డలి పార్టీ అధ్యక్షుడు విధ్వంసమైన వ్యవస్థలను సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని తెలిపారు.

**రాజకీయాల్లో వెన్నుపోటు అనే పదానికి నిలువెత్తు రూపం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు**

రాజకీయాల్లో వెన్నుపోటు అనే పదానికి నిలువెత్తు రూపం గొడ్డలి పార్టీ అధ్యక్షుడేనని మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసినందుకు వెన్నుపోటా? సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినందుకు వెన్నుపోటా? మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్లను నియమించాం. దీనికి వెన్నుపోటా?" అని ప్రశ్నించారు. మాయమాటలు, అబద్ధపు హామీలతో వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తోందని అన్నారు.

**2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం**

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా 2027కి ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. యూరియా అధిక వినియోగం భూసారాన్ని దెబ్బతీస్తుందని, రైతులు దాని వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రాజకీయ భేదాలు లేకుండా అన్ని గ్రామాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని మంత్రి స్పష్టం చేశారు.



**యూరియా వాడకం తగ్గించండి**

రైతులు యూరియాను అమితంగా వాడుతున్నారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా, పండించే పంటల ద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి యూరియా వాడకాన్ని తక్షణమే తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో 24 నెలలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల వరి పంటకు భవిష్యత్తులో పెద్దగా అవకాశాలు లేవని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు

**విజయోత్సవ సభకు నాలుగు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**

టెక్కలిలో నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభకు నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన పలువురు లబ్ధిదారులు వేదికపై తమ అనుభవాలను పంచుకున్నారు.

# దెబ్బతిన్న వ్యవస్థలను నిలబెట్టాం : టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి



విశాఖపట్నం (చైతన్యరథం): సెక్టార్ -1, మువీపీ కాలనీ, వెంకోజిపాలెం ఉడా కల్యాణమండపంలో కూటమి ప్రభుత్వ రెండేళ్లు పాలన పూర్తి చేసకున్న సందర్భంగా విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు (టీడీపీ,బీజేపీ,జనసేన) కార్యకర్తలు కలిసి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సదరు కార్యక్రమానికి విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో దెబ్బతిన్న వ్యవస్థను నిలబెట్టామని తెలిపారు, విశాఖపట్నంలో శాంతి భద్రతలను అదుపులో ఉన్నాయని తెలిపారు. విశాఖను అభివృద్ధితో పరుగు పెట్టిస్తున్నారని తెలిపారు. రైల్వే జోన్, భోగాపురం ఎయిర్ పోర్టు, గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజంట్, ఆర్సలర్ మిట్టల్ వంటి ప్రతిష్టత్మక ప్రాజెక్ట్స్ సాధించమని తెలిపారు. సదరు కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్, కె.రవి రాజు, బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ పట్నాయక్, జనసేన ఇన్‌ఛార్జ్ ఒమ్మి సన్యాసిరావు, కాళ్ళ శంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే కూన

ఆమదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలో రూ. 6.20 కోట్లతో నిర్మించిన పలు గ్రామాల్లో బీటీ రహదారులను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించారు. నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, రూ.6 కోట్ల 20 లక్షల నిధులతో నిర్మించిన పలు బీటీ, సీసీ రహదారులను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. సరుబుజ్జిలి మండలంలోని పెద్దపాలెం గ్రామపంచాయతీలో రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ, బీటీ రహదారులు, షలంత్రి గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నసలంత్రీ గ్రామంలో రూ.2 కోట్ల 90 లక్షలతో నిర్మించిన బీటీ రహదారులను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. కొత్తకోట ఏబీ రోడ్ నుంచి చిగురువలస పంచాయతీ పరిధిలోని బక్రీపేట గ్రామానికి రూ.81 లక్షలతో నిర్మించిన బీటీ రహదారి ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే కూన హామీ ఇచ్చారు.

# చింతలపూడిలో రెండేళ్ల పాలన సంబరాలు

**●గత ప్రభుత్వం చేయలేనిది మేం చేసి చూపించాం: ఎమ్మెల్యే రోషన్ కుమార్**

**●చింతలపూడిలో కూటమి శక్తి ప్రదర్శన: ర్యాలీ, సభతో దద్దరిల్లిన పట్టణం**



చింతలపూడి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం చింతలపూడిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించాయి. చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తికాని అనేక అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే పూర్తి చేసిందని తెలిపారు. "అభివృద్ధి అంటే కూటమి, కూటమి అంటే అభివృద్ధి" అని ఎమ్మెల్యే రోషన్ కుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రగతి మరియు ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, చింతలపూడి మండల టీడీపీ అధ్యక్షులు చింతం విష్ణు పాల్గొన్నారు. జనసేన నుంచి నియోజకవర్గ అధ్యక్షులు మేకా ఈశ్వరయ్య, చింతలపూడి మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు హాజరయ్యారు. బీజేపీ తరపున ఏలూరు జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ పాల్గొన్నారు. చింతలపూడి ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గాపార్వతి మధుబాబు కూడా సభలో పాల్గొన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీ, సభలో పాల్గొని విజయవంతం చేశారు.

# సుపరిపాలనకు రెండేళ్లు.. సువర్ణాంధ్ర దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం

రామచంద్రపురం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తుండటంతో వాటిని చూసి తట్టుకోలేకే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెంలోని కళ్యాణ మండపంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన నిర్వహించిన సుపరిపాలనకు రెండేళ్లు – విజయోత్సవ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి గట్టి తీర్పు ఇచ్చి రెండేళ్లు పూర్తయిందని, ఆ ఓటమిని గుర్తు చేసుకుంటూ వైసీపీ నాయకులు ర్యాలీలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ, రైతు భరోసా, మత్స్యకారుల సంక్షేమం, ఆటో డ్రైవర్లకు చేయూత, అన్న క్యాంటీన్లు వంటి పథకాల ద్వారా లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. పెట్టుబడులు, నూతన పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# పేద ప్రజలకు కొండంత భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి : ఎమ్మెల్యే బూర్ల



ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గుంటూరు రూరల్ మండలం, తురకపాలెం గ్రామానికి చెందిన పచ్చల క్రాంతికి రూ.3,00,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు అందజేశారు. "పేద ప్రజల కష్టాల్లో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుంటుంది" అనే భావనకు ప్రతీకగా గుంటూరు రూరల్ మండలం, తురకపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ బూత్ ఇన్‌ఛార్జ్ పచ్చల సురేష్ ఇటీవల అనారోగ్య కారణాలవల్ల మరణించగా వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రామాంజనేయులని సంప్రదించగా, ఎమ్మెల్యే వెంటనే స్పందించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా త్వరితగతిన ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయడం జరిగింది. ఈ ఆర్థిక సహాయం మాకెంతో అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులుకి, కూటమి ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# తంగిరాల ప్రభాకర్‌రావు ఆశయాలే నందిగామ అభివృద్ధికి మార్గదర్శకం



నందిగామ (చైతన్యరథం): దివంగత శాసనసభ్యులు, తంగిరాల ప్రభాకర్‌రావు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు నందిగామ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని ప్రభాకర్‌రావుకి నివాళు లర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి కంచికచర్ల మండలం కీసర గ్రామంలో ఏర్పాటు చేసిన తంగిరాల ప్రభాకర్‌రావు నూతన విగ్రహాన్ని ఎంపీ చిన్ని ఆవిష్కరించారు. అనంతరం నందిగామ ఘాట్ వద్ద నివాళు లర్పించి, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ కేశినేని చిన్ని, తంగిరాల ప్రభాకర్‌రావు నందిగామ రాజకీయ చరిత్రలో చెరగని ముద్రవేసిన ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం శ్రమించిన నాయకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధిలో తంగిరాల ప్రభాకర్‌రావు, దేవినేని వెంకటరమణ చేసిన సేవలు మరువలేనివని చిన్ని అన్నారు. ఈ ఇద్దరు నాయకులు నందిగామకు రెండు కళ్ల వంటివారని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు. అంతేకాకుండా, నందిగామలో తెలుగుదేశం పార్టీని కంచుకోటగా తీర్చిదిద్దిన ఘనత కూడా ప్రధానంగా తంగిరాల ప్రభాకర్ రావు, దేవినేని వెంకటరమణదేనని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ పార్టీకి బలమైన పునాదులు వేసిన నాయకులుగా వారు చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. పదవిని అధికార ప్రదర్శనకు కాకుండా ప్రజాసేవకు ఒక సాధనంగా తంగిరాల ప్రభాకర్‌రావు వినియోగించుకున్నారని, అందుకే ఆయన మరణానంతరం కూడా ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నారని చిన్ని వ్యాఖ్యానించారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పనిచేసిన అరుదైన నాయకుడిగా ఆయనను స్మరించుకున్నారు.

# విద్యే భవిష్యత్తుకు బాట : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**●ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత**

**●65 మంది పేద విద్యార్థులకు రూ.6.30 లక్షల ఆర్థిక సాయం**

**●చల్లా శంకర్రావు సేవలను కొనియాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమనే సంకల్పంతో ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు ఆధ్వర్యంలో 65 మంది పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.6.30 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు చేతుల మీదుగా విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ శతాబ్ద కాలానికి చేరువలో ఉన్న ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఆర్థిక రంగంలోనే కాకుండా సామాజిక బాధ్యతల్లోనూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థికంగా అండగా నిలుస్తూ ప్రతి ఏడాది సహాయం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. చైర్మన్ చల్లా శంకర్రావు నాయకత్వంలో బ్యాంక్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, బ్యాంకు లాభాలను సమాజానికి తిరిగి అందించే విధంగా విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# ఈడ్పుగంటి శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నాం : బడేటి రాధకృష్ణయ్య



దెందులూరు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఈడ్పుగంటి శ్రీనివాసరావు (లాయర్)ని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడేటి రాధాకృష్ణయ్య సోమవారం వెల్లడించారు. గడిచిన కొద్దీ కాలం నుండి స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై అనేక ఆరోపణలు చేస్తూ పత్రిక సమావేశాలు నిర్వహిస్తు పార్టీ నియామవాళిని అతిక్రమించినందుకు ఆయనను పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ బడేటి చంటి పత్రిక సమావేశం నిర్వహించారు. గతంలో చేసిన ఆరోపణలు ఏవైనా ఉన్నా పార్టీ దృష్టికి తీసుకురావాలని వాటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా పార్టీ చర్యలు తీసుకుంటామని ఇడ్పుగంటి శ్రీనివాసరావుకి గతంలో తెలియజేశామని కానీ ఆయన ఆ నియమాలను పాటించుకోకుండా పత్రిక సమావేశాలు నిర్వహిస్తు, సోషల్ మీడియా ద్వారా అనేక వ్యాఖ్యలు చేస్తున్నారని వివరించారు.

# ఎంపీ భాష్యం రామకృష్ణకు ఎమ్మెల్యే నసీర్ ఘనసత్కారం



గుంటూరు (చైతన్యరథం): విద్యావేత్త,గా మంచి మనసున్న నేతగా ఎంపీ భాష్యం రామకృష్ణ ప్రజల మన్ననలు పొందారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కు రాజ్యసభ పదవి వచ్చినందుకుగాను సోమవారం ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే నసీర్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన నేత భాష్యం రామకృష్ణ అని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఎంపీ భాష్యం రామకృష్ణ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాలు అధికంగా చేపట్టిన బాష్యం రామకృష్ణ అభినందనీయులని తెలిపారు. ప్రజల నమ్మకమే బలంగా రాజకీయ ప్రస్థానం సాగాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల కాలంలోనే అమరావతి, పోలవరం వంటి ప్రతిష్టాత్మకమైన నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. అదే సమయంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు జోడెద్దుల్లా ముందుకు తీసుకెళు తున్నట్లు చెప్పారు. విద్యాపరంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యావేత్తగా భాష్యం రామకృష్ణ వంటి వారు తెలుగుదేశం పార్టీకి మరింత వన్నెతెస్తారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రభుత్వవిప్, సెంట్రల్ నియోజకవర్గం శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 63వ డివిజన్లోని ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ శాసనసభ్యులు బోండా ఉమా చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సంవత్సరము పదవ తరగతిలో పరీక్షలలో అత్యంత,577 మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని, దుర్గ భవానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేసి కళాశాలలో ఏ అవసరమైన నేను అండగా ఉంటానని సహాయక. సహకారాలు అందిస్తానని, భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం మహిళా ఉపాధ్యక్షురాలు తాడిశెట్టి నాగలక్ష్మి, కూటమి నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో సంతోషంగా ప్రజలు



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతూ రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నదని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గం 6వ డివిజన్ కోకాకోలా స్ట్రీట్‌లో గద్దె క్రాంతి కుమార్ పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరగడంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్ పడాల లక్ష్మణను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చులు నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తదుపరి 16 వ బూత్‌లో జరుగుతున్న SIR ఓటర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో రాష్ట్రంలో సానుకూల వాతావరణం నెలకొన్నదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలు, యువత, రైతులు, పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.

## ప్రజల తీర్పును ఫేస్‌బుక్ పోస్టులతో మార్చలేరు... కేశినేని నానీ!

**●120 కోట్ల ప్రశ్నకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా? : టీడీపీ సీనియర్ నాయకులు మాదిగాని గురునాథం**



విజయవాడ (చైతన్యరథం): ప్రజలు స్పష్టంగా తిరస్కరించి రాజకీయంగా పక్కన పెట్టిన తర్వాత కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా సోషల్ మీడియా వేదికగా అసత్యాలు, అపోహలు, నిరాధార ఆరోపణలు ప్రచారం చేయడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాదిగాని గురునాథం మాజీ ఎంపీ కేశినేని నానీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజలు ఒకసారి తీర్పు ఇస్తే ప్రజాస్వామ్యంలో దానిని గౌరవించడం రాజకీయ సంస్కృతి. కానీ ప్రజలు తిరస్కరించిన తర్వాత కూడా ప్రతి రోజు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ విషప్రచారం చేయడం చూస్తుంటే ప్రజల తీర్పును ఇప్పటికీ అంగీకరించలేకపోతున్నారని స్పష్టంగా తెలుస్తోంది" అని అన్నారు.

**రూ.120 కోట్ల రుణాల వ్యవహారంపై ఎందుకు మౌనం?**

ఈరోజు ఇతరులను ప్రశ్నించే నానీ ముందుగా తనపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారిన రూ.120 కోట్ల బ్యాంకు రుణాల వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని మాదిగాని గురునాథం డిమాండ్ చేశారు. "విజయవాడలో, రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదు? ఆ రుణాలు తీసుకున్నారా లేదా? తీసుకుని ఉంటే ఎందుకు చెల్లించలేదు? సామాన్య రైతు రుణం చెల్లించకపోతే బ్యాంకులు నోటీసులు ఇస్తాయి. ఆటోడ్రైవర్ చెల్లించకపోతే వాహనం స్వాధీనం చేసుకుంటాయి. చిన్న వ్యాపారి చెల్లించకపోతే ఆస్తులు వేలం వేస్తాయి. మరి మీ విషయంలో ఎందుకు మౌనం? మీకు ఒక న్యాయం... సామాన్య ప్రజలకు మరో న్యాయమా?" అని ప్రశ్నించారు.

## ప్రభుత్వంపై నిందలే.. భవిష్యత్‌లో జగన్‌కు గుదిబండలుగా మారతాయి

**●కూటమి పాలనలో జగన్.. వైసీపీనేతలు తప్ప అన్నివర్గాల్లోనూ చెప్పలేని సంతోషం**

**●ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి అభివృద్ధిని, ప్రజలకు జరిగే మంచిని, వారి సంతోషాన్ని ఓర్వలేని ఏకైక రాజకీయ పార్టీ దేశంలో వైసీపీ ఒక్కటేనని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని సహించలేకే జగన్ పూటకో రకంగా ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాడని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం నరసరావుపేటలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమం కూటమి విజయోత్సవ సభలో ప్రత్తిపాటి కీలకోపన్యాసం చేశారు. అంతకు ముందు స్థానిక శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు నివాసం నుంచి మైదానం వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రత్తిపాటి, కూటమి శ్రేణులతో కలిసి ఉత్సాహంగా ముందుకు సాగారు. అనంతరం సభాస్థలికి చేరుకొని, కూటమి శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు.

**జగన్.. వైసీపీ నేతలు తప్ప, అన్నివర్గాల్లోనూ సంతోషం**

రాష్ట్రంలో జగన్ .. వైసీపీనేతలు తప్ప, అన్నివర్గాల ప్రజలు కూటమి పాలనలో సంతోషంగా ఉన్నారని, జగన్ ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఇక ఎప్పటికీ కోరుకోరని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ప్రశాంతమైన రాష్ట్రంలో చిచ్చు పెట్టి, రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలన్న దురుద్దేశంతోనే జగన్.. కుల, మత విద్వేషాలకు ఆజ్యం పోస్తున్నాడన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి మరోసారి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

**ప్రభుత్వంపై నిందలే.. భవిష్యత్‌లో జగన్‌కు గుదిబండలు అవుతాయి..**

యువత దశాబ్దాల కలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు నిజం చేశారన్న అక్కసుతోనే జగన్ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై వేసే నిందలే జగన్‌కు భవిష్యత్‌లో గుదిబండలుగా మారతాయన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, మత్స్యకారులు, ఆటోడ్రైవర్లు, నేతన్నలు, కార్మికులు, కూలీలు ఇలా అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రత్తిపాటి చెప్పారు.

## తంగిరాల ప్రభాకర్‌రావు సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం



నందిగామ (చైతన్యరథం): మాజీ శాసనసభ్యులు దివంగత తంగిరాల ప్రభాకర్‌రావు 12వ వర్ధంతి సందర్భంగా నందిగామలో నిర్వహించిన పలు స్మారక కార్యక్రమాల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. రైతుపేటలోని తంగిరాల ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధిర రోడ్డులోని ఆయన ఘాట్‌ను సందర్శించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన నేతలు రక్తదాతలను అభినందించి వారి సేవాభావాన్ని కొనియాడారు. అనంతరం గాంధీ సెంటర్‌లో తంగిరాల ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదరికం నుంచి అంచెలంచెలుగా ఎదిగి ప్రజాసేవనే ధ్యేయంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించిన తంగిరాల ప్రభాకర్‌రావు నందిగామ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.

## మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**●హోంమంత్రి వంగలపూడి అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు వైసీపీ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనం**



గుంటూరు (చైతన్యరథం): రాజకీయాల్లో విభేదాలు సహజమని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతి ప్రతిపక్షానికీ ఉందని, అయితే విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని, రూపాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏ మాత్రం సమంజసం కాదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పనితీరుపై కాకుండా ఆమెను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఒక దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, హుందాగా, అందంగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అసహనం కలుగుతోందని ప్రశ్నించారు. ఇవి కేవలం హోంమంత్రి అనితని మాత్రమే కాదు, తమకు నచ్చిన విధంగా హుందాగా జీవించే ప్రతి మహిళను అవమానించే వ్యాఖ్యలని అన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక మహిళల రూపురేఖలను లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరు లేదా హోంమంత్రి విధానాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో విమర్శించాలని, వ్యక్తిత్వ హననానికి దిగడం రాజకీయ దివాళాకోరుతనమని పేర్కొన్నారు.

## డీఎస్సీపై వైసీపీ కాకమ్మకబుర్లు! : ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు (చైతన్యరథం): 146 రోజుల్లో 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేయడాన్ని జీర్ణించుకోలేక డీఎస్సీపై మరో కుట్రకు వైసీపీ తెరలేపింది. తన అనుకూల సోషల్ మీడియా, తన అనుకూల వ్యక్తుల ద్వారా కమ్మ కులానికి టీచర్ పోస్టులంటూ తప్పుడు విశ్లేషణలని జగన్ బ్యాచ్ చేయిస్తోంది. 2014-19 మధ్య కాలంలో కమ్మ కులానికి చెందిన డీఎస్పీలకే ప్రమోషన్లు అంటూ నాడు తప్పుడు ప్రచారం చేసింది. ఇప్పుడు డీఎస్సీ-2025 విషయంలో మళ్లీ పాత స్ట్రాటజీనే తెర మీదకు తెస్తూ వైసీపీ విషం చిమ్ముతోందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మెరిటోరియల్ స్పోర్ట్స్ కోటా 382 ఉద్యోగాలలో ఎస్సీలకు 112, బీసీలకు 196, ఎస్టీలకు 29, ఓసీ 42 ఉద్యోగాలు పారదర్శకంగా దక్కాయి. కానీ వైసీపీ నేతలు మాత్రం స్పోర్ట్స్ కోటా అంతా ఒకే కులానికి ఇచ్చేశారంటూ అడ్డగోలు ప్రచారం చేస్తున్నారు. అందులోని అసలు వాస్తవాలను గమనిస్తే ఓసీలకు వచ్చిన 42 పోస్టుల్లో కాపు సామాజిక వర్గానికి చెందిన యువతకు 16 ఉద్యోగాలు, రెడ్డి సామాజిక వర్గానికి 10, వైశ్యులకు 2, క్షత్రియులకు 2, బ్రాహ్మణులకు 2, ముస్లిం మైనారిటీకి 1 దక్కాయి. వైసీపీ ఆరోపణ చేస్తున్న కమ్మ సామాజిక వర్గానికి వచ్చింది కేవలం 9 ఉద్యోగాలు మాత్రమే. గతంలో 2014-19 మధ్య కూడా 36 మంది డీఎస్పీల ప్రమోషన్లలో కమ్మ అధికారి ఒక్కరే ఉన్నా, మొత్తం కమ్మవారికే ఉద్యోగాలు ఇచ్చేశారంటూ ఎన్నికల వరకు అబద్ధాలు ప్రచారం చేసిన వైసీపీ, నేడు డీఎస్సీలోనూ అదే కుట్రను పునరావృతం చేస్తోంది. లిక్కర్ స్కామ్ పుణ్యమా అని ఈడీ ఆధారాల గుట్టు విప్పుతుంటే... ఎక్కడ తమ గుట్టు కూడా రచ్చకెక్కుతుందోనని ఒకటే టెన్షన్ పడిపోతున్న తాడేపల్లి ప్యాలెస్ వర్గాలు... లిక్కర్ కిక్ నుంచి జనాన్ని డైవర్ట్ చేయడానికి మెగా డీఎస్సీపై విషప్రచారం చేస్తోంది.

# పేదలందరికీ కేంద్రప్రభుత్వ పథకాలు

### అధికారులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక ఆదేశాలు




నెల్లూరు (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి అభివృద్ధి సంక్షేమ పథకం జిల్లాలోని ప్రతి పేదవారికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నెల్లూరుపార్లమెంటు సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం నెల్లూరు లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి శాసన సభ్యుడు రామకృష్ణ, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత తో కలిసి జిల్లాలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై ఎంపీశాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇప్పటికే ఆలస్యమైనందున వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్కు సూచించారు. నెల్లూరు రైల్వే స్టేషన్ కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు చేసినందున వారిపై తగు చర్యలు తీసుకుని.. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇటీవలే మొదలు పెట్టామని 2027 మార్చి కి పూర్తి చేస్తామని వివరించారు. బిట్రగుంట రైల్వే కి సంబంధించి ఖాళీగా ఉన్న భూమి సద్వినియోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు..నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ద్వారా జిల్లాకు మంజూరైన పది అభివృద్ధి పనుల్లో ప్రగతిగురించి అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం, ఊటుకూరు గ్రామాల్లో రోడ్డు అభివృద్ధికి సంబంధించి 49 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని ఈపనికిసంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులకు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.నెల్లూరు నగరంలోని బుజబుజ నెల్లూరు, గొలగమూడి జంక్షన్ దగ్గర జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు అక్టోబర్ కల్లా పూర్తి చేయాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఎంపీ అధికారులకు సూచించారు. నగరంలోని చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద మంజూరైన అండర్ పాస్ నిర్మాణంత్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.జిల్లాలో టిడ్కో భవన సముదాయాలలో నూరు శాతం లబ్ధిదారులు గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వికసిత్ భారత్ ప్రధాన మంత్రి అజీవిక మిషన్ (గ్రామీణ్) పథకం ద్వారా ఎక్కువ మందికిలబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు.జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తున్నందున ఈలోపుగా జలధార జల హారతి పనులు పూర్తి చేయాలని ఎంపీ గారు అధికారులకు సూచించారు. కొత్త చట్టం ప్రకారం పని దినాలు 125 రోజులు. పెంచుతున్నారని.. అలాగే రోజువారి పొందే వేతనం రూ. 248 నుండి రూ.307 పొందేలాగా వారిని ప్రోత్సహించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 చివర వరకు పొడిగించిన నందున జిల్లాలో జల జీవన్ వన్ మిషన్ కింద మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులుపూర్తి చేసిన సందర్భంలో నిధులు వచ్చిన వెంటనే పనిచేసిన వారికి చెల్లింపులు పూర్తి చేయాలని కోరారు..ఈ సందర్భంగాతొలుత గత సమావేశ చర్య నివేదికను సీఈవో శ్రీధర్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు వివరించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో ఎన్నో పథకాలు ఉన్నాయని, వాటిని వంద శాతం ఉపయోగించుకుంటే నిధులకు కొరత ఉండదని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టడీ చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి జిల్లాలో వీటిని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.నెల్లూరు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే మన అందరి లక్ష్యం కావాలని ఆయన స్పష్టం చేశారు.అడిగిన సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని చెప్పడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు.



# కూటమి ప్రభుత్వానికి అండగా ఉండండి

### టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపు

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజవర్గం పరిధిలో 17 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన 168 అభివృద్ధి పనులను 24వ డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కలిసి పరిశీలించారు.

చెప్పిన మాట ప్రకారం 168 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తిచేసి ప్రజలకు అందిస్తామన్నారు. ప్రతీ వారం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి 168 అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకుంటున్నామన్నారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, మంత్రివర్యులు నారా లోకేష్కు నెల్లూరు రూరల్ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 24వ డివిజన్ లో అభివృద్ధి పనులకు 9 కోట్ల 76 లక్షల రూపాయలు కేటాయింపు జరిగింది. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలన్నారు.

కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్.సి. సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ కనపర్తి గంగాధర్, కో క్లస్టర్ ఇంచార్జ్ రాఘవేంద్ర, 24వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు గుండాల రవి, టిడిపి నాయకులు చెవిరెడ్డి అశోక్ రెడ్డి, పులి హరికృష్ణ యాదవ్, భీమతాటి సుధాకర్, యాదగిరి, మాల్యాద్రి రెడ్డి, కన్నా, చందు, రమేష్, శ్రీనాథ్,చిట్టీ బాబు, ఉయ్యాల జగన్, శ్రీనివాసులు, సుధాకర్, బత్తల రాము, సలీం, భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కేన్సర్ రోగులకు పండ్లు పంచిన మంత్రి నారాయణ సతీమణి



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ జన్మదిన వేడుకలు క్యాన్సర్ ఆస్పత్రిలో సేవా కార్యక్రమాలతో ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, 47, 48 క్లస్టర్ ఇంచార్జ్ ధర్మవరపు సుబ్బారావు, 47వ డివిజన్ ప్రెసిడెంట్ ధర్మవరపు గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని రోగులను వ్యక్తిగతంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ పండ్లను పంపిణీ చేశారు. అనంతరం, ఇదే వేదికపై 47వ డివిజన్ ప్రెసిడెంట్ ధర్మవరపు గణేష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన చేత కేక్ కట్ చేయించి నాయకులు, కార్యకర్తలు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షులు చెంగయ్య, వివేక్, బాబు వీరమల్లు చంద్ర, కంచి కృష్ణ, మురళి రెడ్డి, అలేఖ్య, నాగలక్ష్మి, ఉమా మహేశ్వరి, పిచిరత్నం, రొండ్ల వెంకట ప్రసాద్ రాళ్ళ సురేష్, వన్నె చిరంజీవి , తుళ్లూరు వెంకటేశ్వర్లు.



# నెల్లూరంతా మంత్రి నారాయణ పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 69 వ జన్మదిన వేడుకలు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల సంబరాల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి అల్లుడు గంటా రవితేజ, కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 101 టెంకాయలు కొట్టి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు బాలాజీ, జమీర్, తిరుమల నాయుడు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు.మంత్రి నారాయణ చిత్రపటానికి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వేడుకలకు ముఖ్య అతిథులుగా వచ్చిన మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ పార్టీ ముఖ్య నేతలు,కుటుంబ సభ్యులతో కలిసి నాయకులు ఏర్పాటు చేసిన 69 కేజీల భారీ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ సుజాత అశోక్,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్,నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు తదితర నేతలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో క్యాన్సర్ హాస్పిటల్ లో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.15 వ డివిజన్ లో పెంచల్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. 4 వ డివిజన్ జనార్దన్ రెడ్డి కాలనీలో నారాయణ నేత్రజ్యోతి, దంతసురక్ష మెడికల్ క్యాంపు వద్ద జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు.52 వ డివిజన్ రంగనాయకుల పేట లో ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.లీలా మహల్ సెంటర్, మూలాపేట సెంటర్,పెద్దబజారు సెంటర్ లలో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పొంగూరు రమాదేవి మాట్లాడుతూ మంత్రి నారాయణ ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నప్పటికీ,ఆయన జన్మదిన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి డివిజన్లో సేవా కార్యక్రమాలు నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏడాదికి 10 కోట్లు వెచ్చిస్తూ సిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,మాజీ జడ్పిటిసి విజేతా రెడ్డి,జిల్లా మార్కెటింగ్ కమిటీ మెంబర్ గుణుకుల విజయలక్ష్మి,కాపు భవన్ కమిటీ మెంబర్ సూరిశెట్టి గాయత్రి,రామాలయం చైర్మన్ శ్రీనివాసులు, కొనికా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# ఘనంగా కూటమి విజయోత్సవసభ

## పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి రామానాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు కృష్ణమ్మ



కర్నూలు (చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన కర్నూలులో నిర్వహించిన కూటమి విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సభకు నీటిపారుదల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అలాగే కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన దిశగా ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబాటుతో ముందుకు సాగుతోందని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని, రానున్న రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో కర్నూలు జిల్లా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమం మొత్తం పార్టీ శ్రేణుల ఉత్సాహం, క్రమశిక్షణ, ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయోత్సవ సభను విజయవంతం చేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలందరికీ గుడిసె ఆది కృష్ణమ్మ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఘనంగా కూటమి పాలన విజయోత్సవ సభ

## పాల్గొన్న టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్సన్ బాబు తదితరులు




యర్రగొండపాలెం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా ముందుకు నడిపిస్తూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "2 సంవత్సరాల సుపరిపాలన విజయోత్సవ" కార్యక్రమాల్లో భాగంగా యర్రగొండపాలెం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత హాజరై ప్రభుత్వ పనితీరుపై తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్సన్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సాధికారత వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. "సంక్షేమం ప్రజలకు భరోసా ఇస్తే, అభివృద్ధి భావితరాలకు బంగారు భవిష్యత్తును నిర్మిస్తుంది" అనే దృక్పథంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం రెండేళ్ల విజయోత్సవం మాత్రమే కాదు... ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పాలనకు లభించిన గుర్తింపని పేర్కొన్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమని, ప్రజల సంక్షేమమే నా ధ్యేయం అని అన్నారు. చివరగా, రాష్ట్రాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, యువత, ఉపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తామని హామీ ఇచ్చారు.





కూటమి ప్రభుత్వం విజయవంతంగా 2 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా టంగుటూరులో నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" విజయోత్సవ సభలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, కొండపి నియోజకవర్గ అబ్జర్వర్ డా.పారి చందన స్రవంత్లతో కలిసి పాల్గొన్న రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్, జోనల్ కో-ఆర్డినేటర్ దామచర్ల సత్య



ఎస్సైఆర్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మడకశిర నియోజకవర్గ అబ్జర్వర్ ఎనుముల సుధాకర్ తదితరులు

# టీడీపీలోకి వైసీపీ వలసలు

## కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

మడకశిర (చైతన్యరథం): అమరాపురం మండల పరిధిలోని కెంకెర గ్రామం లో అమరాపురం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు, టీటీడీ బోర్డు మెంబర్,రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామిల సమక్షంలో కెంకెర గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకులు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. కదురప్ప. అంజినప్ప. శివ. కరియప్ప. ప్రసాద్ జోగి. జాజీరప్ప. లక్ష్మీదేవి. కమలమ్మ. సన్నప్ప దాదాపు 20 కుటుంబాలు పార్టీలోకి చేరిన వారికి పసుపు కండువా కప్పి ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టీడీపీ పార్టీలోకి స్వాగతించారు.



# పకడ్బందీగా ఎస్ఐఆర్ అమలు

## ఒక్క ఓటు కూడా తేడా రాకూడదన్న ఎమ్మెల్యే కాకర్ల సురేశ్

ఉదయగిరి (చైతన్యరథం): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరు పంచాయతీ పరిధిలోని పాతూరు గ్రామంలో స్వయంగా పాల్గొన్నారు. తహసిల్దార్ స్వర్ణ, బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి తిరిగి సర్వేను పరిశీలించారు. వింజమూరు మండలంలో మొత్తం 323 పోలింగ్ బూత్‌లు ఉండగా, 363 బూత్‌లకు గాను 323 మంది బీఎల్ఏలను నియమించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వీరందరి పర్యవేక్షణతో సర్ ప్రక్రియను లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ హిమాన్షు ఆదేశాల మేరకు జిల్లాలో 19,74,240 మంది ఓటర్ల వివరాల పరిశీలనకు 2,352 మంది బీఎల్ఓలను నియమించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. జూలై 1, 2026 అర్హత తేదీగా ఎస్ ఐ ఆర్ నిర్వహిస్తున్నారు. ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు. 323 బూత్‌లలో 323 మంది బీఎల్ఏలు పర్యవేక్షిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలి" అని కోరారు. తహసిల్దార్ స్వర్ణ మాట్లాడుతూ, బీఎల్ఓలు ఇంటింటి సర్వే ద్వారా ఫారం–6తో కొత్త ఓటర్ల నమోదు, ఫారం–7తో మరణించిన/షిఫ్ట్ అయిన వారి తొలగింపు, ఫారం–8తో వివరాల సవరణ చేస్తున్నామని వివరించారు. జూలై 21న ముసాయిదా జాబితా, సెప్టెంబర్ 22న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఓటర్లు 1950 హెల్ప్‌లైన్ లేదా నియోజకవర్గ హెల్ప్ డెస్క్‌లను సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల టీడీపీ కన్వీనర్ గూడా నరసారెడ్డి పాల్గొన్నారు.



# ఆగస్టు 7, 8 తేదీల్లో టీసీఏ స్వర్ణోత్సవ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

**హ్యూస్టన్:** హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి (TCA) తన 50వ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఒక ఉత్తేజకరమైన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. ఆగస్టు 7, 8 తేదీల్లో జరిగే ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తమ జట్లను సిద్ధం చేసుకుని పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

**టోర్నమెంట్ వివరాలు...**

ఇందులో పాల్గొనే క్రీడాకారులు ఉత్సాహభరితమైన పోటీ, అద్భుతమైన అనుభవం పొందవచ్చు. తోటి క్రీడాకారులతో పోటీ పడటానికి, కమ్యూనిటీతో కనెక్ట్ అవ్వడానికి ఇది ఒక గొప్ప అవకాశం. ఈ పోటీలు టెక్సాస్‌లోని రోసెన్‌బర్గ్‌లో ఉన్న ఫోర్ట్ బెండ్ ఎపిసెంటర్ (28505 సౌత్‌వెస్ట్ ఫ్రీవే) వేదికగా జరుగుతాయి. ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం www.tca50.org లేదా www.houstontca.org వెబ్‌సైట్‌లను (లేదా) coreteam@tca50.org ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు.






# హాంబర్గ్‌లో కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకలు

**హాంబర్గ్ (జర్మనీ):** కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందిందని జర్మనీ ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. జర్మనీలోని హాంబర్గ్ పట్టణంలో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యాన కూటమి ప్రభుత్వ రెండేళ్ళ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఘంటా రవితేజ ఆన్‌లైన్ ద్వారా పాల్గొని ఎన్ఆర్ఐ టీడీపీ హాంబర్గ్ జర్మనీ టీమ్‌కు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని కోరారు. ఈ వేడుకలకు శశిధర్ ఏమిరెడ్డి, డాక్టర్ శివశంకర్ లింగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి విధ్వంసకారులకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు చెప్పారు. శశిధర్ ఏమిరెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. బాబు సూపర్ సిక్స్‌లోని ప్రధాన హామీలను కేవలం రెండు సంవత్సరాల్లోనే నెరవేర్చారన్నారు. దేశం గర్వించేలా అమరావతి ప్రజా రాజధానిని కూటమి ప్రభుత్వం శరవేగంగా నిర్మిస్తోందన్నారు.

## ఏపీ రూపురేఖలు మారిపోతున్నాయి

డాక్టర్ శివశంకర్ లింగం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిందని, ఇప్పుడు జాబ్ క్యాలెండర్ ద్వారా 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. రామరాయలు వట్టికూటి ప్రసంగిస్తూ గూగుల్ డేటా సెంటర్, క్వాంటమ్ వాలీ, ఎన్టీపీసీ, ఆర్సెల్లార్ మిట్టల్, రిలయన్స్ సీబీజీ, బీపీసీఎల్, టీసీఎస్, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుందన్నారు. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా టీడీపీ కేడర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్ర, సాగర్ మీసాల తదితరులు ప్రసంగించారు. ఈ వేడుకలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హాంబర్గ్ టీడీపీ నేతలు విక్రమ్ తల్లపనేని, రామరాయలు వట్టికూటి, దినేష్ పాకలపాటి సమన్వయం చేశారు. వేడుక విజయవంతం కావడంలో టీడీపీ హాంబర్గ్ నేతలు కిషోర్ దాసుగారి, శ్రీకాంత్ గోళ్ళ, శివ కోలా, భరత్ శీలంనేని, లక్ష్మీ పెర్నీడు కీలక పాత్ర వహించారు. హాంబర్గ్ తెలుగు సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో విద్యార్థులు, పలువురు తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

# అమెరికాలో వెలిగిన భారతీయ జ్ఞానజ్యోతి

## వైభవంగా 'భారతీయత-2026' మహోత్సవం

### సత్సంకల్ప ఫౌండేషన్ లోగో, 'పరాశర సంహిత' గ్రంథం ఆవిష్కరణ

**ఎవాన్ (కనెక్టికట్):** అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రంలో ఉన్న ఎవాన్ హైస్కూలు ప్రాంగణంలో సత్సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'భారతీయత-2026' కనుల పండువగా జరిగింది. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు, కళాకారులు, విద్యార్థులు, విశిష్ట అతిథులతో ఆ ప్రాంతం పండగ వాతావరణాన్ని తలపించింది. ప్రపంచానికి నైతిక విలువలను పరిచయం చేసిన మహర్షుల వారసత్వాన్ని స్మరించుకుంటూ సాగిన ఈ మహోత్సవంలో అమెరికాతో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 800 మందికి పైగా ప్రేక్షకులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ వేదికపై సత్సంకల్ప ఫౌండేషన్ తమ నూతన లోగోను ఆవిష్కరించింది. భారతీయ సాహిత్య సంపదలో విశిష్ట స్థానం కలిగిన 'పరాశర సంహిత' గ్రంథాన్ని ఆవిష్కరించడం ద్వారా సత్సంకల్ప ఫౌండేషన్ అధికారికంగా ప్రచురణ రంగంలోకి అడుగుపెట్టింది. దీంతో పాటు సత్సంకల్ప ఫౌండేషన్, సుపథ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ప్రొఫెసర్ రాఘవేంద్రన్ రచించిన 'గురుదేవోభవ' గ్రంథాన్ని కూడా ఆవిష్కరించారు. సద్గురు శివానందమూర్తి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేస్తున్న సుపథ ఫౌండేషన్ ట్రస్టీ కుమారి రాధారాణిని ఈ వేదికపై ఘనంగా సన్మానించారు.

భారతీయ జ్ఞాన సంపదను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయ డంలో కీలక పాత్ర పోషిస్తున్న ముగ్గురు ప్రముఖులకు ఈ ఏడాది ప్రతిష్టాత్మక 'శివానంద స్మృతి పురస్కారం' ప్రదానం చేశారు: ప్రముఖ ఇంజనీర్, రచయిత డాక్టర్ ఏవీ శ్రీనివాసన్





ప్రముఖ సాంస్కృతిక వేత్త డాక్టర్ కాశీనాథుని ఎం.ప్రసాద్

పద్మభూషణ్ పురస్కార గ్రహీత, పండిత్ వామదేవ శాస్త్రి (డాక్టర్ డేవిడ్ ఫ్రాలీ)

ఈ సందర్భంగా డాక్టర్ కాశీనాథుని ప్రసాద్... "కర్మ, ధర్మం, విజ్ఞానం, సేవ, సంస్కృతితో కూడిన జీవితంలో గీతా బోధనలను ఆచరించడం" అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ ఏవీ శ్రీనివాసన్ హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ తాను దశాబ్దాలుగా పొందిన విలువైన అనుభవాలను పంచుకున్నారు. పండిత్ వామదేవ శాస్త్రి సద్గురు శివానందమూర్తితో తన ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన భరద్వాజ మహర్షి జ్ఞాన కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైమానిక శాస్త్రం, ఆయుర్వేదం, ధనుర్వేదం, రాజధర్మం వంటి రంగాల్లో భరద్వాజ మహర్షి చేసిన కృషిని ఆధునిక కోణంలో పరిచయం చేయడం అక్కడి వారిలో ఎంతో ఆసక్తి, ఆశ్చర్యం కలిగించింది. Seers of Bharat - Bharadwaja Maharshi పేరిట ప్రదర్శించిన సాంస్కృతిక నాటకం ఆహుతులను ఆకట్టుకుంది.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత మాజీ రాయబారి డాక్టర్ మిత్రా వశిష్ట మాట్లాడుతూ.. "భారతదేశపు సాఫ్ట్‌పవర్ ద్వారా భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక ప్రపంచంతో అనుసంధానించడం" ప్రాధాన్యతను వివరించారు. మరో విశిష్ట అతిథి, భారత దౌత్య కార్యాలయం (న్యూయార్క్) ప్రతినిధి సేవాంగ్ గ్యాల్ట్సన్ నిర్వాహకుల కృషిని అభినందిస్తూ.. భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను కొనియాడారు.

సత్సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ తాళ్లపాక మాట్లాడుతూ... "ఈ భారతీయత కార్యక్రమం మనల్ని మనం నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకునేందుకు, ఒక నాగరికతగా మనం సరైన దిశలోనే వెళ్తున్నామా లేదా అని ప్రశ్నించుకునేందుకు లభించిన గొప్ప సందర్భం. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ టైమ్స్ స్క్వేర్ వేదికపై 'భారతీయత-2026'ను ప్రదర్శించడం మరో అరుదైన ఘట్టం." అన్నారు.



చైతన్యరథం

# శాంతి ఒప్పందానికి స్వాగతం

## అమెరికా, ఇరాన్‌ల నిర్ణయంపై స్పందించిన ప్రధాని మోదీ



అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు. 'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది. సుస్థిరమైన తుది ఒప్పందం కుదిరేలా.. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా శాంతి ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు యుద్ధ చర్యలను నిలిపివేసి, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరవడానికి అంగీకరించాయి. దీనివల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పట్టాయి.



# హార్మూజ్ జలసంధిలో చిక్కుకుని..

## అల్లాడుతున్న 562 మంది భారత నావికులు

హోర్ముజ్ జలసంధిలో భారతీయ పతాకాలున్న 13 వాణిజ్య నౌకలు గత 108 రోజులుగా చిక్కుకుపోయాయి. వాటిల్లో మొత్తం 562 మంది భారతీయ నావికులు ఉన్నారు. జలసంధి పశ్చిమభాగంలో 329 మంది, తూర్పు భాగంలో 233 మంది ఉన్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. వారంతా గత మూడున్నర నెలలుగా సముద్రంలో నౌకల్లోనే దుర్భర జీవితాలు గడుపుతున్నారు. తమ నౌకను ఎటు కదిలిస్తే ఏ క్షిపణి వచ్చి మీదపడుతుందోనన్న భయంతో ఉన్నచోటనే కాలం వెళ్లదీస్తున్నారు. ఒమన్ తీరంలోని దఖమ్ పోర్టు వద్ద నిలిపి ఉంచిన ఎంటీ సెలెస్టియల్ అనే నౌకలో నిషాంత్ ఉర్తనాథన్ అనే నావికుడు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మృతదేహాన్ని వెంటనే భారత్‌కు తరలించే పరిస్థితి లేకపోవటంతో అది కుళ్లిపోకుండా ఉండేందుకు తోటి నావికులు దానిని చల్లని ఉప్పునీటిలో భద్రపర్చినట్లు తెలిసింది. మరోవైపు, ఒమన్ తీరంలోనే ఉన్న విరాట్-1 అనే నౌక ఇంజన్ విఫలం కావటంలో ఆదివారం సముద్రంలో మునిగిపోయింది. అందులోని 14 మంది భారత నావికులను ఒమన్ కోస్ట్‌గార్డు సహాయంతో రక్షించారు.

# దీదీ పార్టీకి దెబ్బ మీద దెబ్బ

## టీచర్‌ఉద్యోగాల కుంభకోణం కేసులో అభిషేక్ బెనర్జీపై ఈడీ విచారణ



ప్రైమరీ స్కూలు ఉద్యోగాల కుంభకోణం కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. దీనికి ఒకరోజు ముందే అసెంబ్లీలో విపక్ష నేత నియామకానికి సంబంధించి టీఎంసీ ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో సీఐడీ ముందు ఆయన హాజరయ్యారు.

సుమారు ఎనిమిదిన్నర గంటల సేపు విచారణను ఎదుర్కొన్నారు. కాగా, టీచర్ల రిక్రూట్‌మెంట్ స్కామ్ కేసులో కోల్‌కతాలోని సాల్ట్ లేక్ సీజీవో కాంప్లెక్స్‌లో ఉన్న ఈడీ కార్యాలయం ముందు మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో అభిషేక్ హాజరైనట్టు అధికారులు తెలిపారు. టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేయడంతో అభిషేక్ హాజరయ్యారు. ఫైనాన్షియల్ డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డులు, ఇతర నిందితుల వాంగ్మూలం ఆధారంగా అభిషేక్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్టు ఈడీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తాము సేకరించిన బ్యాంకు రికార్డులు, కమ్యూనికేషన్ డాటా ఆధారంగా మనీలాండరింగ్‌లో ఎవరెవరి ప్రమేయం ఉందో తెలుసుకుంటామని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల అధికారం కోల్పోయినప్పటి నుంచి ఆ పార్టీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అభిషేక్ బెనర్జీ, కల్యాణ్ బెనర్జీ వంటి పలువురు టీఎంసీ నేతలు జనాగ్రహుకున్నాయి. ఇదే సమయంలో ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేసిన ఆరోపణలను అభిషేక్ ఎదుర్కొంటున్నారు.



# కేరళలోనూ మహిళల ఉచిత బస్సు ప్రయాణం

కేఎస్ఆర్‌టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం కోసం కేరళం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రియదర్శని' స్కీమ్ అమల్లోకి వచ్చింది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి బిందు కృష్ణ సోమవారం స్వయంగా బస్సు ఎక్కి ప్రయాణం సాగించారు. ఈ సమయంలో ఆమెకు ఊహించని అనుభవం ఎదురయింది. బస్సు రద్దీగా ఉండటంతో అనుకోకుండా ఆమె తలపై, దుస్తులపై పాయసం ఒలికిపోయింది. దీంతో కొద్దిపాటి గందరగోళం నెలకొన్నప్పటీ మంత్రి సంయమనంతో వ్యవహరించి తన కార్యక్రమాన్ని కొనసాగించారు. కొల్లాం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మంత్రి బిందు కృష్ణ రద్దీగా ఉన్న బస్సులో ప్రయాణించారు. మంత్రికి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రయాణికులకు పాయసం పంచారు. బస్సు రద్దీగా ఉండటం, పాయసం అందిస్తుండగా అది కదలడంతో పాత్రలోని పాయసం ఆమె తలపై, దుస్తులపై ఒలికింది. ఆమె వెంటనే తుడుచునే ప్రయత్నం చేయడంతో కార్యకర్తలు సహాయం చేయడం కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి అనుగుణంగా 'ప్రియదర్శిని' పథకాన్ని ముఖ్యమంత్రి వీడి సతీశన్ చేతులమీదుగా సోమవారంనాడు ప్రారంభించింది. ఈ పథకం పేద, వర్కింగ్ మహిళలకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని చెప్పారు. పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సీపీ జాన్, ఎస్సీస ఎస్టీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి కేసీ తులసి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.




# కేరళలో మళ్లీ నిఫా వైరస్ కలకలం

## అప్రమత్తమయిన తమిళనాడు, ఊటీ, నీలగిరి, కోయింబత్తూర్ తదితర ప్రాంతాల్లో అత్యవసర ఏర్పాట్లు

పొరుగు రాష్ట్రమైన కేరళలో మళ్లీ 'నిఫా' వైరస్ కేసులు వెలుగుచూడటంతో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (గ్రామీణ), ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు.

# ఒప్పందం కుదిరింది!

## పశ్చిమాసియాపై శాంతి మేఘాలు - 19న డీల్‌పై సంతకాలు

కొన్ని నెలల పాటు ప్రపంచాన్ని కలవర పెట్టిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది, అమెరికా–ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయి. ఈ ఒప్పందం నేపథ్యంలో లెబనాన్ సహా ఇతర ప్రాంతాల్లో కూడా మిలటరీ ఆపరేషన్స్ నిలిచిపోనున్నాయి.

ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎలాంటి సుంకం లేకుండా హోర్ముజ్ జలసంధి తెరుచుకుంటుంది చెప్పారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని సైన్యాన్ని ఆదేశించానని కూడా తెలిపారు. అమెరికా నావికా దళ దిగ్బంధనం కూడా తొలగిస్తున్నట్టు చెప్పారు. షిప్‌ల ఇంజన్లను స్టార్ట్ చేయండి, ఆయిల్ తరలించండి అంటూ ఉత్సాహంగా పిలుపునిచ్చారు.




### హర్మ్యూజ్‌తో సర్దుకున్న అమెరికా

ఇరాన్‌తో శాంతి ఒప్పందంలో భాగంగా టోల్ రహిత హర్మ్యూజ్‌తోనే అమెరికా సర్దుకొన్నట్లు కనిపిస్తోంది. టెహ్రాన్‌లో ఒప్పందం. కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలో పేర్కొంటూ హర్మ్యూజ్ తెరుచుకొంటుందన్న విషయాన్ని తెలియజేశారు. అక్కడ టోల్ కూడా వసూలు చేయరని ఆయన నొక్కిచెప్పారు. వాస్తవానికి ఇరాన్ అణ్వాయుధాల ఊసు మాత్రం ఈ ఒప్పందంలో లేకపోవడం గమనార్హం.

### ఒప్పందాన్ని ధ్రువీకరించిన ఇరాన్

మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ డీల్ విషయాన్ని ధ్రువీకరించిన తర్వాతే ఇరాన్ స్పందించింది.

ఐఆర్‌జేసీ దళాలకు అనుబంధంగా పనిచేసే ఐఆర్ఐబీ వార్తా సంస్థ తొలుత దీనిని ఇరాన్ విజయంగా అభివర్ణించింది. ఒప్పందానికి వచ్చే పరిస్థితి అమెరికాకు కల్పించినట్లు పేర్కొంది. ఆ తర్వాత సుప్రీం నేషనల్ కౌన్సిల్ సెక్రటేయట్ ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించింది.

### శత్రువును నమ్మినట్టు కాదు..

ఈ పరిణామాలపై ఇరాన్ కూడా స్పందించింది. అమెరికాతో అవగాహన ఒప్పందం కుదిరిందని ప్రకటించింది. యుద్ధం ముగించేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ శాఖ మంత్రి ఘరీబా బాదీ ఈ ప్రకటన చేశారు. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో ఒప్పందంపై సంతకాలు చేస్తామన్నారు. ఈ దిశగా దాదాపు 60 రోజుల పాటు చర్చలు జరిగాయని చెప్పారు. అయితే, డీల్ చేసుకున్నంత మాత్రాన శత్రువులను నమ్మినట్లు కాదని కూడా ఘరీబా బాదీ చెప్పారు. అమెరికా హామీలకు కట్టుబడి ఉంటుందో లేదో పరిశీలిస్తామని అన్నారు. వాషింగ్టన్ తన వాగ్దానాలను పూర్తిగా నెరవేర్చినట్లు క్షేత్రస్థాయిలో నిర్ధారించుకున్న తర్వాతే.. తుది ఒప్పందం కోసం ప్రతిపాదించిన '60 రోజుల చర్చల కాలం' లోకి అడుగుపెడతామని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాదీ ఈ వివరాలను వెల్లడించారు. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ 'ప్రెస్ టీవీ' తో ఆయన మాట్లాడుతూ, రాబోయే శుక్రవారం (జూన్ 19) స్విట్జర్లాండ్‌లో ఈ ఒప్పందంపై అధికారిక సంతకాల కార్యక్రమం జరుగుతుందని, ఆ తర్వాతే ఈ అవగాహన ఒప్పందం పూర్తి పాఠాన్ని బహిరంగపరుస్తామని చెప్పారు. ఈ ఒప్పందం దౌత్యం వల్ల మాత్రమే సాధ్యం కాలేదని, ఇరాన్ సాధించిన సైనిక విజయాలు, అమరవీరుల త్యాగాల వల్లనే శత్రువు లొంగివచ్చాడని ఘరీబాబాదీ వ్యాఖ్యానించారు.

### ఇరాన్ 3 ప్రధాన షరతులు

తుది చర్చల దశకు వెళ్లడానికి ముందు అమెరికా ఈ బాధ్యతలను నెరవేర్చిందో లేదో ఇరాన్ మొదట నిర్ధారించుకుంటుందని ఘరీబాబాదీ తెలిపారు.

1. యుద్ధాన్ని పూర్తిగా ముగించడం. 2. హోర్ముజ్ జలసంధిపై విధించిన నావికా దళాల దిగ్బంధాన్ని ఎత్తివేయడం. 3. ఫ్రీజ్ చేసిన ఇరాన్ ఆర్థిక ఆస్తులను విడుదల చేయడం. ఈ నిబంధనలను అమెరికా అమలు చేస్తేనే తదుపరి 60 రోజుల తుది చర్చల్లో పాల్గొంటామని, లేదంటే వెనక్కి తగ్గుతామని ఇరాన్ హెచ్చరించింది. ఈ ముసాయిదా ఒప్పందంలో ఇరాన్ తన కీలక డిమాండ్లన్నింటినీ పొందుపరిచిందని ఆయన వివరించారు.

### పశ్చిమాసియాను మార్చేస్తుంది: వాన్స్

తాజాగా ఇరాన్ కుదిరిన ఒప్పందం రానున్న 50 ఏళ్లలో పశ్చిమాసియా మౌలిక స్వరూపాన్నే మార్చేస్తుందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. టెహ్రాన్ ఇక ఎప్పటికీ అణ్వాయుధాలు సంపాదించలేదన్నారు. కాకపోతే శుక్రవారం జరగనున్న సంతకాల కార్యక్రమానికి ఎవరు వెళ్లాలన్న అంశంపై ట్రంప్ కార్యవర్గం ఆలోచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మరోవైపు ట్రంప్ నకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సెనెటర్ లిండ్సే గ్రాహం మాత్రం ఆచితూచి స్పందించారు. అమెరికా బృందం కంటే భిన్నంగా ఇరాన్ ఈ ఒప్పందాన్ని చూస్తుందని అభిప్రాయపడ్డారు. టెహ్రాన్ అణ్వాయుధాలను వదులుకోవడంపై సందేహాలను వ్యక్తంచేశారు.

## శాంతి ఒప్పందంపై ప్రపంచ దేశాల హర్షం

మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. "అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్ హర్మ్యూజ్ అలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్–రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నామని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్ ధీర్ జయస్వాల్ వెల్లడించారు.


జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ స్పందిస్తూ.. అమెరికా–ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం అన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అన్నారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. ఇరాన్–అమెరికా డీల్ శుభపరిణామం అన్నారు. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మ్యూజ్ జలసంధిని త్వరగా, బేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని స్పష్టం చేశారు.

బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పందిస్తూ.. ఇరాన్–అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మ్యూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరిలో ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు.

తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ మాట్లాడుతూ 'ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుందన్నారు. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు తాము నిరంతరం మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.

## స్టాన్‌ఫోర్డ్‌లో సుందర్ పిచాయ్‌కు నిరసన



అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ప్రసంగాన్ని బహిష్కరించి పలువురు స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు వాకౌట్ చేశారు. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ వ్యతిరేకత వ్యక్తమైంది. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గూగుల్‌కు కుదుర్చుకున్న ఒప్పందాన్ని నిరసిస్తూ విద్యార్థులు వేదిక వద్ద నుంచి వెళ్లిపోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..ఈ నిరసనకు ప్రాజెక్ట్ నింబస్ కారణం. ఇజ్రాయెల్, గూగుల్, అమెజాన్ మధ్య కుదిరిన ఈ క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కాంట్రాక్ట్ విలువ 1.2 బిలియన్ డాలర్లు. గాజాలో ఘర్షణ విషయంలో ఇజ్రాయెల్ ప్రభుత్వ కార్యకలాపాలకు ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రయోజనం చేకూరుతోందని స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారం ముందే వాకౌట్ గురించి ప్రకటించారు.

కాగా.. తన ప్రసంగాన్ని కొనసాగించిన పిచాయ్ స్టాన్‌ఫోర్డ్‌లో తాను చదివిన రోజుల్ని గుర్తుచేసుకున్నారు. ఆశావహ దృక్పథం అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రతీ తరం తమదైన రీతిలో కష్టాలను ఎదుర్కొందన్న విషయాన్ని గుర్తుచేశారు. మనం డిగ్రీలు తీసుకొని ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత అదెలా ఉండాలో మనం ఎంచుకోలేం. కానీ, పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలనేది మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది" అని విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల వాకౌట్ గురించి ఆయనకు ప్రశ్న ఎదురైంది. అయితే ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు పిచాయ్ ఆసక్తి చూపలేదు.

## ఒప్పందానికి అడ్డంకిలా ఇజ్రాయెల్



ఇరాన్– అమెరికా మధ్య శాంతి ఒప్పందానికి అడ్డం పడేలా ఇజ్రాయెల్ అడ్డం వ్యవహరిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపితేనే ఒప్పందం కుదురుతుందని ఇరాన్ స్పష్టంచేసినా.. ఇజ్రాయెల్ మాత్రం ఆ దేశంపై క్షిపణులతో విరుచుకుపడుతోంది. లెబనాన్‌పై శాశ్వతంగా సైనిక ఆపరేషన్లను నిలిపివేయాలని ఇరాన్ ఒప్పందంలో నిబంధన పెట్టింది. ఈ సమయంలో కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

అదే సమయంలో యూఎస్–ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇతమార్ బెన్–గ్విర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంత రాజ్యం కాదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు గతంలో ఎదురైన గుణపాఠాల ఆధారంగా ఈ డీల్ విషయంలో స్పందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ట్రంప్ ఒప్పందానికి మేము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. మేము యూఎస్‌కు సామంత రాజ్యం కాదు.. ఇజ్రాయెల్ ఒక సార్వభౌమదేశం. అయితే, మేము స్పష్టంగా చెప్పదలుచుకున్నది ఏంటంటే.. యూఎస్ఏ అంటే మాకెంతో గౌరవం, అధ్యక్షుడు ట్రంప్‌కు ఎంతో రుణపడి ఉన్నామని బెన్–గ్విర్ అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల ఒత్తిడికి లొంగిపోయి చివరకు రక్తంతో మూల్యం చెల్లించుకున్నామని అన్నారు. ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నామని చెప్పారు. ఓస్లో ఒప్పందం, 2006 లెబనాన్ ఒప్పందం, గాజాలో ఎదురైన పరిస్థితులను కూడా మంత్రి ప్రస్తావించారు. ఆ అనుభవంతోనే యూఎస్ - ఇరాన్ డీల్‌ను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

తాజాగా కుదిరిన శాంతి ఒప్పందం ప్రకారం, అన్ని రకాల మిలిటరీ చర్యలకు తక్షణం ఫుల్ స్టాప్ పెట్టాలని అమెరికా, ఇరాన్‌లు అంగీకరించాయి. లెబనాన్ సహా తమ మిత్రపక్షాలెవరిపైనా ఎలాంటి దాడులు జరగకూడదని ఇరాన్ షరతు విధించింది. ఇందుకు యూఎస్ అంగీకరించింది. అయితే, డీల్‌కు కొన్ని గంటల ముందు కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులకు దిగటం గమనార్హం.

# సూపర్ ఓవర్‌లో శ్రీలంక- ఏ విజయం

### ముక్కోణపు వన్ డే సిరీస్‌లో భారత్ -ఏ పరాజయం - భారత బ్యాటర్లలో రాణించిన సూర్యాంశ్, విప్రాజ్ నిగం

ముక్కోణపు సిరీస్‌లో భాగంగా సోమవారం శ్రీలంకలోని దంబుల్లాలో జరిగిన వన్‌డే మ్యాచ్‌లో భారత్ ఏపై శ్రీలంక ఏ విజయం సాధించింది. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్లో ఫలితం తేలింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యఛేదనలో శ్రీలంక ఏ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్లో శ్రీలంక ఏ 16 పరుగులు చేయగా.. భారత్ 10 పరుగులే చేసింది. శ్రీలంక బ్యాటర్లలో సమర విక్రమ 93 పరుగులు చేశాడు. భారత్ ఏ బౌలర్లలో ఆయుష్ బదోని 2 వికెట్లు తీయగా.. అర్షద్‌ఖాన్, నిషాంత్ సింధు, విప్రాజ్ నిగం, అనుకుల్ రాయ్, సూర్యాంశ్ షెడ్గే తలో వికెట్ తీశారు.

తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాంష్ 72), విప్రాజ్ నిగమ్ (51) హాఫ్ సెంచరీలు చేశారు. అయితే, శ్రీలంక 10/0 స్కోరుతో లక్ష్య ఛేదనను ప్రారంభించనుంది. భారత బ్యాటర్ విప్రాజ్ నిగమ్ రెండుసార్లు డేంజర్ ఏరియాలోకి రావడంతో అంపైర్లు పది పరుగులను పెనాల్టీగా విధించి.. శ్రీలంక ఇన్నింగ్సుకు కలిపారు. దీంతో ఆ జట్టు లక్ష్యం 50 ఓవర్లలో 256 పరుగులు అయింది.

టాస్ ఓడి బ్యాటింగుకు దిగిన టీమ్ ఇండియాకు వైభవ్ సూర్యవంశీ (21: 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) మంచి ఆరంభమే ఇచ్చాడు. దూకుడుగా ఆడే క్రమంలో వైభవ్ పెవిలియనుకు చేరాడు.



మరికాసేపటికే ప్రభ్ సిమ్రన్ (11) కూడా ఔటయ్యాడు. అనంతరం క్రీజ్లోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ (23), వైస్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (37) కాసేపు వికెట్ల పతనాన్ని ఆపారు. మూడో వికెటుకు 52 పరుగులు జోడించారు. శ్రీలంక స్పిన్నర్ల దెబ్బకు స్వల్ప వ్యవధిలో భారత్ వికెట్లను చేజార్చుకుంది. వీరిద్దరితోపాటు ఆయుష్ బదోని (15), నిషాంత్ సింధు (6) పెవిలియన్‌కు చేరడంతో భారత్ సగం ఓవర్లకే ఆరు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది.

**ఆదుకొన్న సూర్యాంశ్ షెడ్గే - విప్రాజ్**

అనుకుల్ రాయ్ (8) కూడా ఏడో వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. సూర్యాంష్‌తో జత కలిసిన విప్రాజ్ నిగమ్ ఆరంభంలో నెమ్మదిగా ఆడాడు. కాస్త కుదురుకున్నాక ఇద్దరూ హిట్టింగ్ మొదలు పెట్టారు. దాదాపు 15 ఓవర్ల పాటు వికెట్ ఇవ్వకుండా ఆడారు. ఎనిమిదో వికెట్‌కు శతకం (104) భాగస్వామ్యం నిర్మించారు. ఆఖర్లో అనవసరంగా విప్రాజ్ రనౌట్‌గా పెవిలియన్ కు చేరాడు. శ్రీలంక బౌలర్లలో విజయ్కంత్ 3, షిరాజ్ 3.. సహన్, ముతులన్, వనుజా సహన్ తలో వికెట్ తీశారు.

**మూడు పెనాల్టీలు..**

ఈ మ్యాచ్ లో మూడు పెనాల్టీలు పడ్డాయి. అందులో ఒకసారి శ్రీలంకకు.. రెండుసార్లు భారత్కు ఎదురయ్యాయి. దీంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించకుండానే 10 పరుగులు శ్రీలంక ఖాతాలోకి చేరాయి. ఇక భారత్కు ఐదు పరుగులు కలిసి వచ్చాయి. భారత బ్యాటర్ విప్రాజ్ రెండుసార్లు డేంజర్ ఏరియాలోకి రావడంతో పెనాల్టీలు తప్పలేదు. ఇక శ్రీలంక బౌలింగ్ చేస్తుండగా.. బంతి వికెట్ల వెనుక కీపర్ హెల్మెట్ను తాకింది. దీంతో ఆ జట్టుకు పెనాల్టీ పడింది.



## టీ20 సిరీస్ విండీస్ కైవసం

**మూడో మ్యాచ్‌లో శ్రీలంకపై విజయం**

స్వదేశంలో శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. భారత కాలమాన ప్రకారం సోమవారం తెల్లవారుజామున జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయాన్ని అందుకుంది. విండీస్ బౌలర్ షమర్ జోసెఫ్ ఐదు వికెట్లతో లంక పతనాన్ని శాసించగా, బ్యాటింగ్లో రూథర్‌ఫోర్డ్, హెూల్డర్ మెరుపులు మెరిపించారు.

తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. దునిత్ వెల్లలాగె (43 పరుగులు) టాప్ స్కోరర్గా నిలవగా, కమిల్ మిశారా (28), నిస్సాంక (26) పర్వాలేదనిపించారు. విండీస్ బౌలర్లలో షమర్ జోసెఫ్ 5 వికెట్లు తీయగా, అకిల్ హెుసెన్, మాథ్యూ ఫోర్డె, జాసన్ హోల్డర్, రోస్టన్ చేజ్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన విండీస్ జట్టు 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి విజయం సాధించింది.

53 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన విండీస్‌ను రోవ్మెన్ పావెల్ (33), రూథర్‌ఫోర్డ్ (54 నాటౌట్) చక్కదిద్దడమే గాక జట్టును విజయంవైపు నడిపించారు. ఈ ఇద్దరు కలిసి ఐదో వికెట్‌కు 81 పరుగులు జోడించారు. విజయానికి చేరువవుతున్న క్రమంలో పావెల్ ఔటైనప్పటికీ, క్రీజులోకి వచ్చిన జాసన్ హోల్డర్ (5 బంతుల్లో 21 నాటౌట్) మూడు భారీ సిక్సర్లు బాది వెస్టిండీస్ ను గెలిపించాడు.

లంక బౌలర్లలో హసరంగ రెండు వికెట్లు తీయగా, వెల్లలాగె, దుష్మంత చమీర, తీక్షణ తలా ఒక వికెట్ తీశారు. షమర్ జోసెఫ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' కూడా గెలుచుకున్నాడు. 2024 తర్వాత వెస్టిండీస్ తమ సొంతగడ్డపై టీ20 సిరీస్ నెగ్గడం విశేషం. ఇరుజట్ల మధ్య జూన్ 25 నుంచి అంటిగ్వా వేదికగా తొలి టెస్టు జరగనుంది.

# ఐవరీ కోస్ట్ సంచలన విజయం

**ఈక్వెడార్ విజయపరంపరకు బ్రేక్**

ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా గ్రూప్-ఈలో సోమవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్‌పై 1-0 తేడాతో ఐవరీ కోస్ట్ సంచలన విజయం సాధించింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్లుగా సాగిన పోరులో ఐవరీ కోస్ట్ మిడ్ ఫీల్డర్ అమడ్ డియాల్లో గోల్ కొట్టడంతో థ్రిల్లింగ్ విక్టరీని నమోదు చేసింది. దీంతో 19 మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగని ఈక్వెడార్‌కు ఐవరీకోస్ట్ బిగ్ షాకిచ్చినట్లు అయింది.

మ్యాచ్ విషయానికి వస్తే.. ఆట ప్రారంభం నుంచి ఇరుజట్లు పోటాపోటీగా తలపడ్డాయి. తొలి అర్ధ భాగంలో ఈక్వెడార్ పదే పదే అటాకింగ్ గేమ్ ఆడి ఐవరీకోస్ట్‌ను భయపెట్టింది. అంతేకాదు ఈక్వెడార్ రెండుసార్లు క్రాస్‌బార్‌ను తాకినప్పటికీ ఐవరీ కోస్ట్ గోల్ కీపర్ సమర్థంగా అడ్డుకోవడంతో గోల్స్ రాలేదు. రెండో అర్ధ భాగంలో కూడా గోల్ కోసం ఇరుజట్లు చేసిన చాలా ప్రయత్నాలు సఫలం కాలేదు. ఇక మ్యాచ్ డ్రాగా ముగుస్తుందన్న అందరూ భావించారు.

చివరి నిమిషంలో ఊహించని పరిణామం చోటుచేసుకుది. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా.. 90వ నిమిషంలో ఐవరీ కోస్ట్ మిడ్‌ఫీల్డర్ అమడ్ డియాల్లో గోల్ కొట్టడంతో ఆ జట్టు బోణీ కొట్టింది. ఆ తర్వాత ఎక్స్‌ట్రా టైమ్‌లో ఈక్వెడార్ గోల్ కొట్టడంలో విఫలం కావడంతో ఐవరీ కోస్ట్ ఖామమైంది. ఈ విజయంతో 3 పాయింట్లతో ఐవరీ కోస్ట్ టోర్నీలో బోణీ కొట్టగా, ఈక్వెడార్ ఇంకా ఖాతా తెరవలేదు.

**ట్యునీషియాపై స్వీడన్ గెలుపు**

ఫిఫా ప్రపంచ కప్‌లో స్వీడన్ తన ప్రత్యర్థి ట్యునీషియాపై 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే యాసిన్ అయారి గోల్ కొట్టి స్వీడన్‌కు ఆధిక్యం ఇచ్చాడు. ఆ తర్వాత అలెక్సాండర్ ఐసాక్ (30వ నిమిషం) గోల్‌తో స్వీడన్ 2-0 లీడ్ సాధించింది. అయితే, ట్యునీషియా ఆటగాడు ఒమర్ రెకిక్ 43వ నిమిషంలో గోల్ కొట్టాడు. దీంతో స్వీడన్ ఆధిక్యం 2-1కి తగ్గింది. కానీ, పదేపదే ట్యునీషియా గోల్ పోస్టుపై ఎటాక్ చేసిన స్వీడన్ ఫలితాన్ని సాధించింది. విక్టోర్ (59వ నిమిషం), మాట్టియస్ (84వ నిమిషం) గోల్స్‌తో స్వీడన్ విజయం ఖరారు అయింది. అదనపు ఆరు నిమిషాల ఆట మరికాసేపట్లో ముగుస్తుందనగా యాసిన్ అయారి మరో గోల్ కొట్టి స్వీడన్‌కు 5-1 ఆధిక్యం అందించాడు.

**జపాన్, నెదర్లాండ్స్ మ్యాచ్ డ్రా**

జపాన్, నెదర్లాండ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇరు జట్లలో కొందరు కీలక ఆటగాళ్లు గాయాల వల్ల మ్యాచ్ ఆడలేదు. అయితే, జపాన్‌తో పోలిస్తే నెదర్లాండ్స్ కాస్త బలమైన జట్టే. ఒక దశలో జపాన్ ఓడిపోయే పరిస్థితి వచ్చినపప్పటికీ చివర్లో గోల్‌తో డ్రా చేసుకోగలిగింది. తొలి అర్ధభాగం వరకూ ఇరు జట్లూ గోల్ చేయలేదు. కానీ, 51వ నిమిషంలో నెదర్లాండ్స్ ఆటగాడు విర్గిల్ వాన్ గోల్ కొట్టాడు. ఆ కాసేపటికే జపాన్ ప్లేయర్ కీటో నకముర (57వ నిమిషం) గోల్‌తో స్కోరును సమం చేశాడు. మళ్లీ 64వ నిమిషంలో నెదర్లాండ్స్ తరపున క్రిసెన్సియో గోల్ సాధించాడు. దీంతో 2-1 ఆధిక్యంతో నెదర్లాండ్స్ విజయం వైపు దూసుకెళ్లింది. ఆట 89వ నిమిషంలో డైచీ కమద అద్భుతమైన గోల్ తో జపాను ఓటమి నుంచి తప్పించాడు. చివరికి 2-2తో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

**జర్మనీ భారీ గెలుపు**

నాలుగుసార్లు ఛాంపియన్ జర్మనీకి ఫిఫా ప్రపంచకప్ లో అదిరే ఆరంభం దక్కింది. గ్రూప్-ఇ మ్యాచ్ లో ఆ జట్టు 7-1 గోల్స్‌తో అరంగేట్ర దేశం కురసావ్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచే జర్మనీ జోరు మొదలైంది. ఫిలిక్స్ మెచా (6వ నిమిషం) చేసిన గోల్‌తో జర్మనీ ఖాతా తెరిచింది. 21వ నిమిషంలో లివానో గోల్ తో కురసావో స్కోరు సమం చేసింది. అయితే తర్వాత ఆటలో జర్మనీదే పూర్తి ఆధిపత్యం. దీంతో జర్మనీ 4-1తో బ్రేక్ కు వెళ్లింది. విరామం తర్వాతా జర్మనీ దూకుడు కొనసాగింది. బ్రౌన్ (68వ), డెనిజ్ (18వ) స్కోర్ చేయడం.. కై రెండో గోల్ (88వ) సాధించడంతో జర్మనీ భారీ విజయాన్నందుకుంది.

**అదరగొట్టిన ఆస్ట్రేలియా**

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా అదరగొట్టింది. గ్రూప్-డి మ్యాచ్‌లో దూకుడైన ఆటతో ఆ జట్టు 2-0తో తుర్కియేను చిత్తు చేసింది. వరుసగా ఆరో ప్రపంచకప్ ఆడుతున్న ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 60 శాతానికిపైగా బంతిని తన ఆధీనంలో ఉంచుకుంది. 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ప్రపంచకప్‌నకు వచ్చిన తుర్కియేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆ జట్టు ప్రయత్నాలను గట్టిగా అడ్డుకుంది. 27వ నిమిషంలో నెస్టోరి చేసిన గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి వెళ్లింది. ద్వితీయార్ధంలోనూ ఆస్ట్రేలియా దాడులు కొనసాగించింది. 75వ నిమిషంలో బంతిని దొరకబుచ్చుకున్న కానర్.. ఓ లాంగ్ షాట్తో గోల్ చేసేశాడు. ఆ తర్వాత తుర్కియే గోల్ ప్రయత్నాలను అడ్డుకున్న ఆస్ట్రేలియా తేలిగ్గా విజయాన్ని అందుకుంది. గోల్కీపర్ ప్యాట్రిక్ బీచ్ ఎనిమిది సేవ్ లతో ఆసీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.




**స్కాట్లాండ్ 36 ఏళ్ల తర్వాత..**

28 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్‌లో ఆడుతున్న స్కాట్లాండ్ బోణీ కొట్టింది. గ్రూప్-సి మ్యాచ్లో ఆ జట్టు 1-0తో హైతీని ఓడించింది. స్కాట్లాండ్‌కు హైతీ గట్టి పోటీనే ఇచ్చింది. ప్రత్యర్థి దాడులను సమర్థంగా ఎదుర్కొంటూనే ఎదురుదాడులు చేసింది. 28వ నిమిషంలో స్కాట్లాండ్ ఆధిక్యంలోకి వెళ్లింది అక్కడ నుంచి స్కోరు సమం చేయడానికి హైతీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 1990 తర్వాత ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌కు ఇదే తొలి విజయం.

**స్విట్జర్లాండ్ సెల్ఫ్‌గోల్: ఖతార్‌కు తొలిసారి పాయింట్**

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఖతార్ తొలిసారిగా ఒక పాయింట్ సాధించింది. బలమైన స్విట్జర్లాండ్‌తో పోరులో చాలా వరకు వెనుకబడే ఉన్నా, ఇంజురీ టైంలో ప్రత్యర్థి జట్టు సెల్ఫ్ గోల్ చేయడంతో మ్యాచ్‌ను1-1తో డ్రా చేసుకుంది. ఆదివారం గ్రూప్-బి మ్యాచ్లో ఆరంభం నుంచి స్విట్జర్లాండ్ ఆధిపత్యం ప్రదర్శించింది. స్థిరంగా ఖతార్ గోల్ పోస్టుపై దాడులు చేసిన ఆ జట్టు చాలాసార్లు గోల్ చేసే అవకాశాలు సృష్టించుకుంది. కానీ ఖతార్ గోల్ కీపర్ మహ్మద్ అబూనాడా అద్భుతమైన సేవ్లతో స్విట్జర్లాండ్ ప్రయత్నాలను అడ్డుకున్నాడు. అయితే 17వ నిమిషంలో బ్రీల్ ఎంబోలో పెనాల్టీని గోల్ గా మలిచి స్విట్జర్లాండ్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అక్కడి నుంచి స్విస్ జట్టు దాడులను మరింత తీవ్రతరం చేయగా.. ఖతార్‌కు కాచుకోవడమే సరిపోయింది. అయితే ఇంజురీ టైంలో (94వ నిమిషం) స్విట్జర్లాండ్ ఆటగాడు మిరో సొంత గోల్ కి బంతిని పంపడంతో ఖతార్ డ్రాతో గట్టెక్కింది. ప్రపంచకప్లో తొలి పాయింట్ దక్కడం, స్విస్ లాంటి బలమైన జట్టు చేతిలో ఓటమి తప్పడంతో ఖతార్ ఆటగాళ్లు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.

# తన దాకా వస్తేగానీ...



నిర్మాతల కష్టాలు హీరో రామ్ పోతినేనికి తెలిసొస్తున్నాయి. ఇంతకు ముందు హీరోగా చేసి, హాయిగా తన రెమ్యునరేషన్ తీసుకునేవారు రామ్. కానీ, ఇప్పుడాయన తన తాజా సినిమాకు దర్శకుడిగా, నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న సినిమాకు సంబంధించి ఇటీవలే అధికారిక ప్రకటన కూడా వచ్చింది. ఇప్పుడీ సినిమా బడ్జెట్ విషయంలో రామ్ ప్రతీది లెక్కలేసుకుని మరీ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

అంతకు ముందు సినిమాకు రూ.25 కోట్ల వరకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసిన రామ్.. వరుస పరాజయాలతో కేవలం లాభాల్లో షేరింగ్ మాత్రమే అనే స్థాయికి చేరుకున్నారు. ఆయన హీరోగా నటించిన చివరి సినిమా 'ఆంధ్రా కింగ్ తాలుకా'కు కూడా ప్రాఫిట్ షేర్ పద్ధతిలోనే పని చేశారు. ఇప్పుడు తన తదుపరి సినిమాను తనే స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహిస్తుండటంతో.. భారీ రెమ్యునరేషన్లు, సెట్స్‌పై జరిగే వృథా ఖర్చులను కంట్రోల్‌లో ఉంచుకునేలా ముందడుగు వేస్తున్నట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్ తొలిసారి తనే నిర్మాతగా వ్యవహరిస్తుండటంతో.. సినిమా బడ్జెట్ విషయంలో ఆచి తూచి అడుగులు వేస్తున్నట్లుగా సమాచారం. ఆ వివరాల్లోకి వెళితే..

ఈ సినిమాలో మెయిన్ విలన్ పాత్ర కోసం ఎస్.జె. సూర్యను సంప్రదించారట. ఎస్‌జె సూర్య ఏకంగా రూ.8 కోట్ల భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేయడంతో, రామ్ ఇప్పుడు ఇతర ప్రత్యామ్నాయాల కోసం వెతుకులాట ప్రారంభించారని తెలుస్తోంది. ఇక హీరోయిన్ పాత్ర కోసం రామ్ టీమ్ శ్రీనిధి శెట్టిని సంప్రదించగా, ఆమె రూ.1.5 కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందట. ఆ వెంటనే కయాదు లోహర్‌ను సంప్రదించి, ఆమెతో చర్చలు జరుపుతున్నట్లుగా టాక్ నడుస్తోంది. ఒకవేళ కయాదు డేట్స్ అడ్జస్ట్ చేయలేక పోతే, ఆపాత్రకు సంయుక్తను తీసుకోవాలని రామ్ ప్లాన్‌చేస్తున్నారట. రెమ్యునరేషన్ల పరంగా బడ్జెట్‌ను తగ్గించి, క్వాలిటీ సినిమాను అందించాలనే ఆలోచనలో రామ్ ఉన్నారని తెలుస్తోంది. మరి ఆయన ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో వేచి చూడాల్సిందే. రామ్ సోదరుడు కృష్ణ చైతన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# సల్మాన్‌తో రాజ్ నిడిమోరు సినిమా!



మరో ఇంటరెస్టింగ్ కాంబినేషన్ సెట్ అవుతోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్ లో ఈ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్లో రూపొందుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

# 19 నుండి ఆహాలో 'రేజర్'



వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే రవిబాబు నుంచి వచ్చిన తాజా చిత్రం 'రేజర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ మే 8న థియేటర్స్‌కు వచ్చింది. డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌గా విడుదలైన 'రేజర్' యాక్షన్ ప్రియులను మెప్పించింది. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. జూన్ 19 నుండి ఆహా వేదికగా స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది.

విష్ణు (తనీష్) సీసీ కెమెరాలకు సంబంధించిన ఓ కంపెనీని నిర్వహిస్తుంటాడు. భార్య లక్ష్మి, కూతురు తేజు ఇద్దరే అతడి ప్రపంచం. ఆయన అమర్చిన ఓ సీసీ కెమెరాలో ముఖ్యమంత్రి హత్యకు సంబంధించిన విజువల్స్ రికార్డ్ అవుతాయి. సీఎం పీఠం ఎక్కాలనుకున్న హోం మంత్రే ఆ దారుణానికి పాల్పడతాడు. అన్ని జాగ్రత్తలు తీసుకుని హత్య చేసినా, విష్ణు అమర్చిన సీసీ కెమెరాలో హత్యోదంతం రికార్డు కావడంతో హోంమంత్రి కంగారు పడతాడు. వెంటనే విష్ణుని హత్య చేయిస్తాడు. అయితే సీసీ కెమెరాలో రికార్డ్ అయిన విజువల్స్ మాత్రం హోం మంత్రి గ్యాంగ్‌కు దొరక్కుండా దాచేస్తాడు విష్ణు. తండ్రి హత్యని ప్రత్యక్షంగా చూసిన చిన్నారి తేజు ప్రాణాపాయ స్థితిలో పడుతుంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ పాపను రక్షించే బాధ్యత రేజర్ (రవిబాబు) తీసుకుంటాడు. కుక్కల సంరక్షకుడిగా పనిచేసే రేజర్ నేపథ్యం ఏమిటి? హోం మంత్రి, అతడి ముఠా నుంచి పాపని ఎలా రక్షించాడు? ఈ కథలో రుద్ర ఎవరు? అన్నది మిగిలిన కథ.

## రివెంజ్ డ్రామా..

# ఇసకపట్నం!



వ్యాపారం చేయడానికి కావాల్సింది చేతులు కాదు..గుండెల్లో దమ్ము.ఆ దమ్ము పేరు నాయుడు..అంటున్నారు సముద్రఖని. ఐశ్వర్య రాజేష్, సునీల్‌తో కలిసి ఆయన కీలక పాత్రలో నటించిన తాజా వెబ్ సిరీస్ 'ఇసకపట్నం'.నరేష్ అగస్త్య, రాజీవ్ కనకాల, మైమ్ గోపి, తదితరులు నటిస్తున్నారు.ఎడిటర్‌గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో జులై 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ వెబ్‌సిరీస్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

**రివెంజ్ డ్రామా..**

సినిమాలకు దీటుగా ప్రేక్షకులను అలరించడానికి ఓటీటీ వేదికలు వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నాయి.ఇప్పుడు వస్తున్న 'ఇసకపట్నం' కూడా అదేస్థాయిలో తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రంచూస్తే అర్థమవుతోంది. పోర్ట్ నేపథ్యంలో సాగే రివెంజ్ డ్రామాగా దీనిని తీర్చిదిద్దారు. అక్కడ సాగే అక్రమ దందాలన్నింటికీ నాయుడు కేంద్ర బిందువు. అలాంటి నాయుడిపై అతడి కుమార్తె ఎందుకు పోరాటం చేయాల్సి వచ్చింది? ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఎలాంటి సంఘర్షణ చోటు చేసుకుంది? తదితర అంశాలకు వాస్తవ పరిస్థితులు జోడించి ఒక ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ గ్యారీ బీహెచ్ ఈ సిరీస్ ను తీర్చిదిద్దారు. 'ఒక మనిషి బలాన్ని లాక్కోవాలంటే చంపాల్సిన అవసరంలేదు. చచ్చేంత పనిచేస్తే చాలు' వంటి సంభాషణలు మెప్పిస్తున్నాయి. తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లీష్ సహా మొత్తం 15 భాషల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

## బుల్లితెర నటి సంచిత ఉగాలే ఆత్మహత్య

బుల్లితెర నటి సంచిత ఉగాలే ఆత్మహత్య చేసుకున్నారు. ముంబయిలోని అచోలే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.కుటుంబసభ్యులు బయటకు వెళ్లి వచ్చేసరికి సంచిత(22) ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమె ఆత్మహత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు. 'కుంకుమ భాగ్య' సీరియల్ దియా టాండన్‌గా సంచిత బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తనదైన నటనతో ప్రేక్షకులను అలరించారు. అలాగే 'వాగ్లేకి దునియా', టీవీ డ్రామా 'దిల్వాలీ దుల్హా లే జాయేగి', తదితర వాటిల్లో నటించి మెప్పించారు. సంచిత ప్రస్తుతం తన తల్లిదండ్రులు, సోదరితో కలిసి నలసోపరాలో ఉంటున్నారు. ఈ ఘటనజరిగినప్పుడు ఇంట్లో సంచిత ఒక్కరే ఉన్నారని పోలీసులు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల సమయంలో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది..

ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం ఇప్పటి వరకూ తెలియరాలేదు. ఘటన జరిగిన ప్రాంతంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే కుటుంబ సభ్యులనుంచి వాంగ్మూలాన్ని తీసుకున్నారు. అదే సమయంలో ఇతర సహ నటులను సైతం విచారిస్తున్నారు. సంచిత మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయి.. నివేదిక వచ్చాక తదుపరి విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.



## నా జీవితంలో అదే అత్యంత ఆనందకరం

బెస్ట్ ఫ్రెండ్‌ను వివాహం చేసుకోవటమే తన జీవితంలో ఆత్యంత ఆనందకర సంఘటన అని నేషనల్ రష్మిక అన్నారు. రష్మిక ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించారు. ఇదే కార్యక్రమంలో తన వైవాహిక జీవితంపై ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా "జీవితంలో మీరు తీసుకున్న అత్యంత సంతోషకరమైన నిర్ణయం ఏంటి?"అని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.మీ జీవితం గురించి ఒక్కమాటలో చెప్పండి? అని అడగ్గా.. "అది ఒక్కమాటలో చెప్పలేను. నా కల నిజం కావడం అని చెబుతాను" అని రష్మిక పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని, కెరీర్ బాగుందని ఆమె చెప్పారు. ఇదే సెషన్ లో రష్మిక తన రాబోయే సినిమా 'కాక్‌టెయిల్ 2' గురించి కూడా మాట్లాడారు. 'షాహిద్ కపూర్, కృతి సనన్‌తో కలిసి నటించడం చాలా సరదాగా ఉంది. సెట్లో మేం బాగా ఎంజాయ్ చేశామని తెలిపారు. ఈ సినిమా జూన్ 19న థియేటర్లలోకి రానుంది. పెళ్లి తర్వాత రష్మిక చేస్తున్న మొదటి హిందీ సినిమా ఇదే కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక, రష్మిక, నటుడు విజయ్ దేవరకొండ చాలా ఏళ్లుగా మంచి స్నేహితులు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం తెలిసిందే.

### అందం రహస్యం ఆనందమే..



మెరిసే చర్మం వెనుక రహస్యం ఏంటని అడిగితే సాధారణంగా హీరోయిన్లు.. క్రీములు, ఫేస్ ప్యాక్‌ల పేర్లు చెబుతుంటారు. రష్మిక మాత్రం 'మనసులో ఆనందం' అంటున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో అభిమానులతో ముచ్చటించిన ఆమె.. తన గ్లోయింగ్ స్కిన్ సీక్రెట్ బయటపెట్టారు. ఒక అభిమాని రష్మికను ఆమె బ్యూటీ వెనుక ఉన్న రహస్యం ఏంటని అడగ్గా.. దానికి 'ఎప్పుడూ సంతోషంగా ఉండండి. మిమ్మల్ని నవ్వించే వాళ్లతోనే ఉండండి. మనలోని ఆ అమాయకత్వాన్ని కాపాడుకుంటేనే నిజమైన ఆనందం దొరుకుతుందని ఆమె జవాబిచ్చారు. మనసు సంతోషంగా ఉంటే ముఖం దానంతట అదే మెరుస్తుందని వివరించారు. బ్యూటీ ప్రొడక్ట్స్ కంటే పాజిటివిటీనే అసలైన అందమని రష్మిక చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.